
'సంక్షేమ పథకాల అమలే
సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 107

సోమవారం
1-1-2024

2024
పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
నూతన సంవత్సర శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




### మరిన్ని శాటిలైట్లు, అణ్వస్త్రాలు

శాటిలైట్లు, అణ్వస్త్రాలు తదితర ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకుంటున్నామని ఉత్తర కొరియా నియంత కిమ్ తెలిపారు.

వివరాలు 6లో ▸



### తెహ్రీక్ ఏ హురియత్‌పై నిషేధం

పాకిస్తాన్ అనుకూల వేర్పాటువాద సంస్థ తెహ్రీక్ ఏ హురియత్(టీఈహెచ్)పై నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



### ఆర్థిక సంఘం చైర్మన్‌గా అరవింద్

నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియాను 16వ ఆర్థిక సంఘం నూతన చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది.

వివరాలు 6లో ▸



### ప్రధానిలో నిర్దయ బాధాకరం

లైంగిక వేధింపులను ఎదుర్కొన్న మహిళా రెజ్లర్ల అంశంలో ప్రధాని మోదీ వైఖరిని రాహుల్ తప్పుబట్టారు.

వివరాలు 6లో ▸

# ఇదీ.. విశ్వసనీయత

## న్యూ ఇయర్ గిఫ్ట్‌గా నేటి నుంచి పింఛన్ రూ.3,000

## ప్రతి అడుగులో నమ్మకాన్ని పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- మండలాల వారీగా ఈ నెల 8 వరకు పండుగ వాతావరణంలో పెంచిన పింఛన్ల పంపిణీ
- 3వ తేదీన కాకినాడలో స్వయంగా పాల్గొననున్న సీఎం జగన్
- స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ఉత్సాహంగా కార్యక్రమాలు
- ఎప్పటి మాదిరిగానే నిర్దేశించిన తేదీల్లో గడప వద్దే లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్న వలంటీర్లు
- ఈ నెల నుంచి కొత్తగా మరో 1,17,161 మందికి కూడా పింఛన్లు
- జనవరిలో మొత్తం 66.34 లక్షల మందికి రూ.1,968 కోట్లు పింఛన్లుగా పంపిణీ.. కరోనా సంక్షోభంలోనూ నిర్విఘ్నంగా కొనసాగిన సంక్షేమ యజ్ఞం
- లాక్‌డౌన్ పరిస్థితుల్లోనూ పెంచడమూ ఆగలేదు.. పంచడం కూడా ఆగలేదు
- కొనుగోలు శక్తి క్షీణించకుండా విపత్తులో పేదలకు ఆర్థికంగా ప్రభుత్వం చేయూత
- మేనిఫెస్టో హామీల అమలుతో విశ్వసనీయతకు ప్రతిరూపంగా నిలిచిన సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, విశ్వసనీయతను చాటుకుంటూ నూతన ఏడాది సందర్భంగా 'వైఎస్సార్ పెన్షన్ కానుక' ద్వారా అందించే పింఛన్ మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3,000కి పెంచిన నేపథ్యంలో ఊరూ వాడా ఉత్సాహంగా వేడుకలకు సిద్ధమైంది. జనవరి 1వ తేదీ నుంచి ఆయా మండలాలవారీగా మొదలయ్యే పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ దాకా పూర్తి పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. స్థానిక శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఎక్కడికక్కడ లబ్ధిదారులతో స్వయంగా మమేకమవుతూ ఈ కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొననున్నారు. సోమవారం నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలు కానుండగా ఈనెల 3వతేదీన సీఎం జగన్ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజి గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో స్వయంగా పాల్గొని పెంచిన పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారులకు అందచేయనున్నారు. వలంటీర్లు ఎప్పటి మాదిరిగానే

మిగతా 2వ పేజీలో ▶

## ఫ్యాక్ట్‌చెక్

### కట్టకుండానే కట్టేసినట్లు కలరింగా!?

- భోగాపురంలో ఎన్నికల ముందు టెంకాయ కొడితే కట్టేసినట్లు కాదు కదా రామోజీ
- అనుమతులు లేకుండా, భూసేకరణ చేయకుండానే బాబు దానికి శంకుస్థాపన చేసిన సంగతి మరిచిపోతే ఎలా?
- ఇప్పుడు అన్ని అనుమతులతో పనులు శరవేగంగా జరుగుతుంటే ఏడుపెందుకు?

2లో

### లేఖ రాయాల్సింది స్కిల్ స్కామ్‌పై



- రాష్ట్రంలో ఇల్లూ వాకిలి లేనోళ్లూ లేఖలు రాయడమేనా?: మంత్రి జోగి రమేశ్
- ఇంటి స్థలం హామీని ఎగ్గొట్టిన బాబును ప్రశ్నించావా పవన్?
- జనసేనాని ప్యాకేజీపై మేం కూడా లేఖలు రాస్తాం

- వివరాలు 3లో

### 'వికసిత్, ఆత్మనిర్భర్' స్ఫూర్తి ఈ ఏడాదీ కొనసాగాలి

2023లో భారత్ ఎన్నో ప్రత్యేక ఘనతలు సాధించింది

2024లో 'ఫిట్ ఇండియా' మన లక్ష్యం కావాలి.. ప్రజలు భౌతిక, మానసిక ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

108వ 'మన్ కీ బాత్'లో ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



6లో

2023లో మన దేశం ఎన్నో ప్రత్యేక ఘనతలు సాధించింది. తెలుగు పాట 'నాటు నాటు'కు 2023లో ఆస్కార్ అవార్డు లభించడం దేశ ప్రజలకు ఆనందాన్నిచ్చింది. ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం, క్రీడాకారుల అద్భుత ప్రదర్శన, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం వంటివి దేశం గర్వపడేలా చేశాయి.

"దేశం ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోంది. భారత్ 'ఇన్నోవేషన్ హబ్'గా మారింది. అభివృద్ధి పరుగును ఆపబోమనే సత్యాన్ని చాటింది."
-ప్రధాని మోదీ

### 'ఇండియా'లో పొత్తు చిచ్చు!



సీట్ల పంపకాలపై కూటమి పక్షాలతో కాంగ్రెస్ చర్చలు.. బెంగాల్, బీహార్, మహారాష్ట్రల్లో అసంతృప్తులు

ఒంటరిగానే వెళ్తామంటున్న మమతా బెనర్జీ, కేజ్రీవాల్

6లో

### పొలం నుంచి మార్కెట్‌కు..

- రైతుల రవాణా కష్టాలకు చెల్లుచీటీ.. వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు పెద్ద ఎత్తున మౌలిక వసతులు
- ఏఎంసీలు, మార్కెట్ యార్డులు, చెక్ పోస్టుల ఆధునికీకరణ.. రూ.1,599.92 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
- రూ.861.53 కోట్లతో కల్లాల నుంచి మార్కెట్ కమిటీలకు రోడ్లు
- రూ.197.76 కోట్లతో రైతుబజార్లలో మౌలిక వసతుల కల్పన.. వచ్చే రెండేళ్లలో చేపట్టేలా ప్రతిపాదించిన పనులకు పరిపాలనామోదం
- త్వరలో టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు

3లో



ఆదివారం అర్ధరాత్రి సిడ్నీ ఒపేరా హౌస్ వద్ద కొత్త సంవత్సర వేడుకలు

**2024**

- వి'నూతన' వేడుకలు — ఆహారం నుంచి ఆధ్యాత్మికత దాకా విభిన్న ఆచారాలు
- కొత్త సంవత్సరం.. ఆశలు, ఆశయాలు
- 24 గంటల్లో 16 న్యూ ఇయర్స్!
- ఆటలు.. ఆశలు — వార్షిక క్రీడా క్యాలెండర్
- సమీపంలోనే ఉన్నా.. ఓ రోజు లేటు..
- 'విరివనాల' స్వాగతం

లోపలి పేజీల్లో





..తినబోతూ రుచులెందుకు? వెళ్లు.. నీకే తెలుస్తుంది!



### కొత్త ఏడాదిలో కృష్ణబిలాలపై తొలి గురి

ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో.. నేటి ఉదయం 9.10 గంటలకు శ్రీహరికోట నుంచి ప్రయోగం

- వివరాలు 6లో




### పిట్టలదొర

గతంలో మాయ చేసినట్లే ఎడాపెడా హామీలు గుప్పిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

- నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తానని కుప్పం సభలో ప్రకటన
- అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి హామీకి తూట్లు
- ఇప్పుడు మళ్లీ అదే హామీతో యువతను మభ్యపెట్టే నాటకం
- గతంలో ఇంటికో ఉద్యోగం హామీ బుట్టదాఖలు.. ఇప్పుడు 20 లక్షల ఉద్యోగాలిస్తానని ప్రగల్భాలు
- ఎన్నికల ముంగిట హామీల ఫీట్లు

- వివరాలు 5లో

# ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

## వేట నిషేధంలోనూ నిశ్చింత జీవనం



గంగమ్మ తల్లే మాకు బతుకు తెరువు. ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్నాం. మాలాంటి వారిని ఏ ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు. క్రమం తప్పకుండా ఇచ్చిన హామీలు అమలు చేసిన ఈ ప్రభుత్వం పుణ్యమా అని మాకు ఏడాది పొడవునా భుక్తి లభిస్తోంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం డొంకూరు గ్రామానికి చెందిన మాకు వేటకు వెళ్లేనే జీవనం గడిచేది. వాతావరణం అనుకూలించకపోయినా.. వేట నిషేధ కాలంలోనూ బతుకు తెరువు కోసం నానా పాట్లు పడేవాళ్లం. ఈ ఏడాది తొలి సారిగా నాకు 'వైఎస్సార్ మత్స్యకార భరోసా' పథకం కింద రూ.10 వేలు ఆర్థిక సాయం నేరుగా నా బ్యాంకు ఖాతాలో జమయింది. మత్స్యకారుల సంక్షేమం కోసం మరో అడుగు ముందుకేసి 75 శాతం రాయితీతో బోట్లు, వలలు మంజూరు చేస్తోంది. డీజిల్ సబ్సిడీ అందిస్తోంది. వేట సమయంలో ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మరణిస్తే రూ.10 లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తోంది. నాకు ముగ్గురు పిల్లలు. అందరూ చదువుకుంటున్నారు. అందులో చిన్నవాడికి అమ్మ ఒడి కింద మూడేళ్లుగా రూ.15 వేలు వంతున వస్తోంది. మా నాన్న చంద్రయ్యకు వైఎస్సార్ పింఛన్ కానుక అందుతోంది. మా తమ్ముడు దివ్యాంగుడు. అతనికి నెలకు రూ.3 వేలు చొప్పున పింఛన్ వస్తోంది. ఉన్నంతలో సంతోషంగా బతుకుతున్నాం.

– చీకటి దుర్యోధన, డొంకూరు
(మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్ఛాపురం రూరల్)

## ప్రభుత్వ సాయం వల్లే ఉన్నత చదువు



నా భర్త తోట గాబ్రియేల్ పాస్టర్‌గా సేవలు అందిస్తున్నారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కొత్తకొట్టాం గ్రామానికి చెందిన మాకు ముగ్గురు సంతానం. ఇద్దరు పిల్లలకు వివాహాలు చేశాం. మూడో అమ్మాయి ఎవాంజలిన్‌కు ఉన్నత చదువు చదవాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో చదివించలేమని భయంగా ఉండేది. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా నా కుమార్తెను రాజానగరం కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ ఫార్మసీలో జాయిన్ చేశాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇప్పటి వరకు రూ.68 వేలు వచ్చింది. కేవలం సీఎం జగన్ ఇచ్చిన ఆర్థిక సాయం కారణంగానే నా కూతురు ఉన్నత చదువు చదవగలుగుతోంది. మరో ఏడాది పూర్తయితే మంచి ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది. పాస్టర్‌గా ఉన్న నా భర్తకు నెలకు రూ.5 వేలు చొప్పున సంవత్సరానికి రూ.60 వేలు వస్తోంది. సీఎం సహాయం మా కుటుంబానికి ఎంతో తోడ్పాటునిచ్చింది.

– తోట హెప్సిరాణి, కోటనందూరు
(ఆలంక కుక్కుటేశ్వరరావు, విలేకరి, కోటనందూరు)

## కలలో కూడా ఊహించని సాయం



మేము బతుకు తెరువు కోసం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం మానాపురం నుంచి విశాఖ జిల్లా ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి 30 ఏళ్ల క్రితం వలస వచ్చాం. భర్త సూర్యనారాయణ సైట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. నేను కూలి పనులకు వెళ్లేదాన్ని. ఏడాదిన్నర క్రితం నాకు గుండెలో భారంగా ఉండడంతో తనిఖీ చేయించుకోగా వాల్వ్ మూసుకుపోయిందని డాక్టర్లు తెలిపారు. నా నెత్తిన పిడుగు పడినట్టయింది. చేతిలో చిల్లి గవ్వ లేదు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స చేస్తారని తెలిసి కొండంత ధైర్యం వచ్చింది. నా కుమారుడితో కలిసి విజయనగరం పెద్దాస్పత్రికి వెళ్లాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉచితంగా అన్ని పరీక్షలు చేస్తూ మందులు ఇస్తున్నారు. ఇంతవరకు మందులతో నెట్టుకొచ్చాను. ఇక ఆపరేషన్ తప్పనిసరని, లేకుంటే ప్రాణాలకు ముప్పని గుండె డాక్టర్ చెప్పడంతో మూడు వారాల కిందట విశాఖపట్నంలో కార్పొరేట్ ఆస్పత్రిలో లక్షలు ఖర్చయ్యే బైపాస్ సర్జరీని ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను. జీవితాంతం మందులు ఉచితంగా ఇస్తారట. కోలుకునే వరకు నెలకు రూ.5 వేల వంతున ఆర్థిక సాయం కూడా చేస్తారని తెలిసి ఆశ్చర్యపోయాను. ఆసరా కింద మూడు విడతలుగా రూ.56,250, సున్నా వడ్డీ కింద రూ.50 వేలు ఆర్థిక సాయం అందింది. నా కుమారుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండడంతో మా కోడలు లావణ్య తగరపువలసలోని కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఉచితంగా చదువుతోంది. నా భర్తకు గతేడాది ఏప్రిల్ నుంచి వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ప్రస్తుతం నలుగురం కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాము. గత ప్రభుత్వ హయాంలో ఇంటి కోసం అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వెంటనే వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం నుంచి ఇంతగా సాయం అందుతుందని కలలో కూడా మేము ఊహించలేదు.

– కోరాడ జ్యోతి, వేములవలస
(మహంతి శివాజీ, విలేకరి, ఆనందపురం)

## కొత్త ఏడాది ప్రేరణగా నిలవాలి

### గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధిని అందించాలని ఆకాంక్షించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన చేరుకునేందుకు కొత్త సంవత్సరం ప్రేరణగా నిలుస్తుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేసినట్లు రాజ్‌భవన్ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి.

## ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి

### ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం



సాక్షి,అమరావతి: రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ సీఎం వైఎస్ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2024లో ఇంటింటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు, అన్ని సామాజిక వర్గాలు సుస్థిరమైన అభివృద్ధి పథంలో ప్రయాణించేలా కృషి చేస్తోన్న ప్రభుత్వానికి, రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబంలో ప్రతి ఒక్కరికీ 2024లో దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని అభిలషించారు.

## 3న కాకినాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన

సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఈనెల 3న(బుధవారం) కాకినాడలో పర్యటించనున్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కాకినాడ చేరుకుంటారు. అక్కడ రంగరాయ మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం తాడేపల్లి చేరుకుంటారు.

## 'రెండు సున్నాలు కలిస్తే పెద్ద బోడిసున్నా'

తాడేపల్లిగూడెం(టీఓసీ): 2 సున్నాలు కలిస్తే పెద్ద బోడి సున్నా అవుతుందని..టీడీపీ, జనసేన పొత్తులపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ వాళ్లు (జనసేన, టీడీపీ) కలవడం వల్ల వన్ ప్లస్ వన్ టూ అనుకుంటున్నారు కానీ.. సున్నా సున్నా కలిస్తే సున్నానే అవుతుందన్నారు. గత ఎన్నికల్లో 650 హామీలిచ్చిన టీడీపీ వాటిని అమలు చేయకపోగా చివరకు మేనిఫెస్టోను కూడా ఆ పార్టీ వెబ్‌సైట్ నుంచి మాయం చేసిందని విమర్శించారు.

# కట్టకుండానే కట్టేసినట్లు కలరింగా!?



విమాన ప్రయాణికుల వృద్ధి ఇలా..

| విమానాశ్రయం | 2021-22 | 2022-23 | వృద్ధి శాతం |
|---|---|---|---|
| విశాఖపట్నం | 16,31,316 | 25,00,789 | 53 |
| విజయవాడ | 6,17,375 | 9,57,475 | 55 |
| తిరుపతి | 6,24,325 | 9,23,682 | 48 |
| రాజమండ్రి | 2,76,372 | 4,32,931 | 57 |
| కడప | 12,765 | 70,126 | 449 |
| కర్నూలు | 33,159 | 38,714 | 17 |
| మొత్తం | 31,95,312 | 49,23,717 | 54 |

- భోగాపురంలో ఎన్నికల ముందు టెంకాయ కొడితే కట్టేసినట్లు కాదు కదా రామోజీ..
- ఎటువంటి అనుమతులు లేకుండా, భూసేకరణ చేయకుండానే బాబు దానికి శంకుస్థాపన చేసిన సంగతి మరిచిపోతే ఎలా?
- ఇప్పుడు భూ సేకరణ పూర్తి చేసి అన్ని అనుమతులతో పనులు జరుగుతుంటే ఎందుకంత ఏడుపు?
- కర్నూలు ఎయిర్‌పోర్టు కూడా పూర్తికాకుండానే మీ బాబు ప్రారంభించారు.. గుర్తులేదా?
- ఈ ప్రభుత్వం వచ్చాక దానినీ రూ.240 కోట్లతో పూర్తిచేసింది నిజం కాదా?
- ఈ ప్రభుత్వ హయాంలో షిర్డీ, వారణాసి, కోల్‌కత, జైపూర్ వంటి అనేక నగరాలకు అందుబాటులోకి విమాన సర్వీసులు
- దగదర్తి స్థానంలో రామాయపట్నం తెట్టు వద్ద కార్గో హ్యాండిల్‌కు ప్రాధాన్యతనిస్తూ కొత్త ఎయిర్‌పోర్టు నిర్మాణం
- ఇప్పటికే వేగంగా జరుగుతున్న భూసేకరణ.. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం
- ఇంత అభివృద్ధి జరుగుతున్నా విమానయాన రంగంపై రామోజీ గాలి కబుర్లతో రోత రాతలు

ఫ్యాక్ట్ చెక్

### రూ.20వేల కోట్లతో తీరప్రాంత అభివృద్ధి..

కేవలం ఎయిర్‌పోర్టులే కాకుండా ప్రతీ 50 కి.మీ.లకు పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండే విధంగా పెద్దఎత్తున తీరప్రాంత అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. దేశంలో ఎక్కడాలేని విధంగా నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్‌ల్యాండ్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందుకోసం సుమారు రూ.20వేల కోట్లు వెచ్చిస్తోంది.

సాక్షి, అమరావతి : అబద్ధాలు ఆడటంలో ఆరితేరిన వారు ఎవరైనా ఉన్నారంటే అది రామోజీరావు తర్వాతే ఎవరైనా. అవతలి వాళ్లు నవ్వుకుంటారన్న సిగ్గూఎగ్గూ లేకుండా చెప్పిన అబద్ధాలనే మళ్లీ మళ్లీ చెబుతూ.. నిత్యం వాటినే పారాయణ చేస్తూ తన స్థాయిని తనే బజారుకీడ్చుకుంటున్నారు. తాజాగా.. రాష్ట్రంలో విమానయాన రంగంపై 'మాటలు మరిచారు.. రెక్కలు విరిచారు' అంటూ ఎప్పటిలాగే తన సహజసిద్ధ శైలిలో తన విషపుత్రిక ఈనాడులో తన పాండిత్యాన్నంతటినీ రంగరించి రామోజీ విషం కుమ్మరించారు. ఎందుకంటే.. రాష్ట్రంలో విమానయాన రంగం వేగంగా విస్తరిస్తూ పలు నగరాలకు సర్వీసులు పెరుగుతుంటే కళ్లకు గంతలు కట్టుకున్న రామోజీ అసత్యాలతో రాష్ట్ర ప్రజల్లో విషబీజాలు నాటేందుకు ఆపసోపాలు పడ్డారు. నిత్యం ఇలా అశుద్ధ కథనాలు రాస్తుండబట్టే పత్రిక సర్క్యులేషన్ రోజురోజుకీ దారుణంగా పడిపోతోంది. అయినాసరే.. తన బాబును పల్లకీ ఎక్కించేందుకు తన అసత్యాల యజ్ఞాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తూ ఈనాడును ఉచితంగా ఇచ్చేస్తున్నారు. ఎలుక తోలును ఎంత ఉతికినా.. ఉల్లిపాయను ఎంత ఉడకబెట్టినా వాటి సహజ లక్షణం ఎలా కోల్పోవో రామోజీ శైలి కూడా అంతే. ఈనాడు తాజా కథనంలోని వాస్తవాలు ఏమిటంటే..

### ఎలాంటి అనుమతులు లేకుండా బాబు హంగామా..

భూసేకరణ చేయకుండా, పునరావాసం చేపట్టకుండా, కనీసం పౌర విమానయాన శాఖ, రక్షణ రంగం, పర్యావరణం వంటి ఎటువంటి కీలక అనుమతులు లేకుండానే చంద్రబాబునాయుడు భోగాపురానికి శంకుస్థాపన చేసేశారు. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని అనుమతులు తీసుకుని 2,203.26 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించే విధంగా జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. నిజానికి.. ఒప్పందం కుదుర్చుకునే సమయానికి సేకరించిన భూమి కేవలం 377 ఎకరాలు మాత్రమే. మిగిలిన భూమి మొత్తాన్ని ప్రస్తుత ప్రభుత్వమే సేకరించి, 376 కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పించింది. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూలేని విధంగా గేటెడ్ కమ్యూనిటీ తరహాలో విశాలమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, కమ్యూనిటీ హాళ్లు వంటివి నిర్మించి మరీ ఈ ప్రభుత్వం ప్రజలను ఆనందంగా తరలించింది. పునరావాసం కోర్టు కేసులు, పర్యావరణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో వేసిన కేసుల్లో పోరాడి మరీ విజయం సాధించింది. నిజానికి.. చంద్రబాబు హయాంలో కేంద్రంలో అశోక్ గజపతిరాజు పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయారు. అలాగే, విమానయాన రంగానికి చెందిన కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకురావడంలోనూ విఫలమయ్యారు. కానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సేఫ్టీ, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన శాఖ, పర్యావరణ శాఖల నుంచి కీలక అనుమతులు సాధించి పనులు మొదలుపెట్టారు. బాబు లాగా అనుమతులు లేకుండా టెంకాయ కొట్టడం కాకుండా అన్ని అనుమతులు వచ్చిన తర్వాత మే 2023లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ మరుక్షణం నుంచి పనులు వేగంగా జరుగుతున్నాయి. 2025 నాటికి ఈ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది.

### విమానాశ్రయాల అభివృద్ధి..

మరోవైపు.. రాష్ట్రంలో మొత్తం ఏడు విమానాశ్రయాలు ఉండగా అందులో విశాఖతో కలిపి అయిదింటిని ఎయిర్‌పోర్టు అథార్టీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది.

- కర్నూలు ఎయిర్‌పోర్టును రాష్ట్ర ప్రభుత్వం, పుట్టపర్తిని శ్రీ సత్యసాయి ట్రస్ట్ నిర్వహిస్తోంది.
- రాజమండ్రి, విజయవాడ, కడప, తిరుపతి విమానాశ్రయాల్లో భారీ విమానాలు దిగేందుకు అనుకూలంగా రన్‌వేలను విస్తరించడంతో పాటు కొత్త టెర్మినల్ బిల్డింగ్‌లను నిర్మిస్తోంది.
- రాజమండ్రి విమానాశ్రయాన్ని రూ.350 కోట్లతో విస్తరణ పనులకు ఇటీవలే కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా శంకుస్థాపన చేశారు.
- అదే విధంగా.. కడప విమానాశ్రయం విస్తరణ కోసం 40 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం సేకరించడంతోపాటు రూ.450 కోట్లతో ఈ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది.
- అలాగే, విజయవాడ టెర్మినల్, రన్‌వే విస్తరణ పనులు దాదాపు పూర్తయి కొత్త సంవత్సరంలో అందుబాటులోకి రానుంది.
- తిరుపతి విమానాశ్రయాన్ని ఆధునీకరించడంతో పాటు అక్కడ విమానాలను రిపేర్ చేసే విధంగా ఎంఆర్‌ఓ యూనిట్‌ను ఏర్పాటుచేయనున్నారు.
- కర్నూలు ఎయిర్‌పోర్టులో పైలెట్ శిక్షణా కేంద్రంతో పాటు ఏరోస్పోర్ట్స్ హబ్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దనుంది.

### కర్నూలు ఎయిర్‌పోర్టుదీ అదే కథ..

ఇక కర్నూలు ఎయిర్‌పోర్టుకు కూడా 2017లో శంకుస్థాపన చేసిన చంద్రబాబు పనులు పూర్తికాకుండానే, ఎన్నికలు వస్తున్నాయంటూ 2019 జనవరిలో హడావిడిగా విమానాశ్రయాన్ని ప్రారంభించారు. కానీ, వాస్తవంగా అప్పటికి రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ వంటి కీలక నిర్మాణ పనులేవీ 30 శాతం కూడా పూర్తికాలేదు. అప్పట్లో పౌర విమానయాన శాఖ మంత్రిగా తెలుగుదేశం పార్టీ వ్యక్తే ఉన్నప్పటికీ ఈ విమానాశ్రయానికి సంబంధించి కీలక అనుమతులను తీసుకురావడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్, బే పార్క్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, నావిగేషన్ ఎక్విప్‌మెంట్ నిర్మించింది. ఇందుకోసం ఈ ప్రభుత్వం రూ.240 కోట్లు ఖర్చుచేసింది. అంతేకాక.. కీలకమైన ఏరోడ్రోమ్ లైసెన్స్, సెక్యూరిటీ క్లియరెన్స్, అనుమతులతో పాటు ఎస్‌పీఎఫ్ ఫోర్స్‌లను ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది. 70 శాతం పైగా పనులను ప్రస్తుత ప్రభుత్వమే పూర్తిచేయడంతో ఈ ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టి 2021 మార్చిలో ప్రారంభించింది.

### తెట్టు వద్ద ఎయిర్‌కార్గో హబ్..

ఇక గత టీడీపీ ప్రభుత్వం నెల్లూరుకు సమీపంలో దగదర్తి వద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని ప్రతిపాదిస్తే ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు మధ్యలో రామాయపట్నం పోర్టుకు అత్యంత సమీపంలో తెట్టు వద్ద ఎయిర్‌పోర్టును నిర్మించాలని ఈ ప్రభుత్వం నిర్ణయించింది. పోర్టు పక్కనే భారీ పరిశ్రమలు రానుండటంతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులతో పాటు సరుకు రవాణాకు అనువుగా ఉండేలా ఈ ఎయిర్‌పోర్టును నిర్మిస్తున్నారు. ఎయిర్ కార్గో హబ్‌గా ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడానికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ ప్రక్రియను ఈ ప్రభుత్వం చేపట్టింది. త్వరలో అనుమతులన్నీ రాగానే పనులు మొదలుపెట్టే విధంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.

### కొత్త నగరాలతో అనుసంధానం..

ఇదిలా ఉంటే.. గత ప్రభుత్వం కంటే ప్రస్తుతం అనేక కొత్త నగరాలకు ఎయిర్ కనెక్టివిటీ పెరిగితే సర్వీసులు తగ్గిపోయాయి రెక్కలు విరిచేశారు అంటూ రామోజీ గగ్గోలు పెట్టారు. నిజానికి.. కోవిడ్ దెబ్బతో ట్రూజెట్, జెట్ ఎయిర్‌వేస్ దివాలా తీయగా, స్పైస్‌జెట్ వంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా సర్వీసులను తగ్గించుకున్నాయి. చివరకు ఎయిర్ ఇండియా కూడా నష్టాలను భరించలేక టాటాలకు అప్పగించేసింది. ఇలా కోవిడ్ దెబ్బతో విమాన సర్వీసులు తగ్గితే దానికి కూడా సీఎం జగన్ కారణమనడం రామోజీ దిగజారుడుతనానికి నిదర్శనం తప్ప మరేమీ కాదు. అలాగే, విశాఖపట్నం నుంచి గత ప్రభుత్వంలో లేని జైపూర్, గోవా, కడప, కోల్‌కత, తిరుపతిలకు కొత్త సర్వీసులు ప్రారంభమైన మాట రామోజీకి తెలియదనుకోవాలా లేక తెలిసినా తెలీనట్లు నటిస్తున్నారని అనుకోవాలా? అలాగే.. విజయవాడ నుంచి షిర్డీ, విశాఖ, షార్జాలకు, తిరుపతి నుంచి బెల్గాం, గుల్బర్గా, శివమొగ్గలకు కొత్తగా సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాదు.. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా డిమాండ్ ఉన్న షార్జాకు నేరుగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ద్వారా సర్వీసులను నడుపుతోంది. అదే విధంగా దుబాయ్, బెహ్రెయిన్, కువైట్, శ్రీలంక, సింగపూర్, బ్యాంకాక్‌లకు నేరుగా సర్వీసులు నడిపేందుకు విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోంది. దీంతోపాటు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు.. ఆస్ట్రేలియా, యూరప్‌లకు విమాన సర్వీసులు నడపడానికి సంప్రదింపులు జరుపుతోంది.

# ఇదీ విశ్వసనీయత

▶ మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారుల ఇళ్ల వద్దే పెన్షన్ డబ్బులను పంపిణీ చేస్తారు. అయితే ఈసారి రాష్ట్రమంతటా ఒకేసారి కాకుండా నిర్దేశించిన మేరకు ఆయా మండలాలు, మున్సిపాలిటీల వారీగా పింఛన్ల పంపిణీ మొదలవుతుంది. ఆయా చోట్ల ప్రజా ప్రతినిధులు ఇందులో పాల్గొని పంపిణీని ప్రారంభిస్తారు. ఇలా ఈనెల 8వతేదీ వరకు పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. మొత్తంగా ఒకటో తేదీ నుంచే రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆరంభించి అందరికీ వలంటీర్ల ఆధ్వర్యంలో ఇళ్ల వద్దే పంపిణీ పూర్తయ్యే వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

### కొత్త పింఛన్లు 1.17 లక్షలు

జనవరి నుంచి కొత్తగా మరో 1,17,161 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసింది. ఈ నెలలో కొత్తగా జారీ చేసిన వారికి స్థానిక శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు పింఛను మంజూరు పత్రాలను అందజేస్తారు. ఈ నెలలో కొత్తగా పింఛన్లు మంజూరు చేసిన వారితో కలిపి మొత్తం 66.34 లక్షల మంది లబ్ధిదారులకు పంపిణీకి ప్రభుత్వం రూ.1,968 కోట్లను విడుదల చేసింది.



సీఎం లేఖను చదివి వినిపిస్తూ..

ఈ నెల నుంచి పెన్షన్ మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3,000కి పెంచిన నేపథ్యంలో లబ్ధిదారులందరికీ ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేకంగా లేఖ రాశారు. ఇళ్ల వద్ద పెన్షన్ డబ్బులు పంపిణీ చేసే సమయంలో సీఎం జగన్ రాసిన లేఖ ప్రతిని వలంటీర్లు వారికి అందజేస్తారు. లబ్ధిదారులకు లేఖ సారాంశం పూర్తిగా అర్థమయ్యేలా వలంటీర్లే ఆ లేఖను చదివి వినిపించాలని అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

### నమ్మకాన్ని పెంచుకుంటూ...

దేశంలోనే అత్యధికంగా 66.34 లక్షల మందికి నెలకు రూ.3,000 చొప్పున పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్ర ప్రభుత్వం ఇదేనని అధికారులు పేర్కొంటున్నారు. టీడీపీ హయాంలో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు రూ.1,000 మాత్రమే పింఛన్ అందించగా సీఎం జగన్ ప్రభుత్వం నెలకు రూ.2,250 చొప్పున ప్రారంభించి రూ.3,000 దాకా ఏటా పెంచుకుంటూ వచ్చింది. కరోనా గడ్డు కాలంలోనూ పెంపూ ఆగలేదు.. పెన్షన్లూ ఆగలేదు. మొత్తం లాక్‌డౌన్ ఉన్న పరిస్థితుల్లో కూడా పింఛన్లు పెంచడమూ ఆగలేదు.. పంచడమూ ఆగలేదు. 'అవ్వాతాతల పింఛన్ రూ.3,000 వరకు పెంచుకుంటూ పోతాం...' అని 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తు.చ. తప్పకుండా ఆచరించి చూపారు.

### నాడు 400 కోట్లు.. నేడు 1,968 కోట్లు

- 2014-19 మధ్య టీడీపీ హయాంలో నెలకు పెన్షన్ల సగటు వ్యయం రూ.400 కోట్లు.
- జూలై 2019 నుంచి నెలకు పెన్షన్లపై సగటు వ్యయం రూ.1,384 కోట్లు
- జనవరి 2022 నుంచి నెలకు పెన్షన్లపై సగటు వ్యయం రూ.1,570 కోట్లు
- జనవరి 2023 నుంచి నెలకు పెన్షన్లపై సగటు వ్యయం రూ.1,776 కోట్లు
- జనవరి 2024 నుంచి నెలకు పెన్షన్లపై సగటు వ్యయం రూ.1,968 కోట్లు

### పింఛన్ పెరిగిందిలా...

- టీడీపీ పాలనలో పెన్షన్ రూ.1,000 మాత్రమే
- జూలై 2019 నుంచి పెన్షన్ రూ.2,250కి పెంచిన సీఎం జగన్
- జనవరి 2022న రూ.2,500కు పెన్షన్ పెంపు
- జనవరి 2023న రూ.2,750కు పెంపు
- జనవరి 2024న రూ.3 వేలకు పెంపు

### పింఛన్లకే రూ.83,526 కోట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగున్నర ఏళ్లలో ఏకంగా 29,51,760 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేసింది. దీంతో పెన్షన్ లబ్ధిదారుల సంఖ్య 66.34 లక్షలకు చేరుకుంది. ఒక్క పెన్షన్ల కోసమే ప్రభుత్వం ఏటా రూ.23,556 కోట్లు వెచ్చిస్తోంది. సీఎం జగన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ల రూపంలో రూ.83,526 కోట్లను అందించినట్లు అధికారులు వెల్లడించారు.

## ఆత్మ గౌరవంతో పింఛన్లు..

పింఛన్ల కోసం చంద్రబాబు సర్కారు హయాంలో అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్న దుస్థితిని సీఎం జగన్ ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. అవ్వాతాతలకు మనవడిగా, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు అన్నగా, తమ్ముడిగా, చేనేత, కల్లుగీత, మత్స్య, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు శ్రేయోభిలాషిగా మానవీయ కోణంలో సీఎం జగన్ సంస్కరణలు చేపట్టారు. ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ ఇంటి వద్దే పెన్షన్లను అందిస్తున్నారు.

- గత పాలకుల హయాంలో పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు చాంతాడంత క్యూలలో గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 2.6 లక్షల మంది గ్రామ, వార్డు వలంటీర్లు ఒకటో తేదీనే గడప వద్దే పెన్షన్లు అందిస్తున్నారు. సెలవైనా, పండుగైనా సరై టంచన్‌గా చేతిలో పింఛన్లు పెడుతున్నారు.
- టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే కొత్తగా పెన్షన్లు మంజూరైన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తున్నారు. అర్హులై ఉండీ ఒకవేళ ఏ కారణం చేతనైనా లబ్ధి పొందకుంటే వారికి మరో అవకాశాన్ని కల్పిస్తూ ఏటా జూన్, డిసెంబర్‌లలో ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపట్టారు.
- ఇప్పుడు పెన్షన్ల కోసం దళారీలు, పైరవీకారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో అర్హులకు పెన్షన్ కార్డులను మంజూరు చేస్తున్నారు.
- టీడీపీ హయాంలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల కేటగిరీలో ఒక్కో లబ్ధిదారుడు పొందిన పెన్షన్ మొత్తం రూ.58,000 మాత్రమే కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయా లబ్ధిదారులు ఒక్కొక్కరికీ రూ.1,47,500 అందిస్తోంది. గత ప్రభుత్వం కంటే ఇది రూ.89,500 అదనం.
- టీడీపీ హయాంలో దివ్యాంగుల పెన్షన్ కింద ఐదేళ్లలో ఒక్కొక్కరికీ రూ.58,500 మేర మాత్రమే లబ్ధి చేకూర్చగా ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి రూ.1,82,000 అందిస్తోంది. గతం కంటే ఇది రూ.1,23,500 అదనం
- టీడీపీ సర్కారు ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు వరకు ఇచ్చిన పెన్షన్ల సంఖ్య కేవలం 39 లక్షలు కాగా ఇప్పుడు సీఎం జగన్ ప్రభుత్వం 66.34 లక్షల మందికి పింఛన్లను అందచేస్తోంది.

# పొలం నుంచి మార్కెట్‌కు..



సాక్షి, అమరావతి: పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు రైతన్నలు పడుతున్న వెతలకు చెక్ పెట్టే లక్ష్యంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల పరిధిలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. మార్కెట్ ఫీజుల ద్వారా వచ్చే ఆదాయంలో ఏఎంసీల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల కోసం ఖర్చుచేయగా.. మిగిలిన కొద్దిపాటి సొమ్ములను మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసే వారు. దీంతో ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన ఏఎంసీలకు కొత్త రూపునివ్వడంతో పాటు.. రైతు క్షేత్రాల నుంచి మార్కెట్లకు అనుసంధానించే రోడ్లను నిర్మించాలని సంకల్పించింది. ఇదే లక్ష్యంతో మార్కెటింగ్ సెస్‌ను కాస్త సవరిస్తూ ధాన్యంపై 2శాతం, రొయ్యలపై 1 శాతం, చేపలపై రూ.0.50 శాతం, మిగిలిన అన్నిరకాల నోటిఫైడ్ వ్యవసాయ, లైవ్‌స్టాక్ ఉత్పత్తులపై ఒక శాతం చొప్పున సెస్ పెంపును ప్రతిపాదించింది. ధాన్యం మినహా ఇతర ఉత్పత్తులపై ప్రతిపాదించిన సెస్ వసూలుకు హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది.

**అంతర్గత రహదారులకు పెద్దపీట**

మరోవైపు వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను యార్డులు, మార్కెట్లకు తరలించుకునేందుకు వీలుగా రైతు క్షేత్రాల నుంచి ఏఎంసీలకు, ఏఎంసీల నుంచి మండల, నియోజకవర్గ కేంద్రాలను అనుసంధానిస్తూ అనుబంధ రహదారుల నిర్మాణం, ఏఎంసీలు, యార్డులు, మార్కెట్లు, చెక్ పోస్టులు, యార్డులు, రైతు బజార్లను ఆధునికీకరించడం, కొత్తగా ఏర్పడిన ఏఎంసీలకు భవనాలతో పాటు కొత్త జిల్లాలకు అనుగుణంగా కార్యాలయ భవనాలు నిర్మించాలని సంకల్పించారు. ఈ మేరకు ఏపీ మార్కెటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు(ఏపీఎంఐడీపీ)లో భాగంగా రూ.1072.93 కోట్లతో 11,088 కి.మీ. మేర అంతర్గత రహదారుల నిర్మాణం, మరో 9,123 కి.మీ.మేర రహదారుల మరమ్మతులు, రూ.527 కోట్లతో ఏఎంసీలు, యార్డులు, రైతు బజార్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ప్రభుత్వం పరిపాలనామోదం ఇచ్చింది.

**నాబార్డు ద్వారా రూ.1,003.94 కోట్ల రుణం**

మార్కెట్ సెస్ రూపంలో ఏటా రూ.550 కోట్ల ఆదాయం వస్తుండగా, ధాన్యంపై సెస్ పెంపు వల్ల గతేడాది రూ.648 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.708 కోట్లు వసూలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.400 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఈ మొత్తం ఏమాత్రం సరిపోదన్న ఆలోచనతో ఆర్థిక సంస్థల నుంచి రుణం పొందాలని నిర్ణయించింది. ఆ బాధ్యతలను నోడల్ ఏజెన్సీగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు అప్పగించింది. ఇటీవలే ఈ ప్రాజెక్టు కోసం గిడ్డంగుల సంస్థకు నాబార్డు రూ.1,003.94 కోట్ల రుణం మంజూరు చేసింది. ఈ మొత్తంలో రూ.861.53 కోట్లతో అనుబంధ రహదారుల నిర్మాణం, రూ.197.76 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు కింద 2024–24 ఆర్థిక సంవత్సరంలో రూ.446.20 కోట్లు, 2025–26లో రూ.669.29 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించారు.

**రైతు సంక్షేమం కోసమే..**

పండించిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను కల్లాల నుంచి మార్కెట్లకు తరలించేందుకు అనువైన రహదారుల నిర్మాణంతో పాటు మార్కెట్ కమిటీల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇందుకోసం రూ.1599.92 కోట్ల అంచనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఇటీవలే నాబార్డు రూ.1003.94 కోట్ల రుణం మంజూరైంది. ఈ నిధులతో 2024–26 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టనున్న పనులకు పరిపాలనామోదం ఇచ్చాం. త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నాం. మౌలిక వసతుల కల్పన కోసం రుణం తీసుకుంటున్నామే తప్ప, ఈ రుణం కోసం రైతులపై పన్నుల భారం మోపుతున్నామన్న ఆరోపణల్లో వాస్తవం లేదు.

– రాహుల్ పాండే, కమిషనర్, మార్కెటింగ్ శాఖ

# నేటి నుంచి ఏపీలో సాగర్ పరిక్రమ

**కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో కార్యక్రమాలు**

సాక్షి, న్యూఢిల్లీ: మత్స్యకార సంక్షేమం, తీర ప్రాంత అభివృద్ధిలో భాగంగా సాగర్ పరిక్రమ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్నారు. జనవరి 1 నుంచి 6వ తేదీ వరకూ ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరీల్లోని వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర మత్స్య శాఖ మంత్రి పరుషోత్తం రూపాలా, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఇతర అధికారులు పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 974 కిలోమీటర్ల తీరప్రాంతం, 555 సముద్ర మత్స్యకార గ్రామాలు, రెండు ఫిషింగ్ హార్బర్లు, 350 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 31,147 ఫిషింగ్ క్రాఫ్టులు, 65 కోల్డ్ స్టోరేజీలు, 64 ప్రాసెసింగ్ ప్లాంట్లతో వైవిధ్యభరితమైన నీటి వనరులు ఉన్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. సాగర్ పరిక్రమ పదో ఫేజ్‌లో భాగంగా మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడం, భాగస్వాములతో నాయకులు, అధికారులు చర్చించడం, కిసాన్ క్రెడిట్ కార్డుల అందజేత, ప్రచార కార్యక్రమాలు ఉంటాయని మంత్రిత్వశాఖ పేర్కొంది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, యానాం (పుదుచ్చేరి)లో ఈ సాగర్ పరిక్రమ నిర్వహించనున్నారు.

# అరణ్యకాండ పారాయణ ఫలం రక్షణ

**సమన్వయ సరస్వతి సామవేదం**

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ధనుర్ధారులైన రామలక్ష్మణులను స్మరిస్తే మనకు రక్ష లభిస్తుందని, అరణ్యకాండ పారాయణ ఫలం రక్షణేనని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఆదివారం స్థానిక హిందూ సమాజంలో ఆయన 19వ రోజు ప్రవచనాన్ని కొనసాగించారు. రాక్షస బెడద తొలగిస్తానని రాముడు మునులకు అభయమిస్తాడు. వన సంచారంలో సీతాదేవి రాముని అడుగుతుంది. 'మనకు రాక్షసులతో వైరం లేనప్పుడు వారిని సంహరించడం ఎందుకు? తాపస వృత్తిలో ఉన్న మనం ఆయుధాలు ధరించడం ఎంతవరకు సమంజసం?' అని. అందుకు శ్రీరాముడు బదులిస్తూ 'ఆయుధ ధారులైన క్షత్రియుడు ఉన్న ప్రాంతంలో ఆర్తనాదాలు వినపడ కూడదు. మునుల తపోశక్తిని రాక్షస వధకు వెచ్చించడం వారికి సమ్మతం కాదు. వారికి ఇచ్చిన మాటకోసం నేను జీవితాన్ని, నిన్ను, లక్ష్మణుని సైతం వదలివేయడానికి సిద్ధమే' అన్నాడు. అరణ్యకాండలోని ఈ పదకొండు సర్గలు అత్యంత ప్రాధాన్యమైనవని సామవేదం తెలిపారు. వనవాసంలో ఆయన శరభంగుడు, అత్రి, భరద్వాజుడు, సుతీక్షణుడు మొదలైన మహర్షుల ఆశ్రమాలను సందర్శించాడని, వారు తమ తపోఫలాన్ని ధారపోయడానికి సిద్ధమైనా రాముడు అంగీకరించలేదని, తాను స్వయంగా తపస్సు చేసి తపశ్శక్తిని ఆర్జించుకుంటానని వారికి వినయంగా సమాధానం ఇచ్చాడని సామవేదం వివరించారు.

# అమెరికా నుంచి రేపు స్వస్థలానికి మృతదేహాలు

- పిన తండ్రి కుటుంబానికి రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు
- ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన టింబర్ వ్యాపారి పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబీకులు ఐదుగురు మృతి చెందగా, ఆ మృతదేహాలను విమానంలో సోమవారం సాయంత్రానికి హైదరాబాద్‌కు తీసుకు రానున్నారు. తర్వాత ఆ మృతదేహాలను అంబులెన్స్‌లో మంగళవారం ఉదయానికి అమలాపురంలోని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుయార్ ఇంటికి తీసుకు వస్తారు. అమెరికా రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పిన తండ్రి నాగేశ్వరరావు దంపతులు, వీరి కుమార్తె, ఇద్దరి మనమళ్లు మృత్యువాత పడటం, వారి అల్లుడు లోకేష్ ఆ దేశంలోని ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతుండడం తెలిసిందే. తన పిన తండ్రి నాగేశ్వరరావు కుటుంబ మృతదేహాలకు రాజమహేంద్రవరంలోని కోటిలింగాల రేవులో మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఆదివారం తనను పరామర్శించేందుకు వచ్చిన నాయకులు, బంధువులు, సన్నిహితులకు చెప్పారు. మంగళవారం ఉదయానికి తన ఇంటికి మృతదేహాలు తీసుకువచ్చాక గంట సమయం పాటు ఉంచి అనంతరం అంతిమ యాత్రతో అంత్యక్రియలకోసం రాజమహేంద్రవరం తీసుకు వెళతామని చెప్పారు. అమెరికా ఆసుపత్రిలో లోకేష్‌కు ఇప్పటి వరకూ నాలుగు శస్త్రచికిత్సలు జరిగాయని, ఆయనను కాపాడేందుకు అక్కడి వైద్యులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారని తెలిపారు.

**ప్రభుత్వ పెద్దల పరామర్శ**

పినతండ్రి నాగేశ్వరరావు కుటుంబం మృతితో బాధపడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని తదితర ప్రభుత్వ పెద్దలు శని, ఆదివారాల్లో ఫోన్లు చేసి పరామర్శించారు.

**ప్రమాదానికి మైనర్ల డ్రైవింగే కారణం**

అమెరికాలో నాగేశ్వరరావు కుటుంబం మృతికి వారి కారును ఢీకొట్టిన టిప్పర్‌ను డ్రైవ్ చేస్తున్న మైనర్లే కారణమని అక్కడి పోలీసులు దర్యాప్తులో తేల్చారని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు తనను పరామర్శించిన వారికి ఈ విషయం చెప్పి విలపించారు. ఆ మైనర్లు చేసిన తప్పిదానికి తన పిన తండ్రి కుటుంబం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సోమనాథుడి సాహిత్యాన్ని ప్రపంచానికి చాటాలి

• తెలంగాణ



అవార్డు గ్రహీతలతో కళాపీఠం నిర్వాహకులు

పాలకుర్తి టౌన్: సాహిత్య విప్లవ మూర్తి పాల్కురికి సోమనాథుడి సాహిత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పా లని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫె సర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పురస్కార ప్రదానోత్సవ సభకు పలువురు కవులు, రచయితలు హాజరయ్యారు. సోమనా థ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిషన్‌రావు మాట్లాడుతూ, సాహితీ విప్లవ మూర్తి పాల్కురి కి సోమనాథుడి జన్మస్థలంలో సాహిత్యం, కళా, పండిత, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలందించిన వా రు పురస్కారాలు అందుకోవడం ముదావహమని అన్నారు. మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సోమనాథ కళాపీఠం సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. సోమనాథ సాహిత్య పురస్కారానికి డాక్టర్ కానుకుర్తిశెట్టి సోమశేఖర్, సోమనాథ సామాజిక శో ధన పురస్కారానికి డాక్టర్ నలిమెల భాస్కర్, సోమ నాథ రంగస్థల పురస్కారానికి మంచాల రమేశ్, పందిళ్ల శేఖర్‌బాబు, రాజయ్యశాస్త్రి, స్వచ్ఛంద భాషా సేవ పురస్కారానికి డాక్టర్ మైథిలీ అబ్బరాజు, వీరమనేని చలపతిరావు సాహిత్య పురస్కారానికి వెంకటరమణ (వెంకూ), ముశం దామోదర్‌రావు ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారానికి డాక్టర్ సీఎస్ఆర్.ప్రభు, డాక్టర్ రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారానికి డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక బిరుదును బూస రేణుకారాధ్య స్వీకరించారు. అనంతరం పురస్కార గ్రహీతలు త మ అనుభవాలు పంచుకున్నారు. పొట్లపల్లి సింధుజ కూచిపూడి నృత్యం వీక్షకులను అలరించింది.

# ఫిక్స్.. డిజిటల్ డిటాక్స్



సాక్షి, హైదరాబాద్: నగరవాసులు కొత్త సంవత్సరంలో తీసుకునే తీర్మానాల్లో సరికొత్తగా ఒకటి వచ్చి చేరింది. జిమ్‌కు వెళ్లాలి, డైట్ ఫాలో కావాలి, టైమ్ మేనేజ్‌మెంట్ చేయాలి, కుటుంబ సభ్యులకు సమయం కేటాయించాలి తదితరాలన్నీ గతం నుంచి ఉంటూ వచ్చేవి. కానీ 2024లో మాత్రం అలాంటి తీర్మానాల వరుసలో డిజిటల్ డిటాక్స్ వచ్చింది. విపరీతంగా ఎలక్ట్రానిక్ డివైజ్‌లకు అలవాటు పడుతూ రకరకాల మానసిక సమస్యలకు గురవుతున్న పలువురు వైద్యుల సూచనల ప్రకారం దీనిని తమ తీర్మానాల జాబితాలో ప్రధానంగా చేర్చినట్టు 'సాక్షి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో ఇలా డిజిటల్ డిటాక్స్‌ను తీర్మానంగా ఎంచుకున్నవారు లక్ష్యాన్ని సాధించేందుకు గాను వైద్యులు చేస్తున్న సూచనలివీ..

- సినిమాలు ఇతర వినోదాలకు ఇంట్లో టీవీలు, ఆఫీసు పనిలో భాగంగా డెస్క్‌టాప్/ ల్యాప్‌టాప్, సోషల్ మీడియా వగైరాలకు స్మార్ట్ ఫోన్స్...ఇలా స్క్రీన్ వీక్షణ తగ్గించాలి.
- దీని కోసం ఆయా డిజిటల్ పరికరాల వినియోగం నుంచి క్రమం తప్పని విరామం తీసుకోవాలి.
- మొబైల్‌ను అవసరమైన పనులకు మాత్రమే వినియోగించాలి.
- తప్పనిసరి అయ్యి లేదా అనుకోకుండానో ఒక రోజులో ఎక్కువ సమయం డిజిటల్ పరికరాలతో గడిపితే ఆ మరుసటి రోజు అంతకు రెట్టింపు సమయం వాటి నుంచి విరామం తీసుకోవాలి.
- ప్రతీ రోజూ నిద్రకు ముందు నిద్ర నుంచి లేచిన తర్వాత నిర్ణీత వేళలు నిర్ణయించుకుని స్క్రీన్‌కు దూరంగా ఉండాలి.

# ఇళ్లస్థలాల కోసం గన్‌పార్కు వద్ద పెన్షనర్ల నిరసన

నాంపల్లి(హైదరాబాద్): పెన్షనర్ల ఇళ్లస్థలాల పంపిణీ ప్రక్రియను అడ్డుకునే కుట్రలను విచ్ఛిన్నం చేయా లని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. కుట్రదారుల చర్యలపై అసెంబ్లీ వద్ద గల గన్‌పార్కు ఎదుట పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి, ప్రధానకార్యదర్శి తూము అశోక్‌రెడ్డి, నేతలు జి.సూర్యకళ, వేణుగోపాల్, దివాకర్, భద్రయ్య మాట్లాడారు. ముప్ఫైఏళ్ల క్రితం శేరిలింగంపల్లి పరిధిలోని గోపనపల్లిలో ఉద్యోగులకు నాటి ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించగా కొంతమంది ఉద్యోగ సంఘాల నేతల స్వార్థపూరిత చ ర్యల వల్ల కోర్టు వివాదంలో చిక్కుకుని పంపిణీ ప్ర క్రియ పూర్తి కాలేదని గుర్తుచేశారు. ప్రస్తుత భాగ్య నగర్ టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ పాలక వర్గం ఈ స్థలాన్ని అధీనంలోకి తీసుకుని సర్వీసు సీనియారిటీ ప్రకారం 845 మంది పెన్షనర్లను లబ్ధి దారులుగా గుర్తించిందని చెప్పారు. పెన్షనర్ల పట్ల మానవతాదృక్పథంతో స్పందించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కూతురిని మంటల్లోకి తోసిన తండ్రి

బాన్సువాడ: కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామంలో ఓ తండ్రి తన ఏడేళ్ల కూతురును మంటల్లోకి విసిరేశాడు. బరంగెడ్గి గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గంగారాం అనే వ్యక్తికి చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటనకు సాయిలు ఏడేళ్ల కూతురు అంకిత కారణమని ఆరోపిస్తూ గంగారాం గొడవకు దిగాడు. ఈ క్రమంలో అప్పటికే మద్యం మత్తులో ఉన్న సాయిలు క్షణికావేశంలో కూతురును మంటల్లోకి తోసేశాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి, బాలికను బయటకు లాగి మంటలార్పారు. తీవ్రంగా గాయపడిన అంకితను బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆస్పత్రిలో కోలుకుంటోంది.

# ఫ్యాషన్ దుస్తులు ధరిస్తోందని భార్య హత్య



జ్యోతితో భర్త జీవన్ (ఫైల్)

యశవంతపుర: వద్దని చెప్పినా వినకుండా ఫ్యాషన్ దుస్తులు ధరిస్తున్న భార్యను గొంతు కోసి హతమార్చిన ఘటన కర్ణాటక రాష్ట్రం హాసన్‌జిల్లా అరసికెరె తాలూకా రాంపు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ధార్వాడకు చెందిన జ్యోతి (22), జీవన్ ఏడాది కిందట ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు. అరసికెరెకు వచ్చి బాడుగ ఇంటిలో నివాసం ఉంటూ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. జ్యోతికి ఫ్యాషన్‌గా ఉండటమంటే ఇష్టం. పొట్టి, బిగుతైన డ్రెస్‌లను ధరించేది. ఇది మంచి పద్ధతి కాదని భర్త జీవన్ చెప్పేవాడు. ఈ నేపథ్యంలో శనివారం జ్యోతి ఫ్యాషన్ బట్టలు ధరించి బయటకు వెళ్లింది. ఇది చూసిన భర్త డ్రాప్ చేస్తానని బైకుపై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి గొడవ పడ్డాడు. ఘర్షణ తీవ్రం కావడంతో చాకుతో ఆమె గొంతు కోసి హతమార్చి అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి ఆదివారం కేసు నమోదు చేశారు.

# లేఖ రాయాల్సింది స్కిల్ స్కామ్‌పై..

- రాష్ట్రంలో ఇల్లూ వాకిలి లేనోళ్లూ లేఖలు రాయడమేనా?: మంత్రి జోగి రమేశ్
- పవన్ ప్యాకేజీపై మేమూ లేఖలు రాస్తాం



సాక్షి, అమరావతి: పేదల ఇళ్ల స్థలాల సేకరణ, గృహ నిర్మాణాల్లో అవినీతి జరిగిదంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రధానికి లేఖ రాయడంపై గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఏ ఆధారాలతో లేఖ రాశారని నిలదీశారు. దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని సవాల్ చేశారు. అయినా రాష్ట్రంలో ఇల్లూ వాకిలి లేనోళ్లూ లేఖలు రాయడం ఏంటని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ పేర్కొన్న 13 అంశాలపై మీడియా ద్వారా సమాధానం పంపుతున్నట్లు తెలిపారు.

**ఆన్‌లైన్ చెల్లింపుల్లో అవినీతా?**

రాష్ట్రంలో పవన్ కళ్యాణ్‌కు ఇల్లు ఉందా? ఆధార్ కార్డు ఉందా? డోర్ నెంబర్ ఉందా? కనీసం ఓటు అయినా ఉందా? చంద్రబాబు తాబేదారులా వ్యవహరిస్తూ ఏ గడ్డి కరవటానికైనా పవన్ సిద్ధపడతాడు. 30.65 లక్షల మంది పేదింటి అక్కచెల్లెమ్మల ఇంటి కలను సీఎం జగన్ నిజం చేశారు. పట్టాలు ఇవ్వటంతో పాటు ఇప్పటికే 21.75 లక్షల గృహ నిర్మాణాలను చేపట్టారు. 17 వేలకు పైగా లుకు జగనన్న కాలనీలు కడుతున్నాం. లక్షల మంది అక్కచెల్లెమ్మలు గృహ ప్రవేశాలు చేసి జయహో జగనన్న అని నినదిస్తున్నారు. ప్రతి ఒక్కటీ ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరుగుతుంటే స్కామ్ జరుగుతోందని లేఖ రాయటం ఎంత దారుణం.

**ఊరూరా సీఎం జగన్ ముద్ర**

అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాల హామీని నెరవేర్చకుండా మోసగించిన చంద్రబాబును ఏనాడైనా పవన్ కళ్యాణ్ ప్రశ్నించారా? ఈరోజు రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా సీఎం వైఎస్ జగన్ మార్క్ కనపడుతుంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ కోరుకున్న గ్రామానికి వెళ్దాం. వారి మార్క్ ఏ ఒక్కటైనా ఉందా? కుప్పంలో ఎయిర్‌పోర్టు కడతానంటున్న చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఏం చేశారు? గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వలేదు.

**మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం..**

పవన్ లేఖ రాయాల్సింది స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ గురించి. అందులో పవన్‌కు ఎంత ముట్టింది? చంద్రబాబు అవినీతి, పవన్ ప్యాకేజీ గురించి త్వరలోనే మేం లేఖలు రాస్తాం. వంట గ్యాస్‌ని సబ్సిడీపై ఇస్తానని గతంలో మోసగించిన చంద్రబాబును మహిళలు మరోసారి నమ్ముతారా? 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ఘన విజయం, వైఎస్ జగన్ సీఎం అవ్వడం ఖాయమని అన్నారు.

# ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతుల దహనం

**తప్పుడు రాతలు రాస్తున్నాయంటూ ఆ రెండు పత్రికలపై నిప్పులుగక్కిన వలంటీర్లు**



అనకాపల్లి జిల్లా తామరం సచివాలయం ఎదుట పత్రికల ప్రతులను దహనం చేస్తున్న వలంటీర్లు

మాకవరపాలెం: వలంటీర్లకు, ప్రభుత్వానికి మధ్య చిచ్చుపెట్టడానికే ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తామరం సచివాలయం వద్ద ఆదివారం ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతులను దహనం చేశారు. ఆ రెండు పత్రికలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తాము ప్రజలకు సేవచేయడానికే ఉన్నామని, ప్రభుత్వంపై ఆందోళనలు చేయడానికి కాదని చెప్పారు. తామంతా నిస్వార్థంగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా సేవచేస్తున్నామన్నారు. కానీ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు లేనిపోని రాతలు రాస్తూ ప్రభుత్వానికి, వలంటీర్ల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ఈ పత్రికలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలకు నిస్వార్థసేవలు అందించేందుకు కృషిచేస్తామని వారు స్పష్టం చేశారు.

# బాబుకు ఓటేస్తే సంక్షోభాన్ని ఆహ్వానించినట్టే!

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం(చిత్తూరు జిల్లా): కపటనాటక సూత్రధారి, ఆర్థిక నేరస్తుడు చంద్రబాబుకు ఓటేస్తే స్వయంగా రాష్ట్రానికి సంక్షోభాన్ని ఆహ్వానించినట్టేనని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. పుత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు అధికారాన్ని కట్టబెట్టినట్లయితే రాష్ట్రానికి కరువును ఆహ్వానించినట్లేనని విమర్శించారు. చంద్రబాబు వరుణుడికి బద్ధశత్రువని, కరువుకు సోదరుడులాంటి వారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వరుణుడు కరుణించాడని, రాష్ట్రం సుభిక్షంగా ఉందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక ఇబ్బందులు తొలగాయని తెలిపారు. 'పవన్‌కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ చంద్రబాబు దృష్టిలో ఆయనకు పాదరక్షలు వంటిది. పాదాల రక్షణ కోసం వేసుకున్న చెప్పులను ఇంటి బయట వదిలి పెట్టినట్లుగానే పవన్ పార్టీని చంద్రబాబు చూస్తున్నారు. అధికారం కోసం పవన్‌ను పావుగా వాడుకుని రాజకీయ పరిజ్ఞానం లేని లోకేశ్‌ను సీఎం చేయడానికి తహతహలాడుతున్నాడు. ఈ సత్యాన్ని పవన్‌కళ్యాణ్ గుర్తించాలి..' అని నారాయణస్వామి అన్నారు. అధికారం కోసం ఊసరవెల్లిలా మాటలు మారుస్తున్న చంద్రబాబును ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని, కుప్పంలో కూడా టీడీపీకి ఘోర పరాభవం తప్పదన్నారు. మళ్లీ 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌కు పట్టంకట్టి సంక్షేమ పథకాలను అందుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రజలు కొత్త సంవత్సరంలో అన్ని విధాల ఆనందంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని నారాయణస్వామి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# 50 మంది అర్చకులు, పండితులకు సత్కారం



అనుగ్రహభాషణం చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి ఆలయంలో ఆదివారం అర్చక సదస్సు, పండిత సత్కారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రత్యేక పూజలు, అనంతరం అనుగ్రహభాషణం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన 25 మంది వేదపండితులు, 25 మంది అర్చకులను సత్కరించారు. వేద పండితులు ముష్టి భీమశంకరశాస్త్రి, ముష్టి వేంకటేశ్వర ఘనాపాటి, చావలి లక్ష్మీనారాయణ అవధానులు, వడ్డాది హనుమాన్ శర్మ, కోట పంచముఖి శర్మ, ఉప ప్రధాన అర్చకుడు కొడమంచిలి శ్రీనివాసశర్మ, అర్చకుడు బీఎస్ఎస్ భట్టర్, ఆలయ ఈవో కె.శిరీష పాల్గొన్నారు.



'ఎందుకు' బతకాలో తెలిసినవాడు,
ఎన్ని 'ఎలాగ'లైనా భరించగలడు.
- ఫ్రెడరిక్ నీషే



సాక్షి
సోమవారం, 1 జనవరి 2024

# కాలగతిలో కొత్త వేకువ

మార్పు ప్రకృతి సహజ లక్షణం. చరాచర ప్రపంచంలో మారనిదంటూ ఏదీ ఉండదు. కాలం అనుక్షణం మారుతూనే ఉంటుంది. రోజులుగా, నెలలుగా, ఏడాదులుగా మారే కాలానికి కొత్త సంవత్సరం ఒక కొండగుర్తు. కొత్త సంవత్సరానికి గుర్తుగా కొత్త కేలండర్లు వస్తాయి. కొత్త డైరీలు వస్తాయి. కొందరు అదృష్టవంతులకు ఒకరోజు సెలవు దొరుకుతుంది. కొత్త సంవత్సరాన్ని అట్టహాసంగా స్వాగతించడానికి ముందురోజు రాత్రి జనాలు సందడి సందడిగా మందు విందులతో ఊరూరా అట్టహాసంగా వేడుకలు జరుపుకొంటారు. గడియారం అర్ధరాత్రి పన్నెండు గంటలు కొట్టగానే కేరింతలు కొడుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. గడచిపోయిన సంవత్సరంలో చేసిన తప్పులను పునరావృతం చేయబోమంటూ కొందరు భీషణ తీర్మానాలు కూడా చేసుకుంటారు.

అలాగని కొత్త సంవత్సరం వచ్చినంత మాత్రాన ప్రపంచం అమాంతంగా మారిపోదు. లోకంలో మనుషులు ఎప్పటిలాగానే ఉంటారు. మనుషుల స్వభావాలు ఎప్పటి మాదిరిగానే ఉంటాయి. భూమి గోళాకారంలోనే ఉంటుంది. సూర్యుడు తూర్పు దిక్కునే ఉదయిస్తాడు. కొత్త సంవత్సరం వచ్చినంత మాత్రాన నింగి నుంచి చుక్కలు రాలిపడిపోవడం, దిక్కులు ఏకమైపోవడం వంటి ఆకస్మిక అనర్థాలేవీ సంభవించవు. ప్రపంచంలో ఇప్పటికే కొనసాగుతున్న యుద్ధాలు కొనసాగుతూనే ఉంటాయి. దేశాల మధ్య సంక్షోభాలు రగులుతూనే ఉంటాయి. కొత్త సంవత్సరం వేడుకల్లో వినిపించే కేరింతల హోరులో అభాగ్యుల ఆర్తనాదాలు వినిపించకుండా ఉంటాయంతే!

ప్రపంచమంతా అలాగే ఉన్నప్పుడు మరి మారినదేమిటంటారా? మార్పు మన కళ్ల ముందే జరిగిపోతూ ఉంటుంది. ప్రచార పటాటోప కాంతులకు కళ్లుబైర్లు కమ్మిన దివాంధత్వంలో మనం వెనువెంటనే మార్పును గుర్తించలేం. కొంచెం తెప్పరిల్లిన తర్వాతనే మార్పు మనకు అర్థమవుతుంది. అనుభవంలోకి వస్తుంది. 'మార్పు తప్ప మరేదీ శాశ్వతం కాదు' అని గ్రీకు తత్త్వవేత్త హెరాక్లిటస్ క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దిలోనే చెప్పాడు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే ఉత్సాహంలో, వేడుకల సంరంభంలో మునిగిపోయిన జనానికి ఆ సమయంలో జరిగే మార్పులేవీ గోచరించవు. కేలండరు మారుతున్న వేళలోనే ఎక్కడో ఒకచోట ఒక మొక్క మొలకెత్తవచ్చు. ఒక మహావృక్షం నేలకూలిపోవచ్చు. కొత్తగా ఒక శిశువు ఈ భూమ్మీదకు రావచ్చు. పాతబడిన ఒక పండుటాకు రాలిపోవచ్చు. మరెక్కడో ఒకచోట నిశ్శబ్దంగా ఒక కొత్త ఆవిష్కరణ జరగవచ్చు. ఒక విధ్వంసానికి కొత్తగా ధ్వంసరచన జరుగుతూ ఉండవచ్చు. వార్తలకెక్కితే తప్ప మార్పులను గుర్తించడం మానేశాం మనం. అయినా వార్తలతో నిమిత్తం లేకుండా మార్పులు జరుగుతూనే ఉంటాయి.


అసలు మనం జరుపుకొనే ఈ కొత్త సంవత్సరం వేడుకలు కూడా నానా మార్పుల ఫలితమే! ఇప్పటి మన నాగరికత, మన వేషభాషలు, మన సాంకేతిక పరిజ్ఞానం, మన కళానైపుణ్యాలు, మన ఆటపాటలు, మన తిండితిప్పలు వంటివన్నీ ఎన్నో మార్పుల ఫలితమే! ఎంతటి నియంతలకైనా మార్పును నివారించడం సాధ్యం కాదు. అనంత కాలవాహినిలో మార్పులు అలల్లా వచ్చిపోతుంటాయి. మంచి చెడులు మార్పులకూ వర్తిస్తాయి. మంచి మార్పులు వికాసానికి, చెడు మార్పులు వినాశానికి దారులు వేస్తాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే నిన్నటితో ముగిసిపోయిన సంవత్సరంలోనూ కొన్ని గణనీయమైన మార్పులే చోటు చేసుకున్నాయి. నిన్నటితో ముగిసిన ఏడాదిలో మానవాళికి మేలు చేసే పదమూడు మార్పులు జరిగినట్లు 'టైమ్' మ్యాగజైన్ కథనం చెబుతోంది. ఇదొక ఆశాజనకమైన విషయం. లోకంలో ఎక్కడో ఒకచోట అపశ్రుతులు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. కేవలం వాటినే భూతద్దంలో చూపిస్తూ, 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని వగచే వారికి ప్రపంచంలోని ఆశాజనకమైన మార్పులు అగుపడవు. అయితే, 'మంచి గతమున కొంచెమేనోయ్' అని మహాకవి గురజాడ చెప్పిన మాటలు మరువరాదు.

ప్రపంచమంతా శరవేగంగా మారిపోతున్నా, కొందరు యథాతథవాదులు మాత్రం మార్పును కోరుకోరు. తాము మారాలనుకోరు. లోకం తమ కళ్లముందే మారిపోతుండటాన్ని చూసి వారు ఏమాత్రం సహించలేరు. మార్పులను నివారించడానికి శాయశక్తులా విఫలయత్నాలు చేస్తుంటారు. కాలంచెల్లిన మనుషులు కాలం పరుగును వెనక్కు మళ్లించడానికి నానా విన్యాసాలు చేస్తుంటారు. విఫలయత్నాలు, విన్యాసాలు వికటించి మార్పులు అనివార్యమనే సంగతి అనుభవంలోకి వచ్చినా జీర్ణించుకోలేరు. కాలంతో కలసి ముందుకు సాగేవారిని, మార్పులను మనసారా స్వాగతించే వారిని, మార్పులకు దోహదపడేవారిని అక్కసుకొద్దీ ఆడిపోసుకుంటారు. ఎవరేమనుకున్నా లోకం తన మానాన తాను మారుతూనే ఉంటుంది. మార్పు తన శాశ్వతత్వాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూనే ఉంటుంది.

కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ జనాలు తమ జీవితాల్లో మేలి మార్పుల కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తుంటారు. తమ ఆశలు నెరవేర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరం కాలం మరింతగా అనుకూలించాలని, కష్టాలు కడతేరాలని, ప్రపంచంలో యుద్ధాలు సమసిపోవాలని, శాంతి సామరస్యాలు పరిఢవిల్లాలని, మానవాళికి మేలు కలగాలని, ప్రగతి దిశగా కాలం పరుగు వేగం పుంజుకోవాలని కోరుకుందాం. కొత్త సంవత్సరం కొత్త వేకువ ఉదయించాలని కోరుకుందాం. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకోవడానికి కొత్త సంవత్సరం ఒక చక్కని సందర్భం. ఈ సందర్భాన్ని సార్థకం చేసుకుందాం.

# నిర్మొహమాట గుణ సంపన్నులు!

కామెంట్



కరణ్ థాపర్

**నిజం అని తాము నమ్మిన దానిని భారతీయులు ఒక అద్భుతమైన విధానంలో వ్యక్తపరుస్తారు. ఏమాత్రం సంకోచం లేకుండా అనువుకాని వేళనైనా చొరవ చేసుకుని వచ్చి తటాలున పేలుతారు. అలా మాట్లాడ్డం వల్ల ఎవర్నయినా తక్కువ చేస్తున్నామా అనే ఆలోచనా వారిలో కనిపించదు. పైపూతలేం ఉండవు. అది కొన్నిసార్లు బాధాకరంగా ఉన్నప్పటికీ దాదాపుగా అదే ఎల్లప్పుడూ ఒక బాధా నివారిణిగా పనికొస్తుంది. కేవలం మన దేశంలో మాత్రమే ముక్కూమొహం తెలియనివారు కూడా రాత్రి పొద్దు పోయాక ఫోన్ చేసి, వాళ్ల మనసులో ఉన్నదానిని మీ ముఖానికేసి కొడతారు. అటువంటి ప్రవర్తనతో అందరికీ తాము వేదుక అవుతున్నామని తెలిసినా లెక్కచేయరు. వాళ్లు అలా ఎందుకు చేస్తారంటే, వాళ్లకు అలా చేయాలనిపించింది కనుక!**

రాత్రి బాగా పొద్దుపోయాక ఒక్క ఉదుటున ఉలికిపాటుగా మోగిన ఫోన్‌ని – అవతల ఏం ఉపద్రవం ముంచుకొచ్చిందో ఊహించలేను కనుక – క్షణమైనా ఆలస్యం చేయకుండా చేతికి అందుకున్నాను. మామూలుగానైతే ఆ ఫోన్ మోగిన సమయం, ఆ మాట తీరు తప్పున నా చేత ఫోన్ పెట్టిపడేసేలా చేసి ఉండేవి.

''నేను మిమ్మల్నొక ప్రశ్న అడగాలనుకుంటున్నాను'' అని అంటూనే... నా మాటకు చోటు ఇవ్వకుండా, ''నేను మీ కాలమ్‌ని క్రమం తప్పకుండా చదివే పాఠకుడిని. మీరెప్పుడూ కూడా ప్రతిదాన్నీ విమర్శిస్తూనే ఉండటం గమనించాను. మెచ్చుకోవడానికి అసలు మీకేమీ కనిపించదా?'' అని అవతలి వ్యక్తి!

ముక్కు మీద గుద్దినట్లున్న ఆ మొద్దుబారిన ప్రశ్న ఒక్కసారిగా నన్ను తత్తరపాటుకు గురిచేసింది. ఏం చెప్పాలో తెలియలేదు. ఒకటి మాత్రం తెలుస్తూనే ఉంది. అతడు నన్ను బోనులో నిలబెట్టాడు. నా తరపు వాదనను నేను చెప్పాలి. ఫోన్ పెట్టేసి తప్పించు కోవచ్చు. అలా చేయాలని నేను అనుకున్న సందర్భాలు గతంలో కూడా ఉన్నాయి. కానీ అది ప్రశ్నకు సమాధానం అవదు. అంతేకాదు, సంభాషణ నుండి ఉత్పన్నం అవవలసిన తక్కిన సందేహాలు అర్ధంతరంగానే వ్యక్తం కాకుండా పోతాయి.

''విమర్శించడమే వివేకం అన్నట్లుగా రాస్తారు మీరు. విమర్శనాత్మకంగా ఉండటం అన్నది పాఠకులకు నచ్చే, పాఠకులకు మిమ్మల్ని నచ్చేలా చేసే విషయమే కావచ్చు. అందులో సందేహం లేదు. కానీ అందువల్ల మీరెప్పుడూ ప్రతికూలతలకు మాత్రమే ప్రఖ్యాతిగాంచిన వారవుతారు. అసలు మీకు నచ్చే విషయాలే ఉండవా? వాటి మాటేమిటి? మీరు ప్రశంసించాలనుకున్న వాటి సంగతేమిటి? వాటి గురించి రాయడం ద్వారా మీకొక గుర్తింపును మీరెందుకు కోరుకోరు? ఏదో ఒకదానినైనా సమర్థించండి. ప్రతి దానినీ విమర్శిస్తూ పోకండి'' అంటోంది ఆ గొంతు. వారి పేరేమిటో చెప్పారు కానీ, ప్చ్... గుర్తుకు రావడం లేదు.

నన్ను నేను సమర్థించుకోవటానికి దారులు వెతికే పనిలో పడ్డాను. నేను ప్రతికూలమైన వ్యక్తిని కాదని అతడిని సానుకూల పరిచేందుకు ప్రయత్నించాను. కానీ అతడు కొన్ని క్షణాల పాటు మాత్రమే నాకు మాట్లాడే అవకాశాన్ని ఇవ్వగలిగాడు.

''నేను చెబుతాను ఏం రాయాలో'' అన్నాడతను. అతడి స్వరంలోని అలజడి కాస్త నెమ్మదించింది. అంతకు ముందున్న అసహనం స్థానంలో ప్రశాంత చిత్తం ప్రతిఫలించింది. ''మీకొక చిన్న సలహా ఇస్తాను. భారతదేశంలో మీకు నచ్చే వాటి గురించి మీరెందుకు రాయకూడదు? ఆదివారం ఉదయం నేను మీ కాలమ్ చదివి సంతోషంగా, సంతృప్తికరంగా ఉండేందుకు అందులో నాకు మూడు మంచి కారణాలు చూపించండి. కానీ మీరేం చేస్తున్నారో తెలుసా? పూర్తి భిన్నమైన అనుభూతులను నాకు కలిగిస్తున్నారు'' అన్నాడు.



ఫోన్ పెట్టేశాను. అతడి మాటలు నన్ను అయోమయంలోకి నెట్టేసినా, అతడితో సంభాషణ ఆశ్చర్యకరంగా నాకు సంతోషాన్ని కలుగజేసింది. మొదటిగా చెప్పాలంటే – అతడి వాదనను నేను అంగీకరించనప్పటికీ, అతడి వైపు నుంచి అది నిజమే కావచ్చు. నాకున్న విమర్శించే హక్కును – అవసరమైతే దుడుకుగా, అదే సమయంలో దాడి చేసినట్లు కాకుండా – నేను వదులుకునే ప్రశ్నే లేనప్పటికీ అప్పుడప్పుడు ప్రశంసించడం, మెచ్చుకోవడం కూడా అవసరమేనని నేను ఒప్పుకుంటాను. మరీ ముఖ్యంగా నేను చెప్పవలసింది, ఇదే విధమైన సంభాషణ మునుపు కూడా అనేకసార్లు నా అనుభవంలోకి వచ్చింది. అయినప్పటికీ, గతంలో ఎప్పుడూ కూడా నేను ఈ విషయమై గమనింపుతో లేననీ, కనీసం అర్థం చేసుకునే ప్రయత్నమైనా చేయలేదనీ నా కళ్లు తెరుచుకున్నాయి. ఇప్పుడది వచ్చి నేరుగా నా ముఖానికే తగిలిన అభిప్రాయం కాబట్టి బహుశా నేను దాన్నుంచి తప్పించుకునే అవకాశమే లేదు.

నిజం అని తాము నమ్మిన దానిని భారతీయులు ఒక అద్భుతమైన విధానంలో వ్యక్తపరుస్తారు. ఏమాత్రం సంకోచం లేకుండా అనువుకాని వేళనైనా చొరవ చేసుకుని వచ్చి తటాలున పేలుతారు. అందులో నమ్మదగనిదేం ఉండదు. అలాగే, ఎవర్నయినా తక్కువ చేస్తున్నామా అనే ఆలోచనా వారిలో కనిపించదు. పైపూతలేం ఉండవు. మనసులో ఏదుంటే అది, చేర్పులేమీ చేయనట్లుగా స్వచ్ఛంగా ఉంటుంది. అది కొన్నిసార్లు బాధాకరంగా ఉన్నప్పటికీ దాదాపుగా అదే ఎల్లప్పుడూ ఒక బాధా నివారిణిగా పనికొస్తుంది. 'ఊరియా హీప్' (చార్లెస్ డికెన్స్ నవల 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్'లో వినయాన్ని నటించే కపటి పాత్ర)కు దీటుగా మనం కలిగి ఉన్న సమాన కపట సామర్థ్యాన్ని అది పోగొడుతుంది.

నిజానికి మరే ఇతర దేశంలోనూ ఇంతటి అద్భుతమైన గుణం ఉన్నట్లు కనిపించదు. బ్రిటిష్‌వాళ్లు మరీ ఉదాసీనంగా ఉంటారు. ఫ్రెంచివాళ్లు లొడలొడా మాట్లాడుతారు. జర్మనీ దేశస్థులు ఎక్కువ న్యాయబద్ధంగా పోతారు. ఇటాలియన్లు గడబిడ మనుషులు. అమెరికన్లకు పెద్దగా ఏం తెలియదు. సత్యంలా కనిపించేది ఏదైనా చైనీయుల్ని భయపెడుతుంది.

కేవలం మన దేశంలో మాత్రమే ముక్కూమొహం తెలియనివారు మాటల కవాతు చేస్తారు. రాత్రిళ్లు పొద్దు పోయాక ఫోన్ చేసి, వాళ్ల మనసులో ఉన్నదానిని మీ ముఖానికేసి కొడతారు. అంతేకాదు... వాళ్ల వ్యాఖ్య వాళ్ల వ్యక్తిగతం అనీ, అర్ధరాత్రి కూడా దాటేసిందనీ, లేదా ఎవరైనా వింటూ ఉంటారనే నిజాలను కూడా వారు గ్రహించని స్థితిలో ఉంటారు. అటువంటి ప్రవర్తనతో అందరికీ తాము వేదుక అవుతున్నామని తెలిసినా లెక్కచేయరు. వాళ్లు అలా ఎందుకు చేస్తారంటే, వాళ్లకు అలా చేయాలనిపించింది కనుక! వారిని అలా చేయించే ఉద్వేగం కనీస మర్యాదల్ని, సౌమ్యగుణాన్ని, చివరికి అవకాశం లేకపోవడాన్ని కూడా పట్టించుకోనివ్వదు. అలా తన్నుకొచ్చేస్తుందంతే!

కనుక, ఈ ఉదయం... ఇంతకుముందు నేను సరిగా ఆలోచించని నాలో ఉండవలసిన గుణం గురించి నాలో ఆలోచన రేకెత్తించిన నా నడిరేయి సంభాషణకర్తను అభినందించాలని అనుకుంటున్నాను. మీలాంటి వాళ్లే సర్, ఒక మనిషిలో విమర్శించనందువల్ల కలిగే స్వీయ ఆమోదాన్ని, ఆత్మసంతృప్తిని కదిలిస్తారు. మీ కాల్ నాకు గొప్ప ప్రయోజనం కలిగించింది. ధన్యవాదాలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### కొత్త కోరికలు



కొత్త సంవత్సరంలో మనం: కేవలం ఇంటిని కాదు, ఆవాసాన్ని(హోమ్) కోరుకుందాం. కేవలం సరదాను కాదు, సంతోషాన్ని కోరుకుందాం. కేవలం బిజీగా ఉండటం కాదు, ఒక లక్ష్యాన్ని పెట్టుకుందాం. కేవలం రోజువారీ అస్తవ్యస్త జీవితాన్ని కాదు, మనశ్శాంతిని కోరుకుందాం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

### వదులుకోవాల్సినవి



కొత్త సంవత్సరంలో వదిలేయాల్సినవి: అధికార దర్పం. స్వీయ అపనమ్మకం. ఎదుటివారి విజయాల పట్ల కినుక. తప్పుగా మాట్లాడటం. మంచి సమయం కోసం ఎదురుచూస్తూనే ఉండటం. విషపూరిత సంబంధాలు. అక్కర్లేనివి ఉంచుకోవడం. ఎప్పుడూ తీసుకుంటూనే ఉండి ఎన్నడూ ఇవ్వకపోవడం. ప్రశంసల కోసం ఎదురు చూడటం. అసమర్థ నాయకత్వం. అసూయ.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

### మంచి ఆలోచన



ఒకవేళ వైవాహిక జీవితం సరిగ్గా సాగకపోయినా, విడాకులు తీసుకోవాల్సి వచ్చినా– పనికిమాలిన కేసులు పెట్టుకొని, ఒకరి జీవితం మరొకరం నాశనం చేసుకోము అని దంపతుల నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకునే వివాహ వేదిక వెబ్‌సైట్ ఒకటి ఉంటే బాగుంటుంది. దానిలోనే వరకట్నం ఇవ్వనక్కరలేదనే ఒప్పందం కూడా జతచేసుకోవచ్చు.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

### ఒక విజయం



2023లో నేను చేసుకున్న ఒక పెద్ద తీర్మానం – బరువు తగ్గడం. అందులో విజయం సాధించానని చెప్పడానికి సంతోషిస్తున్నాను. 13 కిలోలు తగ్గగలిగాను. ఫ్!

– సందీప్ మనుధానే, విద్యావేత్త

### ఏమయ్యాయో!



నా కొత్త సంవత్సర తీర్మానం ఏమిటంటే – నా గతేడాది తీర్మానాలు ఏమయ్యాయో కనుక్కోవడం!

– జేవియర్, వ్యంగ్య వ్యాఖ్యాత

### నా నగరాలు



నాకు నచ్చని నగరం: ఢిల్లీ. మరీ జనం ఊదరగొట్టే నగరం: న్యూయార్క్. నాకు నచ్చే నగరం: లండన్. నేను ప్రేమించే నగరం: బ్యాంకాక్. నాలా నేను ఉండగలిగే నగరం: ముంబయి. ఇంకా దర్శించాల్సిన నగరం: కోపెన్‌హెగెన్. నేను ఉండాలని కలలుగంటున్న నగరం: నగరం కూడా కాదు, బాలిలోని ఉబుద్ దగ్గర చిన్న నా పచ్చటి సొంతిల్లు.

– కామ్యా బుచ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

## నవ్వుల విరిపూతై...



క్రొత్త ఆలోచనలు
వెల్లివిరియాలి
సుమహార సుగంధాలై
వేచిచూస్తున్న కలలు
నిండు వసంతమై పండాలి
పరిమళ గులాబీలై
గూడుకట్టిన గుండె దిగులు
రివ్వున ఎగిరిపోవాలి
ఆనందాల గువ్వలై
కన్నీరై దాగిన కష్టాలు
పడిలేచే కెరటాలై
విజయతీరాలు చేరాలి
సాగే కాలం ముందు
సాగిలపడటం కంటే
కనిపించని గమ్యం కోసం
చేసే అన్వేషణ గొప్పది!
మారే క్షణాల ముందు
మథనం చెందేకంటే
వినిపించే శబ్ద శంఖపు
ఎదధ్వని వినడం గొప్పది!
నూతన ఆంగ్లవత్సరం
వస్తోంది... నవ్వుల విరిపూతై!

– డా॥ బాలాజీ దీక్షితులు పి.వి.

# ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుందాం!

అభిప్రాయం




డా॥ దేవరాజు మహారాజు

'ద గ్రేట్ డిక్టేటర్' సినిమాలో చాప్లిన్ ద్విపాత్రాభినయం చేశాడు. ఒకటి – హిట్లర్ పాత్ర (డిక్టేటర్) రెండు – హిట్లర్ పోలికలతో ఉన్న క్షురకుడి పాత్ర.

వేల సంఖ్యలో సైనికులు బారులు తీరి ఉన్న సన్నివేశమది. వందల సంఖ్యలో మిలిట్రీ అధికారులు హిట్లర్ రాక కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఆ మహాసభలో హిట్లర్ సైనికుల్ని ఉద్దేశించి మాట్లాడవలసి ఉంది. కానీ, ఆ సమయానికి అక్కడికి హిట్లర్ బదులు, అతని పోలికలతో ఉన్న క్షురకుడు చేరుకుంటాడు. అతనే హిట్లరనుకుని అధికారులు గౌరవ వందనం సమర్పించి అతణ్ణి వేదిక మీదికి తీసుకు వెళతారు. ఒక నిమిషం తడబడి ఆ తర్వాత – ఒక సామాన్యుడిగా తను కోరుకుంటున్నదేమిటో మాట్లాడతాడు. హిట్లర్‌ను ఎద్దేవా చేసే చార్లీ చాప్లిన్ తన అంతరంగాన్ని అతి సామాన్యుడైన క్షురకుడి పాత్ర ద్వారా ఈ విధంగా వ్యక్తం చేశాడు. 'ద గ్రేట్ డిక్టేటర్'లోని ఉపన్యాసం ముఖ్యాంశాలు ఇక్కడ మీకందిస్తున్నాను.

''క్షమించాలి! నాకు చక్రవర్తిని కావాలని లేదు. అలాంటి ఉద్దేశమే లేదు. ఎవరినో జయించాలని కాని, ఎవరి మీదనో పెత్తనం చలాయించాలని కానీ నాకు లేదు. తెలుపు, నలుపు అన్న తేడా లేదు. ప్రతివారికీ చేయగలిగినంత సహాయం చేయాలనే ఉంది. మనం ఒకరికొకరం సహాయపడుకుంటూ ఉండాలి. ఎదుటివారి సంతోషమే మనకు స్ఫూర్తిని, సంతృప్తిని ఇస్తుంది. వారి దుఃఖం కాదు – ఒకరిని అసహ్యించుకోవడం, అవహేళన చేయడం మనం కోరుకోం. ఈ విశాల ప్రపంచం అందరిదీ. మన జీవితం స్వేచ్ఛకూ, ఆనందానికీ ప్రతిరూపమవ్వాలి! కానీ, మనం దారి తప్పుతున్నాం. స్వార్థం మనుషుల అంతరాత్మల్ని విషపూరితం చేస్తోంది. కుత్సితాలతో ప్రపంచాన్ని కుంచింపజేస్తోంది. వేగాన్ని అభివృద్ధి పరిచాం. నిజమే! కానీ, మనలో మనమే ముడుచుకుంటున్నాం. కావాల్సినవన్నీ యంత్రాలు తయారు చేస్తున్నాయి. కానీ, మన కోర్కెల దాహం తీరడం లేదు.

మన విజ్ఞానం మనల్ని మానవ ద్వేషులుగా చేస్తూ ఉంది. మన తెలివి తేటలు మనల్ని నిర్దయులుగా, కఠినాత్ములుగా తీర్చిదిద్దుతున్నాయి. యంత్రాల యంత్రాంగం కన్నా, మనకు మానవత్వపు మనుగడ ముఖ్యం కావాలి. మితిమీరిన తెలివితేటల కన్నా మర్యాద, మన్నన, దయార్ద్ర హృదయం కావాలి. ఈ లక్షణాలు లేని జీవితం భయానకమై నశిస్తుంది. రేడియో, విమానాలు మానవుల్ని దగ్గరి పరిధిలోకి చేరుస్తున్నాయి. మానవునిలోని మంచితనమే వీటిని కనుక్కోగలిగింది. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ఎలుగెత్తి చాటింది. ఈర్ష్యా ద్వేషాలు నశిస్తాయి. నియంతలు నశిస్తారు. ప్రజల నుండి లాక్కున్న అధికారం మళ్ళీ, తిరిగి ప్రజలకే దక్కుతుంది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు నశించవు. తాత్కాలికంగా అణచబడ్డా, అవి సంకెళ్ళు తెంపుకొని ధైర్యంగా



బతుకుతాయి. సైనికులారా ఆలోచించండి! మీకు తిండి పెట్టి, కసరత్తులు చేయించి, మిమ్మల్ని పూర్తిగా వాడుకునేవాడు ఎలాంటివాడో ఒకటికి రెండుసార్లు బాగా ఆలోచించండి.

మీరు పశువులు కాదు. గడ్డి పోచలు కాదు. మానవత్వం పట్ల మీకు అచంచల విశ్వాసం ఉంది. వీర సైనికులారా! స్వేచ్ఛ కోసం పోరాడండి. బానిసత్వం కోసం కాదు. యంత్రాల్ని సృష్టించుకోగల నేర్పరులు మీరే. యంత్రాలై పోకుండా మనుషులుగా నిలదొక్కుకునే ఆత్మశక్తి మీలోనే ఉంది. రండి! ప్రజాస్వామ్యం పేరిట ఏకమై, ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుందాం! దురాశ, దుఃఖం, అసూయ, క్రూరత్వాలకు నిలువ నీడ లేకుండా చేద్దాం! శాస్త్ర సాంకేతికాభివృద్ధి సాధించే ప్రగతివైపు పయనిద్దాం... రండి! అందరం ఏకమౌదాం!!'' ఇది చాప్లిన్ ఉపన్యాసం. ఇక్కడ మరొక విశేషముంది. హిట్లర్‌ను చార్లీ చాప్లిన్ ఆటపట్టించాడు. కానీ, చాప్లిన్ అభిమానుల్లో హిట్లర్ ఒకడు!

ఎటువంటి వివాదాలకు తావు లేకుండా 'వరల్డ్ గ్రేటెస్ట్ ఎంటర్‌టెయినర్'గా, ప్రపంచాన్ని నవ్వుతో శాసించిన సర్ చార్లీ చాప్లిన్ (16 ఏప్రిల్ 1889 – 25 డిసెంబర్ 1977) తన విజయ రహస్యాన్ని తానే అనేకసార్లు బేరీజు వేసుకున్నాడు. 'ఈ ప్రజలు దేన్ని చూసి నవ్వుతారు?' అనే శీర్షికతో చాప్లిన్ 1918లో ఒక అమెరికా పత్రికకు వ్యాసం రాశాడు. అందులో ''హాస్యం టోపీ ఎగిరిపోవడంలో లేదు. దాన్ని పట్టుకోవడానికి ఒక పెద్ద మనిషి పడే అవస్థలో ఉంది. ప్యాంటు – పిగిలిపోవడంలో లేదు. దాన్ని కప్పి పుచ్చుకోవడానికి పడే తికమకలో ఉంది. అలాగే జారిపోయే ప్యాంట్ వదిలేస్తే ఎవరికీ నవ్వు రాదు. కానీ, జారిపోకుండా పైకి అనుకుంటూ హడావిడి పడిపోవడంలో హాస్యం ఉంది. అమ్మాయి నగ్నత్వాన్ని ప్రదర్శిస్తున్న పోస్టర్‌ను, ఒక పెద్ద మనిషి నిలబడి తనివితీరా చూస్తుంటే ఎవరికీ నవ్వు రాదు. సమాజంలో తానొక పెద్ద మనిషినని గుర్తుంచుకుని అలా చూస్తూ ఉంటే తన వ్యక్తిత్వానికి దెబ్బ తగులుతుందని బాధ పడుతూ, ఉండలేకపోతూ, చూడనట్టు నటిస్తూ... చూస్తూ ఉండటంలో హాస్యం ఉంది... బలహీనుడై ఉండి, పహిల్వాన్‌తో ఛాలెంజ్ చేయడం, తెలివిగా తన్నులు తప్పించుకుంటూ ఉండటంలో హాస్యం ఉంది. హాస్యం కత్తి మీద సాములాంటిది. ఎక్కడ ఏ కొద్దిగా బెడిసి కొట్టినా హాస్యానికి బదులు జుగుప్స, ఏవగింపు, అసహ్యం కలుగుతాయి.


ప్రపంచాన్ని తరతరాలుగా కదిలిస్తూ వస్తున్న చార్లీ చాప్లిన్ సునిశిత హాస్యం ఎక్కడి నుంచో రాలేదు. జీవితాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకున్న చాప్లిన్ మేధలోంచి వచ్చింది. ''నూటికి పదిమంది బాగా ఉన్నవాళ్ళూ, తొంభయిమంది లేనివాళ్ళూ ఉన్న ఈ సమాజంలో... 90 శాతం ప్రజల్ని నవ్వించడానికి, 10 శాతం మందిని గేలి చేయడంలో– తప్పేమిటి?'' అన్నది ఆయన ప్రశ్న! వర్గ దృక్పథాన్ని ఇంత సులభంగా, సరళంగా చెప్పిన వాళ్ళు బహుశా ఎవరూ లేరేమో! హాస్యంతో మానవ వాదానికి ఊపునిచ్చిన మహనీయుడు కూడా మరొకరు లేరేమో!!

వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త

## సాఫల్యం సిద్ధించాలంటే...

మనిషి శరీరంలో కొలెస్టరాల్ అనే కొవ్వు ఉంటుందనీ, అందులో 'మంచి' కొలెస్టరాల్, 'చెడ్డ' కొలెస్టరాల్ అని రెండు రకాలుంటాయనీ వైద్యులు చెప్తారు. అలాగే, మనిషి మనసులో మోసులు వేస్తూ ఉండే ఆశలలో కూడా, 'మంచి' ఆశలూ, 'చెడ్డ' ఆశలూ అని రెండు రకాలు కనిపిస్తాయి.

దురాశ, అత్యాశ 'చెడ్డ' కొలెస్టరాల్ లాంటివి. అవి దుఃఖానికే దారి తీస్తాయి. 'నేటికంటే రేపు మరింత బాగుంటుంది', 'నేను చేసే కృషి తప్పక ఫలిస్తుంది', 'ధర్మం జయిస్తుంది', 'మంచిమనిషికి మంచి రోజులు తప్పక వస్తాయి' – ఇలాంటి ఆశలు 'మంచి' కొలెస్టరాల్ లాంటివి. ఈ ఆశావహ దృక్పథం ఉన్న వాళ్ళ జీవితం, అది లేని వాళ్ళ జీవితం కంటే ఉత్సాహంగా, ఆనందంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ 'మంచి' కొలెస్టరాల్ లోపిస్తే, మనిషి ఊహాజనితమైన నిత్య శంకలతో, దిగుళ్లతో నిస్సంతోషిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. మరో నూతన సంవత్సరమనే మైలు రాయిని మనం దాటుతున్న సందర్భంలో ఈ మాట మనసులో ఉంటే మంచిది.



జ్యోతిర్మయం

కొత్త సంవత్సరం ఎలా ఉంటుంది అనే ప్రశ్నకు కచ్చితమైన సమాధానం చెప్పే 'టెక్నాలజీ' మనకు ఇంకా అందుబాటులో లేదు. అయితే, గత అనుభవాల ఆధారంగా చెప్పాలంటే, కొత్త వత్సరం కూడా శుభాశుభాలూ, సుఖదుఃఖాలూ, లాభాలాభాలూ, జయాపజయాల కలగలుపుగానే ఉంటుంది. జరగబోయేవాటిలో, మన కృషి మాత్రమే కాకుండా, కర్మ, 'అదృష్టం', దైవానుగ్రహం లాంటి ఇతర అంశాల ప్రమేయం కూడా ఉంటుంది గనక, భవిష్యత్తు విషయంలో కొంత అనిశ్చితి ఎప్పుడూ తప్పదు. కానీ ఆత్మ విశ్వాసంతో, శక్తి వంచన లేకుండా కృషి చేసేవారి కష్టం ఫలించక మానదనేది జీవితంలో సాధారణంగా ఎదురయ్యే అనుభవం. ఘనులెందరో చెప్పే 'కష్టే ఫలి' సూత్రం, రాబోయే వత్సరానికి మాత్రం వర్తించక మానుతుందా? కృషికి ఆరోగ్యకరమైన ఆశాభావం తోడయితే, కార్యసాధన శక్తి మరింత పెరుగుతుంది. అనారోగ్యకరమైన నిరాశా నిస్పృహలు శక్తిని క్రుంగదీస్తాయి. ఇది మరవకుండా సాగేవారికి నూతన సంవత్సరంలో శుభాలే అత్యధికం, అశుభాలు అరుదు!

కాగా, వచ్చే ప్రతి కొత్త వత్సరమూ, 'మిత్రమా! అసలే అల్పమైన ఆయుః పరిమితిలో మరో సంవత్సరం గడిచిపోయింది. సమయం విలువ గ్రహించి దాన్ని సద్వినియోగం చేసుకో' అని గుర్తు చేస్తుంది. ఇది సాఫల్యం కోరేవారందరికీ ముఖ్యమైన గమనిక. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.పంచమి ప.12.18 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మఖ ఉ.7.17 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.4.11 నుండి 5.55 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.39 నుండి 3.27 వరకు, **అమృతఘడియలు:** రా.2.47 నుండి 3.44 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.34, **సూర్యాస్తమయం:** 5.32.



సిడ్నీ ఒపేరా హౌస్ వద్ద ఆదివారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలు

**మన దేశ సమయంతో పోల్చి చూస్తే, కొన్ని దేశాల్లో ఎప్పుడు కొత్త సంవత్సరం మొదలవుతుందంటే..**

- న్యూజిలాండ్.. మనకు సాయంత్రం 4.30
- ఆస్ట్రేలియా.. మనకు సాయంత్రం 6.30
- జపాన్, దక్షిణ కొరియా.. మనకు రాత్రి 8.30
- చైనా, మలేషియా, సింగపూర్, ఫిలిప్పీన్స్.. మనకు రాత్రి 9.30
- థాయిలాండ్, వియత్నాం.. మనకు రాత్రి 10.30
- యూఏఈ, ఒమన్.. మనకు జనవరి 1 తెల్లవారుజామున 1.30
- గ్రీస్, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్.. మనకు జనవరి 1 తెల్లవారుజామున 3.30
- జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, మొరాకో, కాంగో.. మనకు జనవరి 1 తెల్లవారుజామున 4.30
- యూకే, ఐర్లాండ్, పోర్చుగల్.. మనకు మనకు జనవరి 1 తెల్లవారుజామున 5.30
- బ్రెజిల్, అర్జెంటీనా, చిలీ.. మనకు జనవరి 1 ఉదయం 8.30
- ప్యూర్టోరికో, బెర్ముడా, వెనెజువెలా.. మనకు జనవరి 1 ఉదయం 9.30
- అమెరికా తూర్పుతీర రాష్ట్రాలు, పెరూ, క్యూబా.. మనకు జనవరి 1 ఉదయం 10.30
- మెక్సికో, కెనడా, అమెరికా మధ్య రాష్ట్రాలు.. మనకు జనవరి 1 ఉదయం 11.30
- అమెరికా దక్షిణ తీర రాష్ట్రాలు మనకు జనవరి 1 మధ్యాహ్నం 1.30
- హవాయ్.. మనకు జనవరి 1 మధ్యాహ్నం ఉదయం 3.30
- సమోవా దీవులు.. మనకు జనవరి 1 సాయంత్రం 4.30
- బేకర్, హౌలాండ్ దీవులు.. మనకు జనవరి 1 సాయంత్రం 5.30

## సమీపంలోనే ఉన్నా..
# ఓ రోజు లేటు..



వివిధ దేశాలు చాలా విస్తీర్ణంలో ఉన్నా.. ఏదో ఒక సమయాన్ని మొత్తం దేశానికి పాటిస్తూ ఉంటాయి. అందువల్ల ఆ దేశాల్లో ఒక చివరన ఉన్న ప్రాంతాల్లో సూర్యోదయం అయ్యాక కొన్ని గంటల తర్వాతగానీ మరో చివరన ఉన్న ప్రాంతాల్లో తెల్లవారదు. ఇలా వివిధ దేశాల ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో ఆయా దేశాల సమయాన్నే పాటించే క్రమంలో.. సమీపంలోనే ఉన్న ప్రాంతాల్లో కూడా వేర్వేరు తేదీలు, సమయం ఉంటుంటాయి కూడా. దీనివల్ల పసిఫిక్ మహా సముద్రం మధ్యలో ఉండే అంతర్జాతీయ డేట్‌లైన్ కూడా మెలికలు తిరిగి ఉంటుంది.

■ ప్రపంచంలో అన్ని దేశాలకన్నా ముందే రోజు మారిపోయే కిరిబతి దీవులకన్నా రెండు గంటలు ఆలస్యంగా సూర్యోదయం అయ్యే బేకర్, హౌలాండ్ దీవుల్లో అదే తేదీ, రోజు ఉండాలి. కానీ అమెరికా ఆధీనంలో ఉన్న ఈ దీవుల్లో ఆ దేశ సమయాన్ని పాటిస్తారు కాబట్టి.. అవి మొత్తంగా ఒక రోజు వెనకాల ఉంటాయి. కిరిబతిలో సోమవారం ఉదయం 8 గంటలుంటే.. రెండు గంటల తర్వాత సూర్యోదయం అయ్యే బేకర్, హౌలాండ్ దీవుల్లో ఆదివారం ఉదయం 6 గంటల సమయమే ఉంటుంది.

# వినూతన వేడుకలు..

**కొత్త సంవత్సరం వచ్చిందంటే.. ప్రతి ఒక్కరిలోనూ సరికొత్త ఉత్సాహం వచ్చేస్తుంది. పాత ఏడాది ఇచ్చిన చేదు అనుభవాలను మరిచిపోయి.. తీపి జ్ఞాపకాలను గుర్తుపెట్టుకొని సరికొత్త ఆకాంక్షలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. అయితే ఈ వేడుకలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా జరుగుతుంటాయి. భిన్న సంస్కృతులు, విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు ప్రతిబింబిస్తాయి. ప్రపంచమంతా క్రమంగా 2023కు వీడ్కోలు పలుకుతూ.. 2024కు స్వాగతం పలికిన తరుణంలో.. వివిధ దేశాల ప్రజలు జరుపుకునే వేడుకలకు సంబంధించిన ఆసక్తికర అంశాలు..**

**ఒక్కో దేశంలో ఒక్కో విధంగా నూతన సంవత్సర సంబరాలు**

**ఆహారం నుంచి ఆధ్యాత్మికత వరకు విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు**

- డెన్మార్క్‌లో ప్రజలు తమ ఇళ్లలోని పింగాణీ పాత్రలను గది తలుపులపైకి విసిరేస్తారు. అవి పగిలి.. ఎన్ని ముక్కలైతే కొత్త ఏడాది అంత అదృష్టం కలిసొస్తుందని వారి నమ్మకం.
- గ్రీస్ ప్రజలు 'వాసిలోపిటా' అనే కేక్‌లో ఒక నాణాన్ని కనిపించకుండా పెడతారు. ఎవరికైతే ఆ నాణెం ఉన్న కేక్ భాగం వస్తుందో.. వారికి ఆ ఏడాదంతా అదృష్టం కలిసి వస్తుందని విశ్వసిస్తారు.
- నూతన సంవత్సరం అంటేనే పాతకు వీడ్కోలు చెప్పడం. దీనికి సూచికగా దక్షిణాఫ్రికా ప్రజలు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి పాత వస్తువులను కిటికీల నుంచి బయటకు విసిరేస్తారు.
- స్కాట్లాండ్‌లో అర్ధరాత్రి దాటాక తమ ఇంట్లోకి మొదటగా ఎవరు అడుగు పెడతారో.. వారి వల్ల అదృష్టం వస్తుందని విశ్వసిస్తూ బహుమతులు ఇచ్చుకుంటారు.
- స్పెయిన్‌లో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలు కాగానే.. 12 ద్రాక్ష పండ్లు తినడం సంప్రదాయం. ఒక్కో పండు ఒక్కో నెలకు సంకేతం. ఇలా తినటం వల్ల అదృష్టం లభిస్తుందని నమ్ముతారు.
- జపాన్‌లో ప్రజలు అర్ధరాత్రి వేళ బౌద్ధ దేవాలయాలకు వెళ్లి 108 సార్లు గంటలు మోగిస్తారు.
- బ్రెజిల్‌లో జనం తెలుపు రంగు దుస్తులు ధరించి సముద్ర దేవత యెమాంజకు నైవేద్యంగా సముద్రంలోకి పూలను విసిరి పాటలు పాడతారు.
- ఫిలిప్పీన్స్‌లో గుండ్రని ఆకారంలో ఉన్న వస్తువులు, దుస్తులు అదృష్టం తెచ్చిపెడతాయని విశ్వసిస్తారు. అందువల్ల అక్కడి వారు నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ గుండ్రని చుక్కలు ఉన్న దుస్తులు ధరిస్తారు. ఆ రోజు గుండ్రని పండ్లు తింటారు.
- రష్యాలో కాగితంపై న్యూ ఇయర్ విషెస్ రాసి దానిని కాల్చి ఆ పొడిని అర్ధరాత్రి షాంపైన్లో కలుపుకొని తాగుతారు.
- అమెరికాలోని న్యూయార్క్‌లో అర్ధరాత్రి 12 గంటలకు టైమ్ బాల్‌ను కిందకు వదులుతారు. దీన్ని 'బాల్ డ్రాప్' అంటారు. అలా వారికి కొత్త సంవత్సరం మొదలవుతుంది.

### కిరిబతిలోనే తొలి సంబరం..

ప్రపంచంలో అందరికంటే ముందు పసిఫిక్ సముద్రంలోని కిరిబతి దీవుల్లోనే కొత్త సంవత్సరం వస్తుంది. భారత కాలమానం ప్రకారమైతే డిసెంబర్ 31వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకే ఆ ప్రాంతం నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతుంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల్లో మన కంటే ఆరేడు గంటల ముందే మొదలవుతుంది. జపాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా మనకంటే మూడున్నర గంటల ముందే అడుగుపెడతాయి. భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లు భారత్ కంటే అరగంట ముందు కొత్త సంవత్సరంలోకి అడుగుపెడతాయి.

### చైనాలో వేడుకలు ఉండవు..

జనవరి 1న కొత్త సంవత్సర వేడుకలను నిర్వహించుకోని దేశాలు కూడా ఉన్నాయి. చైనాతో పాటు సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, వియత్నాం దేశాలు న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవు. వారి క్యాలెండర్ ప్రకారమే అక్కడ కొత్త సంవత్సరం వేడుకలు నిర్వహించుకుంటారు. చైనా ప్రజలు ఫిబ్రవరి నెలలో నూతన సంవత్సరాన్ని ఘనంగా జరుపుకుంటారు.

- సాక్షి, అమరావతి




# 'విరివనాల' స్వాగతం

**తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలోని నర్సరీ రైతులు నూతన సంవత్సరానికి వినూత్నంగా స్వాగతం పలికారు. కడియం మండలంలోని పల్ల వెంకన్న నర్సరీలో లక్ష మొక్కలతో ఏర్పాటు చేసిన 'వెల్‌కమ్ 2024' అందర్నీ ఆకట్టుకుంటోంది. ఆల్టర్నెంత్రా రెడ్, ఎల్లో, గ్రీన్, కేజరీనా గ్లూకా తదితర రకాల మొక్కలను ఇందుకోసం వినియోగించారు. ఐదు రోజుల పాటు 24 మంది కష్టించి ఈ కూర్పును ఏర్పాటు చేసినట్లు నర్సరీ డైరెక్టర్ పల్ల వెంకటేష్ వెల్లడించారు. - కడియం**

# పిట్టలదొర!




## గతంలో మాయ చేసినట్లే ఎడాపెడా హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు



**సాక్షి, అమరావతి:** ఎన్నికలకు ముందు ఇష్టం వచ్చినట్లు హామీలివ్వడం ఆ తర్వాత వాటిని తుంగలో తొక్కి ప్రజలను వంచించడంలో మహా నేర్పరిగా పేరు గాంచిన చంద్రబాబు మళ్లీ అదే బాటలో పయనిస్తున్నారు. వచ్చే ఎన్నికల కోసం ఎడాపెడా హామీలు ఇచ్చేస్తూ, ప్రజలను నమ్మించేందుకు మళ్లీ తన విద్యను ప్రదర్శిస్తున్నారు. గతంలో తాను చెప్పి అమలు చేయలేకపోయిన హామీలనే మళ్లీ ఇప్పుడు కొత్తగా ఇస్తుండడం గమనార్హం. ఇటీవల తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించిన ఆయన అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల భృతి ఇస్తానని ప్రకటించారు. 2014 ఎన్నికల్లోనూ ఇదే హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలో ఉన్నప్పుడు దాని గురించి పట్టించుకోలేదు. అప్పట్లో రూ.2 వేల భృతి ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక చివరి వరకు ఆ ఊసే ఎత్తకుండా కాలక్షేపం చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్ని వైపుల నుంచి ఒత్తిడి రావడంతో ఎన్నికలకు 3 నెలల ముందు తూతూమంత్రంగా వెయ్యి రూపాయల నిరుద్యోగ భృతిని ఎంపిక చేసిన కొందరికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. చేసిన మోసాన్ని కప్పి పుచ్చుకునేందుకు చివర్లో ఇలా నాటకం ఆడారు. ఇప్పుడు అవన్నీ మరచిపోయి మళ్లీ నిరుద్యోగులను మాయ చేసేందుకు చంద్రబాబు నిర్భీతిగా అదే హామీని ఇస్తుండడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

**ఇంటికో ఉద్యోగం అని మోసం**

2014 ఎన్నికలప్పుడు ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక బుట్టదాఖలు చేశారు. ఇప్పుడు ఏకంగా ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తానని నమ్మబలుకుతున్నారు. ఈ విషయాన్ని కూడా కుప్పంలో ప్రకటించారు. టీడీపీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెబుతున్నారు. ఈ విషయాన్ని కొన్ని నెలల క్రితం ప్రకటించిన ముందస్తు మేనిఫెస్టోలోనూ పొందుపరిచారు. 2014లో ఇచ్చిన ఇంటికో ఉద్యోగం హామీని ఎందుకు అమలు చేయలేదనే దానికి మాత్రం సమాధానం చెప్పడం లేదు. బాబు వస్తే జాబు వస్తుందని నిరుద్యోగులు, యువతను నమ్మించారు. అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలను సైతం తొలగించారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్నప్పటికీ, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేయడంతో ప్రజలు ఛీత్కరించారు. 2014 ఎన్నికలకు ముందు 600కు పైగా హామీలతో 50 పేజీల మేనిఫెస్టోను విడుదల చేసి ప్రజలను మాయ చేశారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, వ్యవసాయ రుణాల మాఫీ, డ్వాక్రా, చేనేత రుణాల రద్దు, రైతులు తాకట్టు పెట్టిన బంగారు రుణాల మాఫీ వంటి అనేక హామీలు ఇచ్చినప్పటికీ, ఒక్క దాన్ని కూడా అమలు చేయలేదు. ఈ హామీలు కనిపించకుండా వెబ్‌సైట్ నుంచే తొలగించారు. అందుకే ప్రజలు ఆయన్ను చిత్తుగా ఓడించి, నమ్మకానికి మరో పేరైన వైఎస్ జగన్‌కు అధికారం ఇచ్చారు. అందువల్లే ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడమే కాకుండా, ఇతరత్రా మేలు చేసే అనేక పథకాలు, కార్యక్రమాలతో చరిత్ర సృష్టించి.. మళ్లీ ఓట్లు అడుగుతున్నారు.

### మళ్లీ మోసాల హామీలు

చంద్రబాబు మాత్రం తన మోసాలు, అబద్ధాల హామీలు, నయవంచన చరిత్రను మరచిపోయి మళ్లీ అవే హామీలను ఎడాపెడా గుప్పిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. హామీలను అమలు చేయకుండా చెత్త బుట్టలో వేసి, ప్రజలకు వెన్నుపోటు పొడవడంలోనూ మాస్టర్స్ డిగ్రీ చేసిన చంద్రబాబు.. ఇప్పుడు మళ్లీ అదే బాటలో పయనిస్తున్నారు. గతంలో 600 హామీల మేనిఫెస్టోను ప్రజలకు కనపడకుండా దాచేసిన ఆయన ఇప్పుడు మళ్లీ కొత్తగా ముందస్తు మేనిఫెస్టోను విడుదల చేసి ప్రజలకు గేలం వేద్దామని బయలుదేరారు. త్వరలో మళ్లీ ఇంకో మేనిఫెస్టో ఇచ్చి ప్రజలను మాయ చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడి

**10 మందికి గాయాలు.. వీరిలో నలుగురికి తీవ్రగాయాలు**



పెదపోలయ్య | బంకా యల్లయ్య | పీరయ్య


**బొల్లాపల్లి:** పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామంలో శనివారం రాత్రి, ఆదివారం తెలుగుదేశం వర్గీయులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేసి పదిమందిని గాయపరిచారు. వీరిలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తుల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. శనివారం రాత్రి టీడీపీ నాయకుడు వీర్ల వెంకయ్య ఇంటిముందు మూత్ర విసర్జన చేశారనే నెపంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఒంటేరు బ్రహ్మయ్యపై రాళ్లు, గొడ్డళ్లతో దాడిచేశారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఎక్కువ మంది పొలం పనులకు వెళ్లారు. ఇదే అదునుగా టీడీపీ వర్గీయులు గ్రామంలో ఇళ్ల వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడిచేసి కొట్టారు. ఈ దాడుల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బంకా పెదపోలయ్య, యల్లయ్య, ఒంటేరు పీరయ్య, బ్రహ్మయ్య, బంకా పెద్దిరాజు, వాడపల్లి మంగమ్మ, మరో నలుగురు గాయపడ్డారు. వీరిలో బంకా పెదపోలయ్య, యల్లయ్య, ఒంటేరు పీరయ్య, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని కావాలనే.. చిన్న సాకుతో తెలుగుదేశం వర్గీయులు దాడులు చేశారని వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఆవేదన చెందుతున్నారు. బండ్లమోటు ఎస్‌ఐ డి.చెన్నకేశవులు గ్రామంలో పరిస్థితిని పరిశీలించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పీఎం స్వనిధిలోనూ అక్కచెల్లెమ్మలదే అగ్రస్థానం

**దేశంలోనే తొలి స్థానంలో ఉన్న ఏపీ మహిళలు**

- ఈ రుణ గ్రహీతల్లో రాష్ట్రంలో 74 శాతం మంది మహిళలే.. జాతీయ స్థాయిలో మహిళలు 43 శాతమే
- సీఎం జగన్ లక్ష్యాల్లో ఒకటైన మహిళా సాధికారత కనుల ముందుకు
- సీఎం జగన్ ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి.. ఈ రుణాల సద్వినియోగంలోనూ రాష్ట్రానిది రెండో స్థానం..
- రాష్ట్రంలో 4.02 లక్షల దరఖాస్తులకు రూ. 528.85 కోట్ల రుణం మంజూరు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

**పీఎం స్వనిధి కింద రుణగ్రహీతలు ఇలా..**




**వివిధ రాష్ట్రాల్లో పీఎం స్వనిధి రుణగ్రహీతల్లో చురుగ్గా వ్యయం చేస్తున్న వారి శాతం**

| రాష్ట్రం | శాతం |
|---|---|
| పంజాబ్ | 32 |
| ఆంధ్రప్రదేశ్, తమిళనాడు | 28 |
| రాజస్థాన్, కర్ణాటక, హరియాణ | 25 |
| ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కేరళ | 24 |
| తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ | 23 |
| మహారాష్ట్ర, బిహార్ | 22 |
| మధ్యప్రదేశ్, ఒడిశా | 20 |

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యున్నత లక్ష్యాల్లో ఒకటైన మహిళా సాధికారత ఈ నాలుగున్నరేళ్ల సుపరిపాలనలో కళ్ల ముందు కనిపిస్తోంది. వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేస్తున్నారు. చిన్న వ్యాపారులు, సూక్ష్మ పరిశ్రమలకు కేంద్రం అందించే పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకుని, కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవడంలోనూ రాష్ట్ర మహిళలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. రాష్ట్రంలోని పీఎం స్వనిధి రుణ గ్రహీతల్లో 74 శాతం మహిళలే. పురుషులు 26 శాతం ఉన్నారు. జాతీయ స్థాయిలో 57 శాతం పురుషులు ఈ రుణాలు తీసుకుంటుండగా, మహిళలు 43 శాతమే ఉన్నారు. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ఈ వాస్తవాలను వెల్లడించింది. ఈ రుణాలను చురుగ్గా సద్వినియోగం చేసుకోవడంలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉంది. జాతీయ స్థాయిలో రుణాలను చురుగ్గా ఖర్చు చేస్తున్న లబ్ధిదారులు 22 శాతం మంది కాగా, ఏపీలో వీరు 28 శాతమని ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక తెలిపింది. తొలి స్థానంలో ఉన్న పంజాబ్ రాష్ట్రంలో 32 శాతం మంది చురుగ్గా వ్యయం చేస్తున్నట్లు పేర్కొంది. అతి తక్కువగా పశ్చిమ బెంగాల్‌లో 17 శాతం మంది, జార్ఖండ్‌లో 18 శాతం మందే చురుగ్గా వ్యయం చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

**లక్ష్యానికి మించి రుణాలు**


తొలి దశలో రూ.10 వేల చొప్పున దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి రుణాలివ్వాలని కేంద్రం నిర్ణయించినప్పటికీ, డిమాండ్ భారీగా ఉండడంతో 2023 డిసెంబర్ నాటికి 63 లక్షల మందికి ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం మూడు దశల్లో 88.5 లక్షల రుణాలివ్వాలని నిర్ణయించింది. అదేవిధంగా రాష్ట్రంలో తొలి దశలో 2,30,000 మందికి వర్తింపజేయాలని నిర్ణయించగా, ఇప్పుడు ఈ లక్ష్యాన్ని 3,15,000కు పెంచింది. రెండో దశలో 1,34,200 మందికి, మూడో దశలో 18,900 మందికి రుణాలు లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు మూడు దశల్లో కలిపి రాష్ట్రంలో 4,02,718 దరఖాస్తులకు రూ.528.85 కోట్ల రుణాలు మంజూరు చేశారు. రాష్ట్రంలో ఈ రుణాలను 15 రోజుల్లోగా బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి. దరఖాస్తుదారుల్లో సగటు వయస్సు 42 సంవత్సరాలుగా ఉంది.

### ఇదీ పథకం..

దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని వీధి వ్యాపారులకు సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కోవిడ్ మహమ్మారి సమయంలో 2020 జూన్‌లో 'ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి)'ని ప్రవేశపెట్టింది. వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఈ రుణాలు అందజేస్తారు. ఈ పథకం కింద బ్యాంకుల ద్వారా తొలుత రూ.10 వేలు రుణ సాయం చేస్తారు. ఈ రుణాన్ని సకాలంలో చెల్లించిన వారికి వ్యాపారాభివృద్ధి కోసం రెండో దశలో రూ. 20 వేలు, మూడో దశలో రూ. 50 వేలు మంజూరు చేస్తారు. వీరికి కేంద్రం వడ్డీలో ఏడు శాతం రాయితీ కూడా ఇస్తుంది.

## ఇంకెన్నాళ్లు కుప్పం ప్రజలను మోసం చేస్తావు బాబూ?

- 35 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఎందుకు ఏమీ చేయలేదు
- కుప్పంపై ప్రేమ ఉంటే పరిశ్రమలు ఎందుకు తీసుకురాలేదు
- హంద్రీ–నీవా కాలువ ఎందుకు పూర్తి చేయలేదు?
- ఎమ్మెల్సీ భరత్ ధ్వజం



**కుప్పం(చిత్తూరు జిల్లా):** '35 ఏళ్లుగా కుప్పం ప్రజలను మోసం చేస్తూ వచ్చావు. ఇంకా ఎన్నాళ్లు మోసం చేస్తావు చంద్రబాబు..?'అని ఎమ్మెల్సీ భరత్ ప్రశ్నించారు. ఆయన ఆదివారం కుప్పంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు మూడు రోజుల కుప్పం పర్యటనలో చేసిన ప్రసంగాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కుప్పం నుంచి 35 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా కూడా మళ్లీ తనకు అధికారం ఇస్తే ఐదేళ్లలో అన్నీ పూర్తిచేస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. అసలు 35 ఏళ్లలో చంద్రబాబు కుప్పంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఇప్పటికీ ఇక్కడ మీ పార్టీ నాయకుల పేర్లు తెలియవు. కుప్పంలో ప్రజలకు ఎలాంటి అభివృద్ధి పనులు అవసరమో తెలియదు. ఎవరో రాసిచ్చే స్లిప్పులు పెట్టుకుని చదువుతావు. మీకు కుప్పం ప్రజలపై ప్రేమ ఉంటే ఎందుకు కియా పరిశ్రమ ఇక్కడ ఏర్పాటు చేయలేదు..? ఎందుకు హంద్రీ–నీవా కాలువ పూర్తి చేసి నీళ్లు ఇవ్వలేదు.'అని చంద్రబాబును భరత్ ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పంలో అక్రమంగా గ్రానైట్ వ్యాపారం నిర్వహిస్తున్నారని నిరూపిస్తే నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు అందరం రాజీనామా చేస్తామని, నిరూపించలేకపోతే టీడీపీ నాయకులు, చంద్రబాబు ఏమి చేస్తారో బహిరంగంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలోనే కుప్పంలో భూకబ్జా, ఇసుక దోపిడీ, అక్రమ గ్రానైట్ వ్యాపారం జోరుగా సాగాయని, ఆధారాలతో తాము నిరూపిస్తామని చెప్పారు. 'చంద్రబాబు చివరికి జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. ఇంతకీ మీరు టీడీపీ అధ్యక్షులా.. జనసేన కార్యకర్తవా...'అని ప్రశ్నించారు. సీఎం జగన్ డీకేటీ భూములకు సెటిల్‌మెంట్ పట్టాలు ఇచ్చి ప్రజలకు ఎంతో మేలు చేశారని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురుగేష్ పాల్గొన్నారు.

## ఆర్థిక సంఘం నూతన చైర్మన్‌గా అరవింద్ పనగరియా



న్యూఢిల్లీ: నీతీ ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియాను 16వ ఆర్థిక సంఘం నూతన చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థికశాఖలో సంయుక్త కార్యదర్శిగా ఉన్న రిత్విక్ రంజనం పాండేను ఆర్థికసంఘం కార్యదర్శిగా నియమించారు. పనగరియా గతంలో కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా సేవలందించారు. నూతన ఆర్థిక సంఘం 2026–27 నుంచి 2030–31 కాలానికి సంబంధించిన ఐదేళ్ల నివేదికను 2025 అక్టోబర్ 31వ తేదీకల్లా రాష్ట్రపతికి నివేదించనుంది. 16వ ఆర్థిక సంఘం ఏర్పాటు, విధి విధానాలు, కార్యచరణను నవంబర్ నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రిమండలి ఆమోదించింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల పంపకం, రెవిన్యూ వాటా తదితరాలపై ఆర్థిక సంఘం సూచనలు, సలహాలు ఇవ్వనుంది. విపత్తు నిర్వహణ చట్టం,2005 కింద మంజూరైన నిధులు కేంద్ర, రాష్ట్రాల్లో ఏ మేరకు సద్వినియోగం అవుతున్నాయనే అంశాలపై సంఘం సమీక్ష చేపట్టనుంది. 14వ ఆర్థిక సంఘం సలహా మాదిరే 2021–22 నుంచి 2025–26 ఐదేళ్లకాలానికి కేంద్రం పన్ను రాబడుల్లో 41 శాతం వాటా రాష్ట్రాలకు దక్కాలని ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం సిఫార్సుచేయడం తెల్సిందే. ఫైనాన్స్ కమిషన్ కేంద్ర,రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై సూచనలు ఇచ్చే రాజ్యాంగబద్ధ సంస్థ.

## రక్షణ రంగ స్వావలంబనే ఏకైక లక్ష్యం: రాజ్‌నాథ్

**తేజ్‌పూర్(అస్సాం):** రక్షణలో స్వావలంబన సాధన కోసమే స్వదేశీ రక్షణరంగాన్ని బలోపేతం చేస్తున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పష్టంచేశారు. అస్సాంలో తేజ్‌పూర్ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న సందర్భంగా రాజ్‌నాథ్ ప్రసంగించారు. '' భారత్‌ను వ్యూహాత్మక ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే రక్షణరంగంలో స్వావలంబన అవసరం. అందుకే దేశీయ రక్షణరంగాన్ని బలోపేతం చేస్తున్నాం. ఇందులోభాగంగా రక్షణ ఉత్పత్తుల దిగుమతులు తగ్గించుకుంటున్నాం. ఎగుమతులను నెమ్మదిగా పెంచుతున్నాం. దశాబ్దాలుగా దిగుమతి చేసుకుంటున్న 509 రకాల రక్షణ రంగ ఉత్పత్తులను ఇకపై దేశీయంగానే తయారు చేయాలని నిర్ణయించి వాటి దిగుమతులను నిషేధించాం. త్వరలో మరో 4,666 రకాల రక్షణ విడిభాగాలనూ దేశీయంగానే తయారుచేయాలని ప్రతిపాదించాం. ఇది కూడా త్వరలోనే ఆచరణలోకి తెస్తాం. తొలిసారిగా స్వదేశీ రక్షణ తయారీ రంగ పరిశ్రమ రూ.1లక్ష కోట్ల మార్క్‌ను దాటింది. 2016–17 కాలంలో రూ.1,521 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఇప్పుడు 10 రెట్లు పెరిగి రూ.15,920 కోట్లు దాటాయి'' అని రాజ్‌నాథ్ చెప్పారు. దేశీయ రక్షణ రంగంలో ప్రధాని మోదీ కొత్త ఒరవడి తెచ్చారు'' అన్నారు.



హ్యాపీ న్యూఇయర్

ఆగ్రాలో తాజ్‌మహల్ సమీపంలో కొత్త సంవత్సర వేడుకలు చేసుకుంటున్న పర్యాటకులు. ప్రపంచమంతటా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆస్ట్రేలియా మొదలుకుని అమెరికా దాకా అన్ని దేశాల్లోనూ జోష్ నింపాయి.

## 24 గంటల్లో 16 న్యూ ఇయర్స్

### ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములకు అద్భుత అవకాశం

కేవలం 24 గంటల వ్యవధిలో 16 సార్లు కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టడం సాధ్యమేనా? భూమిపై ఉన్న మనకు సాధ్యం కాకపోవచ్చు గానీ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములకు ముమ్మాటికీ సాధ్యమే! వారు ఒక్కరోజులో 16 సార్లు నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తారు. వారు ప్రయాణిస్తున్న అంతరిక్ష కేంద్రం భూమి చుట్టూ గంటకు 28,000 కిలోమీటర్ల వేగంతో కక్ష్యలో తిరుగుతుండడం వల్లే ఇది సాధ్యమవుతోంది. అంటే ప్రతి 90 నిమిషాలకు ఒకసారి భూమిని చుట్టేస్తారు. వేర్వేరు టైమ్‌జోన్లలో వేగంగా ప్రయాణిస్తారు. మనకు ఒకరోజులో ఒకటే సూర్యోదయం, ఒకటే సూర్యాస్తమయం ఉంటే వ్యోమగాములు మాత్రం 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమయాలు చూస్తారు. మనకు 12 గంటలు పగలు, 12 గంటలు రాత్రి ఉంటే, వ్యోమగాములకు 45 నిమిషాలు పగలు, 45 నిమిషాలు రాత్రి ఉంటాయి. ఈ చక్రం నిరంతరాయంగా తిరుగుతూనే ఉంటుంది. మరోమాట.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూగోళం స్పష్టంగా కనిపిస్తుంది. భూమిపై విద్యుత్ వెలుగులను వ్యోమగాములు వీక్షిస్తుంటారు. న్యూ ఇయర్ సందర్భంగా 24 గంటల్లో 16 సార్లు వారు ఈ వేడుకలను తిలకిస్తారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

## దేశ ప్రజలకు రాష్ట్రపతి కొత్త ఏడాది శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సమసమాజ స్థాపనకు, దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధించేందుకు పౌరులంతా ప్రతిజ్ఞచేయాలని ఆమె పిలుపునిచ్చారు. కొత్త ఆశలు, ఆకాంక్షల సాధన కోసం సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందడుగువేయాలని ఆమె అభిలషించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఆదివారం ఒక ప్రకటన విడుదలచేసింది. '' కొత్త ఏడాదిలో దేశ పౌరులందరికీ సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వాలు దక్కాలి. దేశ పురోగతికి మనం దరం పాటుపడదాం. అభివృద్ధి భారత్ కోసం కొత్త తీర్మానాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. నూతన సంవత్సరం సందర్భంగా దేశ, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులందరికీ నా శుభాకాంక్షలు'' అని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు.

## ప్రధానిలో నిర్దయ చూస్తే బాధేస్తోంది: రాహుల్

**న్యూఢిల్లీ:** మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఉదంతంలో ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం తీరుకు నిరసనగా నిరసనగా ఖేల్ రత్న, అర్జున అవార్డులను రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఢిల్లీలో రోడ్డుపై వదిలేయడం తెలిసిందే. ఆ వీడియోను రాహుల్ ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రధానిని వైఖరిని ఎండగట్టారు. ''భారతదేశంలోని ప్రతి అమ్మాయి ఆత్మాభిమానానికి అత్యంత విలువ ఇస్తుంది. అవార్డులు, పురస్కారాలన్నీ ఆ తర్వాతే. ఇలాంటి ధైర్యశాలుల కంటే 'బాహుబలి' వంటి పరపతి గల వ్యక్తుల నుంచి పొందే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయా?'' అని మోదీని ప్రశ్నించారు. ''ప్రధాని అంటే దేశ రక్షకుడు. ఇంతటి తీవ్రమైన అంశంలో ఇంత నిర్దయగా వ్యవహరించడం చాలా బాధేస్తోంది'' అన్నారు.

## ముంబై పోలీసుల్ని పరుగులు పెట్టించిన మానసిక రోగి

**ముంబై:** ముంబైలో బాంబు పేలుడు జరగబోతోందంటూ మహారాష్ట్ర పోలీస్ కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫోన్ కాల్ కలకలం రేపింది. ఆ కాల్ చేసిన వ్యక్తి మానసిక రోగి అని తేలడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. నూతన సంవత్సరం రోజున ముంబైలో బాంబుపేలుళ్లు జరగబోతున్నాయని శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఫోన్ చేయడం తెల్సిందే. ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నంబర్ 112కు ఫోన్ రావడంతో ముంబై పోలీసులు అప్రమత్తమై సామూహిక, బహిరంగ ప్రదేశాల్లో ముమ్మర తనిఖీలు చేశారు. ఫోన్ వచ్చిన మొబైల్ ఫోన్ లొకేషన్ కనిపెట్టడంతో త్వరగా అతడి జాడ పట్టుకోగలిగారు. ఫోన్ చేసిన వ్యక్తిని అమరావతిలో నివసించే 32 ఏళ్ల ఒక మానసిక రోగిగా గుర్తించారు. దీంతో అతడిని అరెస్ట్‌చేయలేదు.

# ఆత్మనిర్భర్ వికసిత్ స్ఫూర్తి.. 2024లోనూ కొనసాగాలి

## మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ 'ఫిట్ ఇండియా' లక్ష్యం కావాలని పిలుపు

**న్యూఢిల్లీ:** ''దేశ ప్రజల్లో వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి రగిలింది. నూతన సంవత్సరంలోనూ ఇదే స్ఫూర్తిని, వేగాన్ని కొనసాగించాలి'' అని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో ప్రతి ప్రాంతం ఆత్మవిశ్వాసంతో నిండిందన్నారు. ఆదివారం 108వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'ఫిట్ ఇండియా' మన లక్ష్యం కావాలని, ఇందుకోసం భౌతిక, మానసిక ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు వాసుదేవ్, భారత మహిళా క్రికెట్ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, చెస్ క్రీడాకారుడు విశ్వనాథన్ ఆనంద్, బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొని ఫిట్‌నెస్ సలహాలిచ్చారు. దేశం ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆవిష్కరణలు జరగకపోతే అభివృద్ధి నిలిచిపోతుందని అన్నారు. భారత్ 'ఇన్నోవేషన్ హబ్'గా మారిందని, అభివృద్ధి పరుగును ఆపబోమనే సత్యాన్ని చాటిందని అన్నారు. నూతన ఆవిష్కరణల్లో 2015లో 81వ స్థానం నుంచి దేశమిప్పుడు 40వ స్థానానికి చేరిందని తెలిపారు. దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

### సృజనాత్మకతను పంచుకోండి

''2023లో మన దేశం ఎన్నో ప్రత్యేక ఘనతలు సాధించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందింది. అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పట్ల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. వారి మనోభావాలను విభిన్న రీతుల్లో తెలియజేస్తున్నారు. గత కొన్ని రోజులుగా శ్రీరాముడిపై, అయోధ్యపై కొత్తకొత్త పాటలు, భజనలు రచించి స్వరపరుస్తున్నారు. చాలామంది కొత్త గేయాలు, పద్యాలు రచిస్తున్నారు. అనుభవజ్ఞులైన కళాకారులతోపాటు యువ కళాకారులు సైతం శ్రీరాముడిపై, అయోధ్యలో రామమందిర నిర్మాణంపై పాటలు, భజనలు రాస్తున్నారు. చక్కగా ఆలపిస్తున్నారు. కొన్నింటిని నా సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేశారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో కళాకారులు భాగస్వాములవుతుండడం హర్షణీయం. 'శ్రీరామ్‌భజన్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో మీ సృజనాత్మకతను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయాలని కోరుతున్నా. ఈ పాటలు, భజనాలన్నీ కలిపి ఒక భావోద్వేగ ప్రవాహంగా, ప్రార్థనగా మారుతాయి. శ్రీరాముడి బోధించిన నీతి, న్యాయం వంటి సూత్రాలతో ప్రజలు మమేకం అయ్యేందుకు తోడ్పడుతాయి. తెలుగు పాట 'నాటు నాటు'కు 2023లో ఆస్కార్ అవార్డు లభించడం దేశ ప్రజలకు ఆనందాన్నిచ్చింది. అలాగే 'ద ఎలిఫెంట్ విస్పరర్స్' అనే తమిళ డాక్యుమెంటరీకి కూడా ఆస్కార్ లభించింది. వీటిద్వారా భారతదేశ సృజనను, పర్యావరణంతో మనకున్న అనుబంధాన్ని ప్రపంచం గుర్తించింది.''

### ఎన్నెన్నో ఘనతలు

'భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. దీనిపై ప్రజలు లేఖలు రాసి ఆనందం పంచుకున్నారు. జీ20 సదస్సు విజయవంతం కావడంపైనా వారు లేఖలు రాశారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతంపై నాకిప్పటికీ సందేశాలు అందుతున్నాయి. దీపావళి సందర్భంగా దేశీయ ఉత్పత్తులు కొని ఉపయోగించడం ద్వారా మన శక్తిని నిరూపించాం. 2023లో మన క్రీడాకారులు సాధించిన విజయాలు దేశం గర్వపడేలా చేశాయి. మన అథ్లెట్లు అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. ఆసియా క్రీడల్లో 107, పారా గేమ్స్‌లో 111 పతకాలు సొంతం చేసుకున్నారు. వన్డే క్రికెట్ ప్రపంచకప్‌లో భారత జట్టు అందరి మనసులు దోచేలా ప్రతిభ చూపింది. అండర్–19 టీ20 ప్రపంచకప్‌లో మహిళల జట్టు సాధించిన విజయం ప్రేరణగా నిలుస్తుంది. 2024లో జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు భారత క్రీడాకారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, మేరీ మాటీ–మేరా దేశ్ వంటి కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజలు భాగస్వాములయ్యారు''.



### ఫిట్టర్ లైఫ్ కావాలి: అక్షయ్ కుమార్

సినిమా తారలను గుడ్డిగా అనుకరించవద్దని ప్రజలకు బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ సూచించారు. సినీ నటులను చూసి 'ఫిల్టర్స్ లైఫ్' ఎంచుకోవద్దని, 'ఫిట్టర్ లైఫ్' గడపాలని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌కి సంబంధించి 'మన్ కీ బాత్'లో ఆయన పలు సూచనలు చేశారు. వాస్తవానికి నటులు తెరపై కనిపించినట్లుగా బయట ఉండరని అన్నారు. తెరపై వారు బాగా కనిపించడానికి వివిధ రకాల ఫిల్టర్లు, స్పెషల్ ఎఫెక్ట్స్ ఉపయోగిస్తారని వెల్లడించారు. నటులను చూసి యువత ఫిట్‌నెట్ కోసం దగ్గరిదారులు ఎంచుకుంటున్నారని, కండల కోసం స్టెరాయిడ్స్ వంటివి వాడుతున్నారని అక్షయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త సంత్సరంలో ఫిట్‌నెస్ సాధించడం ఒక లక్ష్యంగా నిర్దేశించుకోవాలని అక్షయ్ పిలుపునిచ్చారు.



పూర్తిగా కలపతో తయారైన అతి పెద్ద గాలిమర

## అతి పెద్ద కలప గాలిమర!

క్రిస్మస్ పర్వదినం రోజున వెలుగులు విరజిమ్మే క్రిస్మస్ చెట్టు గురించి మనందరికీ తెలుసు. కేవలం ఆ చెట్టు కలపను వాడి ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన గాలి మర (విండ్ టర్బైన్ టవర్)ను తయారు చేశారంటే నమ్మగలరా?. కానీ ఇది నిజంగానే స్వీడన్‌లో ఉంది. గోథన్‌బర్గ్ నగర శివారులో పెనుగాలుల నడుమ కూడా ఠీవిగా నుంచుని విద్యుదుత్పత్తి చేస్తూ 400 ఇళ్లలో వెలుగులు నింపుతోంది! 492 అడుగుల ఎత్తయిన ఈ గాలిమరను పూర్తిగా కలపతోనే నిర్మించడం విశేషం. కలపతో తయారైన అత్యంత ఎత్తయిన విండ్ టర్బైన్ టవర్ ఇదే. క్రిస్మస్ ట్రీగా పరిచితమైన స్ప్రూస్ జాతి చెట్టు కలపను దీని నిర్మాణంలో వాడారు. దాని కలప అతి తేలికైనది, అత్యంత దృఢమైనది. ''విండ్ టర్బైన్ టవర్ల నిర్మాణంలో ఉక్కును వాడతారు. కానీ అత్యంత ఎత్తైన టవర్ల తయారీ, తరలింపు, నిర్వహణ కష్టం. స్టీల్ ముక్కలను చిన్న భాగాలుగా చాలా నట్లతో బిగించాలి. తుప్పు పట్టకుండా చూడాలి. స్టీల్ భాగాల తయారీకి వేల గంటలపాటు ఫర్నేస్‌ను మండించాలి. భారీగా కర్బన ఉద్గారాలు వెలువడతాయి. కానీ చెక్క టవర్ తయారీ చాలా సులువు. తరలింపు సమస్యలుండవు. పర్యావరణహితం కూడా. క్రిస్మస్ ట్రీ తయారీకి చెట్టుపై భాగాన్ని నరకగా వచ్చే కలపనే వాడుతాం. కనుక అటవీ విధ్వంసమన్న మాటే లేదు. ఉక్కుతో పోలిస్తే చెక్కతో అతి తక్కువ శ్రమతో చాలా ఎక్కువ టవర్లను నిర్మించవచ్చు'' అని దీన్ని తయారు చేసిన స్వీడన్ అంకుర సంస్థ మోడ్వియన్ తెలిపింది. ''ఏటా 20,000 ఉక్కు టర్బైన్లను నిర్మిస్తున్నారు. వచ్చే పదేళ్లలో ఏటా 10 శాతమైనా చెక్క టవర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం'' అంటోంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

## ప్రేమతో... జామ్

### స్వయంగా చేసి సన్నిహితులకు పంపిన సోనియా, రాహుల్






**న్యూఢిల్లీ:** ఎప్పుడూ రాజకీయాలతో బిజీబిజీగా గడిపే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కాసేపు గరిటె పట్టారు. తల్లి సోనియాగాంధీతో కలిసి బత్తాయి జామ్ తయారు చేశారు. పెరట్లో పండిన బుల్లి బత్తాయిలతో తయారు చేసిన ఆ జామ్ తనకెంతో ఇష్టమని సోనియా చెప్పారు. ఈ ఆసక్తికర వీడియోను నూతన సంవత్సరం సందర్భంగా రాహుల్ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశారు. ఇద్దరూ కలిసి తోటలోని బత్తాయిలను తెంపుకొచ్చి జామ్ తయారు చేస్తూ తమ ఆహార ఇష్టాయిష్టాలను సరదాగా పంచుకున్నారు. కావాలంటే బీజేపీ వాళ్లకు కూడా జామ్ ఇద్దామని రాహుల్ అంటే, 'మనకే తిరిగిచ్చేస్తా'రని సోనియా బదులిచ్చారు. జామ్ రెసిపీ తన చెల్లెలు ప్రియాంకదని రాహుల్ వెల్లడించారు. తల్లికి ఒకప్పుడు పచ్చళ్లు నచ్చేవి కావని, ఇప్పుడవి ఎంతో ఇష్టమని రాహుల్ అన్నారు. బ్రిటన్‌లో ఉండగా వంట నేర్చుకున్నానన్నారు. తానెప్పుడు విదేశాల నుంచి తిరిగొచ్చినా ముందుగా పప్పన్నం తినాల్సిందేనని సోనియా చెప్పారు. మాటల మధ్యే తయారైన జామ్‌ను ఇద్దరూ కలిసి చిన్న గాజు సీసాల్లో నింపారు. 'ప్రేమతో.. సోనియా, రాహుల్' అని రాసి స్నేహితులు, బంధువులకు పంపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

## మిషిగన్‌లో పేలుడు

**డెట్రాయిట్:** అమెరికాలోని మిషిగన్ రాష్ట్రంలోని ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వెస్ట్ డెట్రాయిట్ దగ్గర్లోని నార్త్‌ఫీల్డ్ టౌన్‌షిప్ సమీప వాష్టునా కౌంటీలో ఈ ఘటన జరిగింది. పేలుడు ధాటికి ఇల్లు మొత్తం తునాతునకలైంది. 14.4 కిలోమీటర్ల దూరం దాకా శబ్దం వినిపించిందని వార్తలొచ్చాయి. అంతటి భారీ పేలుడు ధాటికి ఇంటి శకలాలు కొన్ని చాలా దూరం ఎగసిపడి హైవేపై పడ్డాయి. ఇంటి పునాది మినహా ఏమీ మిగల్లేదని పోలీసులు చెప్పారు.

## ఎక్స్‌పోశాట్ ప్రయోగం నేడే

**సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా):** ఉపగ్రహ ప్రయోగంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి ఇస్రో సిద్ధమైంది. జంట కృష్ణబిలాల గుట్టుమట్లను తేల్చేందుకు ఉద్దేశించిన ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహం(ఎక్స్‌పోశాట్)ను నింగిలోకి మోసుకెళ్లేందుకు 44.4 మీటర్ల ఎత్తయిన పీఎస్ఎల్‌వీ–సీ58 రాకెట్ రెడీగా ఉంది. జనవరి ఒకటో తేదీన ఉదయం 9.10 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్ ప్రయోగకేంద్రం ఇందుకు వేదికకానుంది. అంతరిక్షంలో ఎక్స్‌రే కిరణాల మూలాలు, ఆవిర్భావం గురించి తెల్సుకునేందుకు ప్రయోగిస్తున్న 'ఎక్స్‌పోశాట్' కౌంట్‌డౌన్ ఆదివారం ఉదయం 8.10కి మొదలైందని ఇస్రో ప్రకటించింది. శాటిలైట్‌ను భూమి నుంచి 650 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి తర్వాత 350 కిలోమీటర్ల దిగువ భూకక్ష్యలో ప్రవేశపెడతారు. తర్వాత పీఎస్ఎల్‌వీ ఆర్బిట్ ఎక్స్‌పరమెంటల్ మాడ్యూల్(పోయెమ్–3) సాయంతో అంకుర సంస్థలు, విద్యాసంస్థలు, ఇస్రోవారి మరో 10 చిన్న పేలోడ్లను వేరే కక్ష్యల్లో ప్రవేశపెడతారు. ప్రయోగానికి వాడుతున్న రాకెట్ పీఎస్ఎల్‌వీ–డీఎల్ రకానికి చెందినది. ఇది 260 టన్నుల బరువులను మోసుకెళ్లగలదు.

## సెంట్రల్ గాజాపై భీకర దాడులు.. 35 మంది మృతి

**ఖాన్ యూనిస్:** ఇజ్రాయెల్ సైన్యం సెంట్రల్ గాజాపై మరోసారి విరుచుకుపడింది. ఆదివారం క్షిపణుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో కనీసం 35 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా అధికారులు వెల్లడించారు. గాజాలో హమాస్ మిలిటెంట్లపై యుద్ధం మరికొన్ని నెలలపాటు కొనసాగుతుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రకటించిన మరుసటి రోజే సైన్యం దాడులు ఉధృతం చేయడం గమనార్హం. ఆదివారం ప్రధానంగా ఖాన్ యూనిస్ నగరంపై క్షిపణి దాడులు జరిగాయి. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 21,600 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. 55,000 మందికిపైగా క్షతగాత్రులుగా మారారు. ప్రపంచమంతా నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తుండగా పశ్చిమాసియాలో మాత్రం ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. యెమెన్‌కు చెందిన హౌతీ ఉగ్రవాదులు పశ్చిమ దేశాల నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగుతున్నారు. ఎర్ర సముద్రంలో భారీ కంటైనర్ షిప్‌ను ధ్వంసం చేయడానికి హౌతీ ముష్కరులు ప్రయోగించిన రెండు యాంటీ–షిప్ బాలిస్టిక్ క్షిపణులను మధ్యలోనే కూల్చివేశామని అమెరికా సైన్యం ఆదివారం ప్రకటించింది. కొన్ని గంటల తర్వాత ఇదే నౌకపై దాడి చేయడానికి నాలుగు పడవలు ప్రయత్నించాయని వెల్లడించింది. ఈ దాడిని తాము తిప్పికొట్టామని, తమ ఎదురు కాల్పుల్లో సాయుధ దుండగులు హతమయ్యారని పేర్కొంది.

## తెహ్రీక్ ఏ హురియత్‌పై కేంద్రం నిషేధం

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ అనుకూల వేర్పాటువాద సంస్థ తెహ్రీక్ ఏ హురియత్ (టీఈహెచ్)పై నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ ఆదివారం ప్రకటించింది. సంబంధిత వివరాలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. టీఈహెచ్‌పై ఐదేళ్లపాటు నిషేధం కొనసాగుతుందని చెప్పారు. ఈ సంస్థను అతివాద వేర్పాటువాద నేత, దివంగత సయ్యద్ అలీ షా గీలానీ స్థాపించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదానికి ఊతమిస్తూ, భారత వ్యతిరేక భావజాలాన్ని వ్యాపింపచేస్తున్నందుకుగాను టీఈహెచ్‌పై నిషేధం అమలుచేసినట్లు అమిత్ షా చెప్పారు. '' ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలో ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించబోదు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు/సంస్థలపై కఠిన చర్యలు తప్పనిసరి. చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక)(ఉపా) చట్టం కింద టీఈహెచ్‌ను నిషేధించాం. భారత్ నుంచి జమ్మూకశ్మీర్‌ను ఎలాగైనా విడదీసి అక్కడ ఇస్లామిక్ పాలనను స్థాపించాలని టీఈహెచ్ కుట్రలు పన్నింది'' అని షా పేర్కొన్నారు. టీఈహెచ్‌ను 2004లో గిలానీ స్థాపించారు. అది మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ సారథ్యంలోని ఉదారవాద హురియత్ వర్గంలో కొన్నాళ్లు కొనసాగి తర్వాత విడిపోయింది. అతివాద హురియత్ కాన్ఫెరెన్స్‌లోని చాలా మంది సభ్యులపై భారత వ్యతిరేక పనులు చేసినందుకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అభియోగాలు నమోదుచేసింది.

# 'ఇండియా'లో పొత్తు చిచ్చు!

### బెంగాల్, బిహార్, మహారాష్ట్రల్లో అసంతృప్తులు • ఒంటరిగానే వెళ్తామంటున్న మమత, కేజ్రీవాల్

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ఇతర విపక్షాలతో కలిసి ఇండియా కూటమి ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌కు సీట్ల సర్దుబాటు కత్తిమీద సాములా మారుతోంది. సీట్ల పంపకాల విషయంలో సొంత పార్టీ నేతల నుంచే భిన్నాభిప్రాయాలు ఒకవైపు, భాగస్వామ్య పక్షాలు అధిక సీట్లు డిమాండ్ చేస్తుండటం మరోవైపు తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, బిహార్, జమ్మూ కశ్మీర్లలో సీట్ల పంపకాల అంశం కాంగ్రెస్‌కు పరీక్ష పెడుతోంది...!

### బెంగాల్లో బెంబేలు...

సీట్ల సర్దుబాటుపై ముందు సొంత పార్టీ నేతల నుంచి కాంగ్రెస్ అభిప్రాయ సేకరణ చేస్తోంది. దీనిపై ముకుల్ వాస్నిక్, అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘేల్, సల్మాన్ ఖుర్షీద్, మోహన్ ప్రకాశ్‌లతో ఏర్పాటైన ఐదుగురు సభ్యుల ఏఐసీసీ బృందం రాష్ట్రాలవారీగా నేతలతో భేటీ అవుతోంది. ముఖ్యంగా 10 రాష్ట్రాల్లో కూటమి పక్షాలతో సీట్ల పంపకాలపై వారి అభిప్రాయాలు స్వీకరిస్తోంది. పశ్చిమబెంగాల్లో 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా కాంగ్రెస్‌కు రెండే ఎంపీ సీట్లిస్తామని అధికార తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటికే తేల్చిచెప్పింది. మిగతా 40 చోట్ల తామే పోటీ చేస్తామంటోంది. ఈ మాత్రానికి తృణమూల్‌తో పొత్తెందుకని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. వామపక్షాలతో పొత్తు పెట్టుకొని ఎక్కువ సీట్లలో కాంగ్రెసే పోటీ చేయాలంటున్నారు. అసలు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకుండా రాష్ట్రంలో అన్ని సీట్లలోనూ తామే పోటీ చేయాలని తృణమూల్ అధినేత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భావిస్తున్నట్టు సమాచారం. ఢిల్లీలో ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌దీ ఇదే అభిప్రాయమని కూడా చెబుతున్నారు!

### బిహార్లో పీటముడి!

బిహార్‌లోని 40 లోక్‌సభ స్థానాల్లో 2019లో ఆర్జేడీ సహా చిన్నా చితక పార్టీలతో కాంగ్రెస్ జత కట్టి పోటీ చేసింది. ఈసారి జేడీ(యూ) కూడా జత కూడుతుండటంతో సమీకరణాలు పూర్తిగా మారుతున్నాయి. 2019లో ఆర్జేడీ 20, కాంగ్రెస్ 9, ఆర్ఎల్ఎస్‌పీ 5, హిందుస్తానీ అవామ్ మోర్చా (హమ్), వీఐపీ చెరో మూడు చోట్ల పోటీ చేశాయి. కాంగ్రెస్ కేవలం ఒక సీటు గెలవగా, అప్పట్లో బీజేపీతో పొత్తున్న జేడీ(యూ) 16 సీట్లు నెగ్గింది! బీజేపీ 17, లోక్ జనశక్తి పార్టీ 6 సీట్లు గెలిచాయి. ఈసారి కాంగ్రెస్‌కు భాగంగా కాంగ్రెస్‌కు 6 సీట్లే ఇస్తామని జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్ అంటుండటం పార్టీ పెద్దలకు మింగుడు పడటం లేదు! జేడీ(యూ) 23, ఆర్జేడీ 9 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నాయి.

\- సాక్షి, న్యూఢిల్లీ



### మహారాష్ట్రలో ఐదు సీట్లే!

48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్రలోనూ శివసేన (ఉద్ధవ్) పార్టీ ఏకంగా 23, మరో మిత్రపక్షం ఎన్సీపీ 20 సీట్లు కోరుతున్నాయి. అదే జరిగితే కాంగ్రెస్‌కు దక్కేవి ఐదే సీట్లు! ఇది ఆ మూడు పార్టీలతో కూడిన ఎంవీఏ కూటమిలో చిచ్చు రాజేస్తోంది. ఇక ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీతో పొత్తు మాటెత్తితేనే స్థానిక కాంగ్రెస్ భగ్గుమంటున్నారు. రాష్ట్ర స్థాయిలో ఆప్‌తో పోరాడుతున్న తమకు పొత్తుల పేరిట అన్యాయం చేయొద్దంటున్నారు. కశ్మీర్‌లో కూడా మెజార్టీ సీట్లలో కాంగ్రెసే పోటీ చేయాలని, నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఎక్కువ సీట్లు వద్దని అక్కడి నేతలంటున్నారు. జనవరి మూడో వారానికల్లా సీట్ల సర్దుబాటును పూర్తి చేయాలని భావిస్తున్న కాంగ్రెస్‌ను ఈ సమస్యలు చీకాకు పరుస్తున్నాయి.

## మరిన్ని శాటిలైట్లు, అణ్వస్త్రాలు: కిమ్



**సియోల్(దక్షిణ కొరియా):** కొరియా ద్వీపకల్పంలో అమెరికా, దక్షిణాకొరియా యుద్ధ వాతావరణాన్ని సృష్టించాయని ఉత్తరకొరియా నియంత కిమ్ జాంగ్ మండిపడ్డారు. బదులుగా తామూ ఆయుధ సంపత్తిని పెంచుకుంటామని ప్రకటించారు. కొత్త ఏడాదిలో అదనంగా మూడు నిఘా ఉపగ్రహాల ప్రయోగాలు చేపడతామని ప్రకటించారు. అలాగే మరిన్ని అణ్వస్త్రాలనూ తయారు చేస్తామన్నారు. ఉత్తర కొరియా అధికారిక కేసీఎన్ఏ వార్తాసంస్థ ఈ మేరకు వెల్లడించింది. ట్రంప్ హయాంలో అమెరికాతో చర్చలు విఫలమయ్యాక అగ్రరాజ్యం నుంచి ఆక్రమణ, దాడి ముప్పు పొంచి ఉందన్న అనుమానంతో కిమ్ ఆయుధ సంపత్తి విస్తరణకు తెర తీశారు. ''అమెరికా, దక్షిణకొరియా కవ్వింపు చర్యలు కొరియా ద్వీపకల్పాన్ని అణుయుద్ధం అంచుకు తీసుకెళ్లాయి. వాటి మెరుపుదాడులను తట్టుకుని నిలబడాలంటే మా సాయుధ, శక్తి సామర్థ్యాలను మరింత పటిష్టం చేసుకోవడం అత్యవసరం'' అన్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం : 1 : జనవరి : 2024



## మదురై విమానాశ్రయంలో రూ.97 లక్షల బంగారం సీజ్

అన్నానగర్: మదురై విమానాశ్రయంలో ఆదివారం ఉదయం దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి రూ.97 లక్షల విలువైన స్మగ్లింగ్ బంగారం పట్టుబడటంతో కలకలం రేగింది. వివరాలు.. మదురై విమానాశ్రయానికి దుబాయ్ నుంచి ప్రైవేటు ప్యాసింజర్ విమానం ఆదివారం చేరుకుంది. విమానంలో బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్లు విమానాశ్రయ కస్టమ్స్ విభాగానికి సమాచారం అందింది. దీంతో అధికారులు ప్రయాణికులను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లో 1,436 కిలోల బంగారు కడ్డీలు ఉన్నట్లు తేలింది. దీంతో వాటిని అక్కడికక్కడే సీజ్ చేశారు. అక్రమంగా తరలిస్తున్న బంగారం విలువ రూ.97 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### రాష్ట్రేతర సివిల్ సర్వీసెస్ కోటాకు ప్రియా రవిచంద్రన్ ఎంపిక

• కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు

కొరుక్కుపేట: తమిళనాడు అగ్నిమాపక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మహిళా అధికారిణి ప్రియా రవిచంద్రన్ రాష్ట్రేతర ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ కోటాకు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి కావడం విశేషం . 2003 సంవత్సరంలో గ్రూప్ -1 అధికారిగా విధుల్లో చేరి అగ్నిమాపక శాఖలో సమర్థంగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఐఏఎస్‌లుగా గ్రూప్ -1 అధికారులును నియమించడం ఆనవాయితీగా వస్తోంది.

### కొనసాగుతున్న జాలర్ల నిరసన

• మద్దతు తెలిపిన సీమాన్

కొరుక్కుపేట: ఎన్నూరు ఎరువుల కర్మాగారం ముందు మత్స్యకార గ్రామస్తులు ఐదో రోజు నిరసన కొనసాగించారు. ఈ నిరసనకు నామ్ తమిళ్ కచ్చి కో- ఆర్డినేటర్ సీమాన్ మద్దతు తెలిపి పాల్గొన్నారు. ఓ ప్రైవేట్ ఎరువుల కర్మాగారం నుంచి ఆకస్మాత్తుగా అమ్మోనియా గ్యాస్ లీకైంది. దీంతో పెరియకుప్పం , చిన్న కుప్పం సహా 10కి పైగా మత్స్యకార గ్రామాలు గాలిలో ఎక్కువ మొత్తం కలవడంతో కళ్లుతిరగడం, కంటి చూపు సమస్యలకు ప్రభావితం అయ్యారు. వారిని వెంటనే ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందించారు. అమ్మోనియా గ్యాస్ బారినపడి 45 మంది ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరుగురు స్టాన్లీ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఎరువుల ఫ్యాక్టరీని మూసివేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఎరువుల ఫ్యాక్టరీ గేటు వద్ద మత్స్యకారులు ఆందోళనకు దిగారు. ఇది ఐదో రోజుకు చేరుకుంది. ఆదివారం సీమాన్ పాల్గొని మత్స్యకారలకు మద్దతు తెలిపారు. దీంతో అదనపు బందోబస్తులో పోలీసులు నిమగ్నమయ్యారు.

### అవయవదాతకు ఘన నివాళి




దాత మృతదేహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రభుశంకర్

తిరుత్తణి: అవయవాలు దానం చేసిన మహిళ మృతదేహానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే నివాళులర్పించారు. వివరాలు.. తిరుత్తణి యూనియన్ కార్తికేయపురం పంచాయతీలోని నేతాజీనగర్‌కు చెందిన నాగరత్నం(60) చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రిలో అనుమతించి చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. దీంతో ఆమె అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. అనంతరం నాగరత్నం మృతదేహం తిరుత్తణిలోకి ఇంటికి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చిన నేపథ్యంలో మృతదేహానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యే చంద్రన్ పుష్పగుచ్ఛం ఉంచి అధికార లాంఛనాలతో నివాళులర్పించారు.

### భార్య హత్య కేసులో భర్తకి యావజ్జీవం

అన్నానగర్: ధర్మపురిలో భార్యపై అనుమానంతో ముక్కలు ముక్కలుగా నరికి చంపిన భర్తకు యావజ్జీవ శిక్ష కోర్టు విధించింది. వివరాలు..ధర్మపురి జిల్లా అరూర్ తాలూకా ఆలంగుట్ట ప్రాంతానికి చెందిన కవి భారతి (37). ఇతనికి భార్య సెల్వి (35)కి ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. ఈ స్థితిలో కవి భారతికి భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చింది. దీంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. జూన్ 2015న జరిగిన తగాదాలో కవి భారతి, సెల్విని హత్య చేసి ముక్కలు ముక్కలుగా నరికి గోనె సంచిలో కట్టి అడవిలో పడేశాడు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి కవిభారతిని అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా మహిళా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో జరుగుతున్న ఈ కేసులో శనివారం తీర్పు వెలువడింది. నిందితుడు కవిభారతికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా న్యాయమూర్తి విధించారు.

### కెప్టెన్‌కు మదురైలో విగ్రహం



విజయకాంత్ సమాధి వద్ద చిన్నారుల నివాళి

సాక్షి, చెన్నై: దివంగత డీఎండీకే అధినేత కెప్టెన్ విజయకాంత్‌కు మదురైలో నిలువెత్తు విగ్రహం ఏర్పాటుకు పరిశీలిస్తామని మేయర్ ఇంద్రాణి పొన్ వసంత్ తెలిపారు. విజయకాంత్ మదురైలో జన్మించిన విషయం తెలిసిందే. ఆయనకు గౌరవాన్ని కల్పించే విధంగా మదురైలో నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని విరుదునగర్ కాంగ్రెస్ ఎంపీ మాణిక్ ఠాకూర్ కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణికి లేఖ రాశారు. ఈలేఖను అందుకున్న ఆమె పరిశీలిస్తామని తెలిపారు. జిల్లా మంత్రులతో చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విగ్రహం ఏర్పాటుపై దృష్టి పెడుతామన్నారు. ఇదిలా ఉండగా, చెన్నై కోయంబేడులోని విజయకాంత్ సమాధిని సందర్శించేందుకు జనం పోటెత్తుతున్నారు.

పుదుచ్చేరి సముద్ర తీరంలో విద్యుత్ వెలుగులు



భక్తుల కోసం లడ్డూలు సిద్ధం చేస్తున్న సిబ్బంది



# వెల్‌కమ్..




**కోటి ఆశలతో రాష్ట్ర ప్రజలు కొత్త ఏడాదికి.. సరికొత్తగా సిద్ధమయ్యారు. నూతనోత్సాహంతో.. 2024 సంవత్సరానికి ఆదివారం అర్ధరాత్రి ఘన స్వాగతం పలికారు. దేవాలయాల్లో ప్రార్థనలు, హోటళ్లు రిసార్ట్‌లలో పార్టీలు చేసుకుంటూ సందడి చేశారు. బీచ్‌లలో సంబరాలు మిన్నంటాయి. పర్యాటక ప్రాంతాలు కిక్కిరిశాయి. కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, శుభశాంతులు కలగాలని గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తమ నూతన సంవత్సర సందేశంలో ఆకాంక్షించారు.**

- రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటిన నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పర్యాటక ప్రాంతాల్లో జనహోరు
- ప్రజలకు గవర్నర్, సీఎం శుభాకాంక్షలు

సాక్షి, చెన్నై: గత జ్ఞాపకాల్లో భాగమై పోయిన 2023 సంవత్సరానికి గుడ్ బై చెప్పి.. 2024కి ఆహ్వానం పలుకుతూ రాష్ట్రంలో ఆదివారం రాత్రి సంబరాలు మిన్నంటాయి. అర్ధరాత్రి వేళ హ్యాపీ..హ్యాపీగా ప్రజలు సంబరాల్లో మునిగితేలారు. ఆనంద తాండవం చేస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కట్టింగ్‌లతో, బాణసంచా హోరుతో కొత్త సంవత్సరాన్ని గ్రాండ్‌వెల్‌కమ్ చెప్పారు. వివరాలు.. 2023 చివరల్లో చెన్నై, శివారు జిల్లాలను, దక్షిణ తమిళనాడును వరదలు ముంచెత్తి కష్టాల కడలిలోకి నెట్టింది. ఇప్పుడిప్పుడే దాని నుంచి కోలుకుంటున్న ప్రజలు 2024 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. చెన్నై నగరం, శివార్లు, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి వంటి ప్రధాన నగరాల్లోని స్టార్ హోటళ్లు,రిసార్ట్‌లు, ఫామ్ హౌస్‌ల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెన్నైలోని హోటళ్లల్లో అయితే, డీజేల రాక్ మ్యూజిక్స్, మోడల్స్ డ్యాన్స్ అంటూ ప్రత్యేక హంగామాతో వేడుకలు జరిగాయి. హోటళ్లు, రిసార్ట్స్‌లు, గార్డెన్లలో అయితే, రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మ్యూజిక్స్, విందుల పసందు, మద్యం హోరుతో దిమ్మతిరిగేలా కొత్త ఏడాదికి ఆహ్వానం పలికే కార్యక్రమాలు జరిగాయి.

ఇక ప్రధాన హోటళ్లు, భవనాలు, మార్గాలు, వర్తక వాణిజ్య, వినోద కేంద్ర పరిసరాల్లో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ విద్యుత్ దీపకాంతుల్లో దేదీప్యమానంగా మెరిశాయి.

**బీచ్‌ల వైపుగా..**

చెన్నైలోని మెరీనా తీరంతో పాటు ఇతర బీచ్‌లలో ఏటా కొత్త సంవత్సర వేడుకలు మిన్నంటడం పరిపాటి. అయితే, గత రెండేళ్లుగా కరోనా పరిస్థితుల నేపథ్యంలో బీచ్‌ల వైపుగా కొత్త సంవత్సరం వేళ ఎవర్నీ అనుమతించలేదు. అయితే, ఈ ఏడాది బీచ్‌ల వైపుగా అనుమతి దక్కడంతో యువత కేరింతలు కొట్టాయి. దీంతో చెన్నైతో పాటు రాష్ట్రంలోని సముద్ర తీరాలలోని బీచ్‌లలో కొత్త ఆహ్వానం మిన్నంటాయి. వేలంకన్నీ, కన్యాకుమారి బీచ్‌లలో పర్యాటకుల తాకిడి మరింతగా పెరిగింది. అలాగే కొడైకెనాల్, ఊటీ, ఏర్కాడు వంటి పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో నిండింది. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సముద్ర తీరం పండుగ వాతావరణంలో మునిగింది. ఎటు చూసినా సందడే, విద్యుత్ దీపకాంతుల నడుమ, సంగీత హోరులో జనం తడిసి ముద్దయ్యారు. చెన్నైలోని మెరీనా, ఎలియట్స్ బీచ్‌లలో జనం తాకిడి కనిపించింది. ఈ మార్గాలలో రాత్రి 8 గంటల నుంచే వాహన సేవలను నిలుపుదల చేశారు. దీంతో జనం నడుచుకుంటూ బీచ్‌ల వైపు వెళ్లారు. జనం సముద్రంలోకి వెళ్లకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షించారు. ఇక, తమ తమ ఇళ్ల వద్ద, కాలనీ, నగర్‌లు, అపార్ట్‌మెంట్ల పరిసరాలలో పిల్లలు, పెద్దలు, యువతీ, యువకులు కేరింతలు కొడుతూ, అర్ధరాత్రి వేళ బాణసంచాలను హోరెత్తిస్తూ, కేక్ కట్టింగ్‌లు, శుభాకాంక్షలతో ఆనందాన్ని పంచుకున్నారు.

**నిఘా నీడలో..**

ప్రమాద రహితంగా, వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా కొత్త వేడుకలు జరిగే విధంగా పోలీసులు భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. చెన్నై నగరంలో 18 వేల మంది సిబ్బంది భద్రతా విధుల్లో నిమగ్నమయ్యారు. 420 మార్గాల్లో అయితే, పోలీసులు ప్రత్యేక చెక్ పోస్టుల్ని ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీలు చేశారు. రాత్రి 10 గంటలకే అనేక మార్గాల్లో వంతెనలను పోలీసులు మూసివేశారు. మద్యం మత్తులో చిందులేసిన, బైక్ రేసింగ్‌లతో దూసుకెళ్లిన వారి భరతం పట్టే విధంగా ఉరకలు తీశారు. ఇక, టాస్మాక్ మద్యం దుకాణాలు మందు బాబులతో కిక్కిరిశాయి. కాగా, కొత్త సంవత్సరం వేళ సోమవారం వేకువ జాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. చెన్నై టీనగర్‌లోని టీటీడీ సమాచారం కేంద్రం ఆలయ, మాంగాడు, తిరువేర్కాడు, కుండ్రత్తూరులలోని ఆలయాలలో, మైలాపూర్ కపాలీశ్వర ఆలయం, ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయాలలో వేకువ జాము నుంచే భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఆయా ఆలయలు, పరిసరాలు విద్యుత్ దీప కాంతుల నడుమ దేదీప్యమానంగా వెలుగొందాయి. రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల మంది సిబ్బందితో భద్రతా విధులకు డీజీపీ శంకర్ జివ్వాల్ ఆదేశించారు. అన్ని ఆలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు.

### శుభాకాంక్షలు...

కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, సీఎం ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళని స్వామి, మాజీ సీఎం పన్నీరు సెల్వం, ఎండీఎంకే నేత వైగో, కాంగ్రెస్ నేత కేఎస్ అళగిరి, తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, పీఎంకే నేతలు రాందాసు, అన్బుమని రాందాసు, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, దివంగత సీఎం జయలలిత నెచ్చెలి, చిన్నమ్మ శశికళ, ఎస్ ఎంకే నేత శరత్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మదుర క్షణాన అందరం సమగా ముందుకు సాగాలని, రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిద్దామని పిలుపు నిచ్చారు. శాంతి, సామరస్యం, సోదరభావం వికసించాలని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు సరికొత్త నిర్ణయాలతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. సీఎం స్టాలిన్ తన శుభాకాంక్షలలతో అందరికీ అన్నీ అనే లక్ష్యం కొత్త ఏడాదిలో నెరవేరాలని కాంక్షించారు. ఈ కొత్త సంవత్సరంలో సరికొత్త రికార్డులను రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తుందని, ప్రజలకు మరిన్ని కొత్త పథకాలను దరి చేరేస్తుందని ప్రకటించారు. ఇదిలా ఉండగా కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని సీఎం స్టాలిన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు ఎవరూ రావద్దు అని పార్టీ వర్గాలు, ముఖ్యులకు డీఎంకే కార్యాలయం విజ్ఞప్తి చేసింది. వరద సహాయక చర్యలు కొనసాగుతున్న దృష్ట్యా, కొత్త సంవత్సరం ఆహ్వానం సందర్భంగా శుభాకాంక్షలు అందుకునే కార్యక్రమాన్ని సీఎం రద్దు చేసినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్థానిక సలహామండలి చైర్మన్ ఏజే శేఖర్



ముస్తాబైన టీటీడీ శ్రీవారి ఆలయం



మెరీనా తీరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## నిఘా నీడలో తిరుచ్చి

• మోదీ, అమిత్ షా రాక.. రేపు

సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన నేపథ్యంలో తిరుచ్చిని నిఘా నీడలోకి తీసుకొచ్చారు. వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. వివరాలు.. తిరుచ్చి విమానాశ్రయాన్ని రూ. 249 కోట్లతో విస్తరించిన విషయం తెలిసిందే. అలాగే, మరో రూ. 1,200 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారు. వీటిని ప్రారంభోత్సవం, శంకుస్థాపన నిమిత్తం మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ తిరుచ్చికి రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్ర గవర్నర్‌ఆ ర్‌ఎన్ రవి, సీఎం స్టాలిన్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అంతకు ముందు భారతీ దాసన్ వర్సిటీ స్నాతకోత్సవానికి పీఎం హాజరవుతున్నారు. తిరుచ్చి పర్యటన నిమిత్తం మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక విమానంలో ప్రధాని వస్తారు. ఆహ్వాన కార్యక్రమాల అనంతరం 11.45 గంటల వరకు భారతీ దాసన్ వర్సిటీ కార్యాక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరుచ్చి విమానాశ్రయంలో జరిగే కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం లక్ష్యదీవులకు బయలుదేరి వెళ్లనున్నారు. పీఎం, హోం శాఖ మంత్రి, గవర్నర్, సీఎం తదితరులు పాల్గొంటున్న దృష్ట్యా, తిరుచ్చిని నిఘా వలయంలోకి తీసుకొచ్చారు. నగర పరిసరాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహన తనిఖీలు విస్తృతం చేశారు.

## కరోనాతో మహిళ మృతి

తిరుత్తణి: కరోనా మళ్లీ కలకలం రేపుతుంది. కొత్త వేరియంట్ కరోనా వేగంగా విజృంభిస్తున్న క్రమంలో తిరుత్తణిలో శనివారం ఓ మహిళ (43) ప్రాణాలు కోల్పోవడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. 10 రోజుల కిందట జ్వరం, శ్వాస సమస్య రావడంతో బాధితురాలిని స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుండడంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కరోనాగా నిర్ధారించి చికిత్స అందించారు. ఈ క్రమంలో శనివారం ఆమె మృతి చెందారు. తర్వాత ఆమె మృతదేహాన్ని తిరుత్తణికి తీసుకురాగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## దరఖాస్తుతో పాటు ఫొటో ఆధారం

• రూ. 6 వేలు పరిహారం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆదేశాలు

సాక్షి, చెన్నై: వరద బాధితులకు నష్ట పరిహారం చెల్లింపు నిమిత్తం రేషన్ సిబ్బందికి మరో కొత్త పనిని ప్రభుత్వం అప్పగించింది. రూ. 6 వేలు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన నష్టం గురించి వివరాలతో పాటు బాధితుడి ఇంటి ఫొటోలను తీసి పంపించాలనే ఆదేశాలు ఆదివారం జారీ అయ్యాయి. వివరాలు.. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాలలో మిచాంగ్ సృష్టించి వరద విలయం గురించి తెలిసిందే. ఈ బాధితులకు ప్రభుత్వం రూ. 6 వేలు నగదు సాయానికి చర్యలు తీసుకుంది. కుటుంబ రేషన్‌కార్డుల ఆధారంగా ఈ నగదు పంపిణీ జరిగింది. అయితే, ఇతర జిల్లాల్లో రేషన్ కార్డులు కలిగి, చెన్నైలో అద్దెకు ఉంటూ లేదా ఉద్యోగ, వివిధ పనుల రిత్యా నివాసం ఉంటూ నష్టాన్ని ఎదుర్కొన్న వారిని ఆదుకునేందుకు ప్రత్యేక దరఖాస్తులను ప్రభుత్వం అందజేసింది. ఈ దరఖాస్తులను పూర్తిచేసి ఇచ్చిన వారికి పరిశీలన మేరకు రూ. 6 వేలు నగదు ఇవ్వడానికి నిర్ణయించారు. ఈ మేరకు 5 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం వీటి పరిశీలన జరుగుతోంది. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి ఎదురైన నష్టం గురించి, వారి నివాసం ఫొటోలను తీసి తమకు పంపించాలని ఆయా ప్రాంతాలలోని రేషన్ దుకాణాల సిబ్బందికి ప్రభుత్వం నుంచి తాజాగా ఉత్తర్వులు అందాయి.

## భక్తులందరికీ లడ్డూ ప్రసాదం



లడ్డూలు పంపిణీ చేస్తున్న మంత్రి శేఖర్‌బాబు

- మరో ఐదు ఆలయాలకు విస్తరణ
- ప్రారంభించిన మంత్రి శేఖర్ బాబు

సాక్షి, చెన్నై : ప్రధాన ఆలయాలలో భక్తులకు లడ్డూ ప్రసాదాల పంపిణీని మరింతగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆదివారం నుంచి మరో 5 ఆలయాలలో ప్రసాదాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర హిందూ దేవదాయ శాఖ నేతృత్వంలోని ఆలయాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే అనేక ప్రధాన ఆలయాలలో అన్నదాన పథకాలను ప్రారంభించారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీకి ఇటీవల శ్రీకారం చుట్టారు. తాజాగా మరో ఐదు ఆలయాలలో లడ్డూ ప్రసాదం అందించాలని ఆదివారం నిర్ణయించారు. చెన్నైలోని పార్థసారథి స్వామి ఆలయం, తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం, మదురై కళ్లలగర్ ఆలయం, తిరుప్పరగుండ్రం మురుగన్ ఆలయాలలో భక్తులకు ఇక రోజూ లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నారు. చెన్నై నుంచి ఈ పంపిణీ కార్యక్రమాన్ని హిందూ దేవదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు ప్రారంభించారు. భక్తులకు లడ్డూలను అందజేశారు. తిరువణ్ణామలైలో డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, తిరుప్పరగుండ్రంలో ఆలయ అధికారి రమేష్, కళ్లలగర్ ఆలయంలో రామస్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పౌర్ణమి తదితర విశేష పర్వదినాలలో రోజుకు లక్ష మంది భక్తులకు, శుక్ర, శని,ఆదివారాలలో 60 వేల మందికి, మిగిలిన రోజులలో 40 వేల మందికి 30 గ్రాముల బరువు కలిగిన లడ్డూలనుతయారు చేసి అందజేయనున్నారు. ఈ లడ్డూల తయారీకి ఆయా ఆలయాల్లో ప్రత్యేక యంత్రాలను సిద్ధం చేయడం గమనార్హం.

## రైట్.. రైట్!

- కిలాంబాక్కం నుంచి రోడ్డెక్కిన బస్సులు
- ప్రారంభమైన కలైంజ్ఞర్ బస్ టెర్మినల్ సేవలు

సాక్షి, చెన్నై: చెన్నై నగరంలో రెండో సబర్బన్ బస్ టెర్మినల్ కిలాంబాక్కం నుంచి బస్సులు ఆదివారం రోడ్డెక్కాయి. ఈ బస్టాండ్‌ను పూర్తిగా ఉపయోగంలోకి తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి దక్షిణ తమిళనాడు, డెల్టా జిల్లాలు, పశ్చిమ జిల్లాలకు బస్సులు బయలుదేరి వెళ్లాయి. వివరాలు.. చెన్నై కోయంబేడు బస్టాండ్‌కు ప్రత్యామ్నాయంగా చెన్నై శివారులలో సబర్బన్ బస్ టెర్మినల్స్ నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ వైపుగా వెళ్లే బస్సుల కోసం మాధవరంలో ఓ సబర్బన్ టెర్మినల్ ద్వారా సేవలు అందిస్తున్నారు. 88.52 ఎకరాల స్థలంలో రూ.393.74 కోట్లతో రెండవ సబర్బన్ టెర్మినల్‌గా నిర్మించిన కిలాంబాక్కం ను శనివారం సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఇక్కడ ఆదివారం నుంచి బస్సుల సేవలు మొదలయ్యాయి. ఇక్కడి వసతులను చూసేందుకు ఆ పరిసర వాసులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ బస్టాండ్ ఓ పర్యాటక ప్రాంతం అన్నట్టుగా జనం తాకిడి పెరిగింది.



కిలాంబాక్కం బస్టాండ్‌లోని బస్సు సర్వీసులు

**బస్సుల పరుగు..**

ఉదయం నుంచి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఎస్‌ఈటీసీ బస్సులన్నీ ఇక్కడి నుంచే బయలుదేరాయి. కలైంజ్ఞర్ శత జయంతి స్మారక సబర్బన్ బస్ టెర్మినల్ నుంచి తమ తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఉత్సాహం చూపించారు. కోయంబేడు, తాంబరంలో రిజర్వేషన్ చేసుకున్న వారు సైతం కిలాంబాక్కంకు వచ్చి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి నుంచి కన్యాకుమరి, తూత్తుకుడి, రామేశ్వరం, మదురై, తిరుచ్చి, తెన్‌కాశి జిల్లాలకు డెల్టా జిల్లాలలోని తంజావూరు, తిరువారూర్, కుంబకోణం, నాగపట్నం, పట్టుకోట్టై తదితర ప్రాంతాలకు, పశ్చిమ తమిళనాడులోని సేలం, ఈరోడ్, కోయంబత్తూరు, తిరుప్పూర్, కృష్ణగిరి, ధర్మపురి వైపుగా బస్సులు బయలు దేరి వెళ్లాయి. కేరళ రాష్ట్రం ఎర్నాకులం, పంబా వైపుగా వెళ్లే బస్సులు సైతం ఇక్కడి నుంచే రోడ్డెక్కాయి. ఇక్కడి 11 ప్లాట్ ఫాంలను ఎస్‌ఈటీసీ బస్సులకు, మూడ ప్లాట్ ఫాంలను ఆమ్నీ ప్రైవేటు బస్సులకు అప్పగించారు. ప్రయాణికుల భద్రతా పరంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన పోలీసులు, ఇక్కడ మూడు షిఫ్ట్‌లలో 135 మంది సిబ్బందిని విధుల్లో ఉంచారు. అయితే, ఇక్కడ ఏఏ బస్సులు ఏఏ ప్లాట్ ఫాం నుంచి వెళ్తాయో అనే అనౌన్స్‌మెంట్లు, సమాచార కేంద్రం ద్వారా వివరాలను తెలియజేసేందుకు ఇంత వరకు ఏర్పాట్లు చేయక పోవడంతో తొలిరోజు ప్రయాణికులు అవస్థలు పడ్డారు.



వేచి ఉన్న ప్రయాణికులు

## క్లుప్తంగా

### మహిళా కానిస్టేబుల్ బలవన్మరణం



రోజా (ఫైల్)

**తిరువళ్లూరు:** కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ కానిస్టేబుల్ ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్నారు. వివరాలు.. తిరువణ్ణామలై జిల్లాకు చెందిన మహిళ కానిస్టేబుల్ రోజా(35). ప్రస్తుతం తిరువళ్లూరు మహిళ పోలీసు స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈమే జిల్లా ఎస్పీ కార్యాలయంలో డీసీబీ విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజ్‌కుమార్‌ను ప్రేమించి పది సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం వీరికి కొడుకు ముకేష్, కుమార్తె సంయుక్త ఉన్నారు. కాగా శనివారం ఇద్దరు యధావిధిగా విధులకు హాజరయ్యారు. రాత్రి విధులు ముగించుకుని రాజ్‌కుమార్ ఇంటికి వచ్చి తనకు టిఫిన్ చేసి ఇవ్వాలని భార్యను కోరాడు. అయితే తానూ సైతం డ్యూటీ ముగించుకుని ఇప్పుడే ఇంటికి వచ్చానని, అలసటగా ఉండడంతో హోటల్ నుంచి టిఫిన్ తెచ్చివ్వాలని భర్తను కోరింది. ఈ సమయంలో దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఘర్షణలో భార్యపై రాజ్‌కుమార్ చేయి చేసుకోవడంతో మనస్తాపం చెందిన కానిస్టేబుల్ రోజా తన గదికి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గంట తరువాత అనుమానం కలిగి రాజ్‌కుమార్ తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఉరివేలాడుతున్న రోజాను చూసి షాక్‌కు గురై స్థానికుల సహకారంతో కిందకు దింపి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం స్థానికంగా విషాదం నింపింది.

### పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

**తిరువళ్లూరు:** కొడుకుతో ఘర్షణపడిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరువళ్లూరు జిల్లా పెద్దపాళ్యం సమీపంలో జరిగింది. వివరాలు..కొశవన్‌పాళ్యం గ్రామానికి చెందిన చెల్లప్ప భార్య ద్రాక్షాయణి(70) రెండు రోజుల క్రితం కొడుకు కోడలితో చిన్నపాటి ఘర్షణ పడినట్లు తెలుస్తుంది. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపం చెందిన ద్రాక్షాయణి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే బంధువులు 108 ద్వారా తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వచ్చిన క్రమంలో ద్రాక్షాయణి మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కొడుకు పళణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దపాళ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుత్తణిలో వైభవంగా మెట్లోత్సవం

- 365 మెట్లకు పూజలు చేసిన భక్తులు
- కొత్త ఏడాది దర్శనానికి భారీ ఏర్పాట్లు



వెండి రథంపై సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్ల ఊరేగింపు

**తిరుత్తణి:** తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం మెట్లోత్సవ సందడి నెలకొంది. భారీ సంఖ్యలో భక్తులు తిరుత్తణికి తరలివచ్చి మెట్లకు పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు. వివరాలు.. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఏడాదిలో చివరి రోజైన ఆదివారం మెట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. సంవత్సరానికి గుర్తుగా కొండను చేరుకునేందుకు 365 మెట్లు ఉన్నాయి. ఆ మెట్లకు పూజలు చేసి కొండకు చేరుకుని స్వామిని దర్శించుకోవడం మెట్లోత్సవం ప్రత్యేకత. ఈ ఉత్సవం సందర్భంగా కొండ ఆలయ పుష్కరిణీ శరవణ పుష్కరిణీ వద్ద తొలిమెట్టుకు వివిధ పుష్పాలతో సర్వాంగసుందరంగా ఆలంకరించి దీపం ప్రజ్వలన చేసి అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ పూజలతో మెట్లోత్సవాన్ని ఆలయ చైర్మన్ శ్రీధరన్ ప్రారంభించారు. పూజల్లో పాల్గొనేందుకు వీలుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి బజన బృందాలతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్లకు పసుకు కుంకుమ దిద్ది కర్పూర హారతితో పాటు కొబ్బరికాయలు కొట్టి ఒక్కో మెట్టుకు అరుణగిరినాథర్ రచించిన మురుగన్ పాటలను పాడుతూ కొండకు చేరుకున్న భక్తులు క్యూలో వేచి వుండి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 11 గంటలకు కొండ ఆలయంలో వెండి రథంలో వల్లి దేవసేన సమేత ఉత్సవర్లు సుబ్రహ్మణ్య స్వామి కొలువై మాడ వీధుల్లో విహరించి భక్తులకు కటాక్షించారు. మెట్లోత్సవంతో పాటు నూతన సంవత్సరం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు కొండకు చేరుకోవడంతో కొత్త సందడి చోటుచేసుకుంది. కొండ ఆలయం విద్యుద్దీపాలతో పాటు వివిధ పుష్పాలతో అలంకరించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రంతా నిర్విర్యామంగా స్వామి దర్శనం చేసుకోవచ్చని ఆలయ జాయింట్ కమిషనర్ రమణి తెలిపారు. అదే సమయంలో మెట్లోత్సవం సందర్భంగా పట్టణంలోని మండపాలు, చత్రాల్లో భక్తజన బృందాలాపనతో పాటు అన్నదాన సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



మెట్లోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీధరన్



మెట్లకు పసుకు కుంకుమ దిద్ది పూజలు చేస్తున్న భక్తులు



మురుగన్ పాటలు పాడుతూ కొండకు వెళ్తున్న భజన బృందాలు

### ఘనంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్న మహిళలు

**కొరుక్కుపేట:** చెన్నై పెరంబూరులోని డీఆర్‌బీసీసీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో కాపు సేవా సమితి–చెన్నై ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రంగవల్లులు, వంటలు, జానపద గేయాల పోటీలు సందడిగా సాగాయి. సమితి అధ్యక్షులు గూడపాటి జగన్‌మోహన్ రావు స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి పీఆర్ కేశవులు కార్యక్రమ నిర్వాహణ చేపట్టారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన సంక్రాంతి పండుగను తెలిపే జానపద గేయాలను పలువురు శ్రావ్యంగా ఆలపించి శ్రోతలను రంజింపజేశారు. మరికొంతమంది సమితి సభ్యులు భక్తిగీతాలను ఆలపించి భక్తి భావాన్ని చాటుకున్నారు. అతిథులుగా పారిశ్రామికవేత్త ఆకుల ప్రకాష్, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు పాల్గొని సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. ఆయా పోటీలకు న్యాయనిర్ణేతలుగా వసుంధర దేవి , అరుణాశ్రీనాథ్, రమాదేవి వ్యవహరించి విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

## అయోధ్య రామాలయ ఆహ్వాన పత్రికల అందజేత



ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

**తిరువళ్లూరు:** అయోధ్య రాముని ఆలయ మహాకుంభాభిషేకం కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని కోరుతూ బీజేపీ, విశ్వహిందూ పరిషత్, హిందు మున్ననీ నేతలు తిరువళ్లూరు పట్టణంలో ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికను ప్రజలకు అందజేశారు. అయోధ్యలో రామాలయంలో జనవరి 22న మహా కుంభాబిషేకం నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి రాముని అర్చన, పూలు, పసుపు కుంకుమను పెట్టి ఆహ్వానించాలని ప్రధాని సహా ఆలయ నిర్వాహ కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు. దీంతో తిరువళ్లూరు పట్టణలో బీజేపీ ప్రధాన కార్యదర్శి కరుణాకరన్ నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. మండల అధ్యక్షులు సతీష్‌కుమార్, డాక్టర్ సురేష్, మహిళ విభాగం కార్యదర్శి చిత్రదేవి పాల్గొన్నారు.

## ఫ్యాషన్ షీ షోర్ ఆవిష్కరణ



షీ షోర్‌ను ఆవిష్కరిస్తున్న లతా కృష్ణ, విజయ్‌కుమార్

**సాక్షి చెన్నై:** టాప్ ఏంజల్ ఫొటోగ్రఫీకి చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ విజయ్ కుమార్ నేతృత్వంలో ఫ్యాషన్ రంగానికి సంబంధించిన సమగ్ర వివరాలతో 2024 సంవత్సరానికి గాను షీ షోర్( ఫొటో వివరాలు)ను సిద్ధం చేశారు. దీనిని స్థానికంగా ఫ్యాషన్ రంగంలో రెండు దశాబ్దాలకు పైగా రాణిస్తున్న మహిళా పారిశ్రామిక వేత్త లతాకృష్ణ ఆవి ష్కరించారు. మోడలింగ్ రంగం బలోపేతం, మోడల్స్‌ను ప్రోత్సహించే విధంగా ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ విక్కీ కపూర్, సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్టు జెస్సిక పర్యవేక్షణలో 10 రోజులుపాటు చెన్నైకి చెందిన ప్రముఖ అందమైన మోడల్స్‌ను ఎంపిక చేశారు. ఇందులో మృదుల, వర్షిణి, షాలిని, అభినయ రాజ్‌పుత్, డొలీఐశ్వర్య, ప్రియాతోపాటు మొత్తం 11 మంది మోడళ్లతో 12 నెలల ఫ్యాషన్ క్యాలెండర్‌గా ఈ షీ షోర్ రూపుదిద్దుకుంది.

## ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ పోస్టర్ విడుదల



విజయ్ తాజా చిత్ర పోస్టర్

**తమిళసినిమా:** నటుడు విజయ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న గుడ్ న్యూస్ రానే వచ్చేసింది. ఇది వారికి నూతన సంవత్సరం కానుకగా భావించవచ్చు. అసలు విషయం ఏమిటంటే విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏజీఎస్ సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నటి శేషాద్రి చౌదరి నాయకిగా నటిస్తున్న ఇందులో నటి స్నేహ, లయ, నటుడు మైక్ మోహన్, ప్రభుదేవా, జయరామ్, గణేశ్, యోగిబాబు, వైభవ్, ప్రేమ్‌జీ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. దీనికి యువన్‌శంకర్‌రాజా సంగీతాన్ని, సిద్ధార్థ్ ముని ఛాయాగ్రహణం అందిస్తున్నారు. కాగా చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. కాగా తదుపరి షెడ్యూల్ షూటింగ్ కోసం చిత్ర యూనిట్ శ్రీలంకకు బయలుదేరడానికి సిద్ధం అవుతోంది. కాగా విజయ్ 68వ చిత్రంగా ప్రచారంలో ఉన్న ఈ చిత్ర టైటిల్ ఏమిటన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీంతో డిసెంబరు నెల 31న ముఖ్యమైన విషయాన్ని ప్రకటిస్తామని దర్శకుడు వెంకట్‌ప్రభు ఇటీవల వెల్లడించారు. కాగా అదే విధంగా ఆదివారం చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను వెల్లడించారు. ఈ చిత్రానికి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో ఇద్దరు విజయ్‌లు వేర్వేరు గెటప్పుల్లో నిలబడి చేతులు పట్టుకున్న దృశ్యం ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీని ద్వారా విజయ్ ఇందులో ద్విపాత్రాభినయం చేస్తున్నారన్నది సుస్పష్టం అయ్యింది. ఆయన అభిమానులకు ఇది నిజంగా నూతన సంవత్సరం కానుకే అవుతుంది.



నటి రెజీనా

## కోలీవుడ్ టాక్స్

## థ్రిల్లర్‌గా రూట్ నంబర్–17



రూట్ నంబర్ - 17 చిత్రంలో దృశ్యం

**తమిళసినిమా:** చాలా గ్యాప్ తరువాత నటుడు జిత్తన్ రమేశ్ కథనాయకుడిగా నటించిన చిత్రం రూట్ నంబర్ 17. నేనీ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ అమర్ రామచంద్రన్ నిర్మించిన ఈ చిత్రానికి అభిలాష్ జి. దేవన్ దర్శకత్వం వహించారు. ఈయన ఇంతకు ముందు ఇదే సంస్థ నిర్మించిన తాయ్ నిలం అనే చిత్రం 14 అంతర్జాతీయ అవార్డులను గెలుచుకోవడం గమనార్హం. కాగా రూట్ నంబర్ 17 చిత్రంలో నటి అంజు పాండియ నాయకిగా నటించారు. నటుడు హరీశ్ పేరడీ, అరువి మదన్, అమర్ రామచంద్రన్, నిహాల్, అఖిల్ ప్రభాకర్, జనీఫర్, బిందు, కాశీవిశ్వనాథన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం శుక్రవారం తెరపైకి వచ్చి ప్రేక్షకాదరణతో ప్రదర్శింపబడుతోంది. ఇందులో నటుడు జిత్తన్ రమేశ్ ఇంతకు ముందెప్పుడే పోషించనటువంటి విభిన్న పాత్రలో కనిపించారు. ఆయన గెటప్ ,నటన చాలా వైవిధ్యంగా ఉంటాయి. ఒక నిజాయితీ పరుడైన ఇంజనీర్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది, ఎలాంటి కష్టాలను ఎదుర్కొంది, అందుకు కారణం ఎవరు? వంటి పలు ఆసక్తికరమైన అంశాలతో రూపొందిన చిత్రం రూట్ నంబర్ - 17. స్వార్థపరులైన రాజకీయవాదులు, అవినీతిపరులైన అధికారుల కారణంగా ఓ నిజాయితీపరుడైన యువకుడి కుటుంబం ఎలా బాధింపునకు గురైందనే ఇతి వృత్తంతో ఉత్కంఠభరితంగా చిత్రం సాగుతుంది. చిత్ర కథ అధిక భాగం దట్టమైన అడవుల్లో జరుగుతుంది.

## రజనీకాంత్‌కు విలన్‌గా?



విజయ్‌సేతుపతి

**తమిళసినిమా:** నటుడు రజనీకాంత్ ప్రధాన పాత్రను పోషించిన లాల్ సలామ్. విష్ణువిశాల్, విక్రాంత్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. కాగా ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని పొంగల్‌కు విడుదల కానుందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్ర విడుదల వాయిదా పడే అవకాశం ఉందనే టాక్ వైరల్ అవుతోంది. అయితే దీని గురించి అధికారిక ప్రకటన విడుదల కాలేదన్నది గమనార్హం. కాగా ప్రస్తుతం రజనీకాంత్ తన 170వ చిత్రాన్ని జై భీమ్ చిత్రం ఫేమ్ టీజే.జ్ఞానవేల్ దర్శకత్వంలో చేస్తున్నారు. ఇందులో ఆయన మాజీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తదుపరి లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో నటించడానికి ఇప్పటికే రజనీకాంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. సన్ పిక్చర్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రంలో నటుడు శివకార్తికేయన్ ముఖ్య పాత్రలో నటించనున్నారనే ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా తాజాగా ఇందులో విలక్షణ నటుడు విజయ్ సేతుపతి నటించనున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడిగా, ప్రతి నాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎలాంటి పాత్రనైనా పోషిస్తూ తన స్థాయిని జాతీయ స్థాయికి పెంచుకుంటూ పోతున్న ఈయన ఆ మధ్య మాస్టర్ చిత్రంలో విజయ్‌తో ఢీకొట్టారు. ఆ తరువాత విక్రమ్ చిత్రంలో కమలహాసన్‌తో పోటీ పడ్డారు. అంతకు ముందే రజనీకాంత్‌తో పేట చిత్రంలో ప్రతినాయకుడిగా నటించిన విజయ్ సేతుపతి తాజాగా మరోసారి ఆయన 171వ చిత్రంలో ప్రతినాయకుడిగా నటించడానికి రెడీ అవుతున్నట్లు టాక్. దీని గురించి పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

## కామెడీ చిత్రంగా కెట్టవన్ను పేర్ ఎడ్తా నెల్లవండా



చిత్ర ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

**తమిళ సినిమా:** వర్మాలయా సినీ క్రియేషన్స్ పతాకంపై ఫెవిన్స్ పాల్ నిర్మించిన చిత్రం కెట్టవన్ను పేర్ ఎడుత్త నల్లవన్‌డా. ప్రభురామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మహత్ రాఘవేంద్రా, నటి ఐశ్వర్య దత్తా జంటగా నటించారు. యోగిబాబు, సాక్షి అగర్వాల్, మొట్టై రాజేంద్రన్, నిళగల్ రవి, ఆదిత్య కదీర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రంలో ఆదవ్ శశి అనే నవ నటుడు విలన్‌గా నటించారు. ఈ చిత్రానికి ఇనియన్ .జే.హరీష్ ఛాయాగ్రహణం, ధరణ్‌కుమార్ సంగీతాన్ని అందించారు. కాగా ఈ చిత్ర ఆడియో ఇటీవల విడుదలై మంచి స్పందనను తెచ్చుకుంది. ఈ చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఈ తరం యువతను అలరించే పలు ఆసక్తికరమైన సన్నివేశాలు ఇందులో చోటు చేసుకుంటాయని చెప్పారు. ఇందులో నటుడు మహత్ రాఘవేంద్రా నటించడంతో కథకు మరింత బలం చేకూర్చిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ధనవంతుల కుటుంబానికి చెందిన యువతిగా నటి ఐశ్వర్య దత్తా నటించారనీ, మహత్ రాఘవేంద్రకు ఈమెకు మధ్య కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని చెప్పారు. కథను నమ్మి చేసిన చిత్రం ఇదన్నారు. నటుడు యోగిబాబు, టెడీబేర్‌లో సాగే పాట ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తుందని చెప్పారు. చిత్ర షూటింగ్ పూర్తి అయ్యిందని, త్వరలోనే విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. చిత్ర షూటింగ్ ఏప్రిల్‌లో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు సమాచారం.

## అర్జున్‌కు జంటగా రెజీనా



అర్జున్

**తమిళసినిమా:** యాక్షన్ కింగ్ అర్జున్‌కు జంటగా నటి రెజీనా నటిస్తున్నారు. ఏమిటీ అర్జున్ హీరోగా ఏ చిత్రంలో నటిస్తున్నారు ? అని ఆశ్చర్యపోతున్నారా? నిజమే ఆయన హీరోగా నటించి చాలా కాలమే అయ్యింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిపోయారు. ఇటీవల విజయ్ కథానాయకుడిగా నటించిన లియో చిత్రంలో కూడా నెగిటివ్ పాత్రలో నటించారు. తాజాగా అజిత్ హీరోగా నటిస్తున్న విడాముయర్చి చిత్రంలోనూ నటిస్తున్నారు. నటి త్రిష, రెజీనా, ప్రియభవానీ శంకర్, ఆరవ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా నటుడు అజిత్ ఇంతకు ముందు మంగాత్తా చిత్రంలో అజిత్‌కు మిత్రుడిగా ప్రధాన పాత్రలో నటించిన విషయం తెలిసిందే. కాగా తాజాగా విడాముయర్చి చిత్రంలో అజిత్‌కు విలన్‌గా పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఇందులోనే నటి రెజీనా ఆయనకు జంటగా నటిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల హీరోయిన్‌గా అవకాశాలకు దూరమవుతున్న సమయంలో ఈ చిత్రంలో ఆమె పాత్ర ఎలా ఉంటుందన్న ఆసక్తి కలుగుతోంది. ఈచిత్రం షూటింగ్ ఇటీవలే అజర్‌బైజాన్‌లో జరుపుకుంది. ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొంటున్నారు. కాగా నటుడు అజిత్ ఫ్యాషన్‌లో ఫొటోగ్రఫీ ఒకటి అన్న విషయం తెలిసిందే. కాగా విడాముయర్చి చిత్ర షూటింగ్‌లో నటుడు అజిత్, రెజీనా, ఆరవ్‌కు అజిత్ స్పెషల్‌గా ఫొటో షూట్ నిర్వహించి సర్‌ప్రైజ్ చేశారట. అంతే కాకుండా ఆయన అందరికీ నైట్ పార్టీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. మరో విషయం ఏమిటంటే ఈ చిత్రంలో అజిత్ పాత్ర పేరు అర్జున్ అని తెలిసింది. అలా రీల్ అర్జున్(అజిత్) రియల్ నటుడు అర్జున్‌తో ఈ చిత్రంలో తలపడుతున్నారన్న మాట. విడామయర్చి చిత్ర షూటింగ్ ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. తదుపరి సెడ్యూల్‌కు యూనిట్ వర్గాలు రెడీ అవుతున్నారు. మరో రెండు నెలల్లో షూటింగ్‌ను పూర్తి చేసి చిత్రాన్ని అజిత్ పుట్టిన రోజు సందర్భంగా మే 1వ తేదీన తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తాజా సమాచారం. తదుపరి అజిత్ ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో నటించనున్నారని తెలిసింది. ఇది పూర్తిగా కామెడీ జానర్‌లో సాగే కథా చిత్రం అని సమాచారం.



కంగనారనౌత్

## ఇంట్లో కంటే బయటే ప్రశాంతంగా..

**తమిళసినిమా:** ఏదో ఒక సంఘటనతో వార్తల్లో ఉండే బాలీవుడ్ సంచలన నటి కంగనారనౌత్. ఈమె వివాదాలతోనే కడుపు నింపుకుంటారనుకుంటా. అయితే నటిగా మాత్రం ఈమెలో తప్పు పట్టలే. అంతగా అంకిత భావంతో పని చేస్తారు. అంతే ప్రతిభావంతురాలు కూడా. కానీ 2023వ ఏడాది కంగనా రనౌత్‌కు పెద్దగా కలిసి రాలేదనే చెప్పాలి. అన్నీ చేదు అనుభవాలే. ముఖ్యంగా 2023లో ఈమె నటించిన ఒక్క చిత్రం కూడా విజయాన్ని అందుకోలేదు. హిందీలో నటించిన తేజాస్ గానీ,తమిళంలో నటించిన చంద్రముఖ– 2 చిత్రం గానీ పూర్తిగా నిరాశ పరచాయి. అంతకు ముందు భారీ అంచనాల మధ్య విడుదలైన తలైవి చిత్రం అపజయాన్నే మూట కట్టుకుంది. కాగా ప్రస్తుతం ఈమె ఆశలన్నీ ఎమర్జెన్సీ చిత్రంపైనే. ఇందులో కంగనారనౌత్ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రాత్రలో నటించడం విశేషం. ఈనేపథ్యంలో తాజాగా ఈ సంచలన నటి తన ఎక్స్ మీడియాలో ఇంటిలో లేనప్పుడే తాను ప్రశాంతంగా, సంతోషంగానూ ఉంటానని పేర్కొన్నారు. మనం ఈ శరీరానికి నిరంతం సొంతదారులం కాదు అని అన్నారు. ఈ జీవితం కూడా చాలా చిన్నదని విషయం తనకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతోందనే వేదాంతాన్ని వ్యక్తం చేశారు. ఎప్పుడూ ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నించరాదన్నది అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ విషయాన్ని తాను 2023లోనే తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. తాను పలు మైళ్లురాళ్లను దాటి తన కలల ఇంటిని, గెస్ట్ హౌస్, ఫామ్ హౌస్‌లను నిర్మించుకున్నానని, అయినప్పటికీ ఇంటిలో ఉన్నప్పుడు కలగని ప్రశాంతత, ఆనందం బయట ఉన్నప్పుడు కలుగుతుందన్న విషయాన్ని గ్రహించానని చెప్పారు. మీరు వెళ్లే ప్రదేశాలనే ఇంటికి వెళ్తున్నట్లు భావించాలని నటి కంగనారనౌత్ పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం నటుడు మాదవన్‌కు జంటగా ద్విభాషా చిత్రం (హిందీ,తమిళం)లో ఈ అమ్మడు నటిస్తున్నారు.

## క్లుప్తంగా

### ట్రాక్టర్‌లో చిక్కుకుని బాలిక మృతి

**తిరువొత్తియూరు:** తంజావూరు జిల్లా మదుకూర్ సమీపంలో ఉన్న అవిట్టకోటకు చెందిన వారు వీరశేఖర్ భార్య విజయరాణి(31). వీరి కుమార్తె మదిశా(08) 3వ తరగతి చదువుతోంది. మదిశ శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో తన ఇంటి సమీపంలో కొబ్బరితోటలో ఆడుకుంటోంది. అక్కడ మదిశ మామ ఉద్దులు చల్లు యంత్రంతో ట్రాక్టర్‌ను అక్కడికి తీసుకొచ్చాడు. ఆ సమయంలో బాలిక మదిశాను తాగడానికి నీరు తెమ్మన్నాడు. వెంటనే మదిశా నీళ్లు తీసుకొచ్చి ఇచ్చింది. ఆ సమయంలో హఠాత్తుగా మదిశా ధరించి వున్న చున్ని ట్రాక్టర్ రోలర్‌కు చుట్టుకుంది. దీంతో తెలియని మదిశా మామ నీరు తాగి తిరిగి ట్రాక్టర్ కదిలించడంతో ట్రాక్టర్‌లో చిక్కుకుని చిన్నారి సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తూ ఉన్నారు.

### వ్యభిచారం కేసులో ఒకరి అరెస్టు

**తిరువొత్తియూరు:** చెన్నై సమీపం ఆదంబాక్కం బాలకృష్ణ వీధిలో ఉన్న ఒక ఇంటిలో సందేహాస్పదంగా పురుషులు వచ్చి వెళుతున్నారు. దీని గురించి సమాచారం తెలుసుకున్న వ్యభిచార నిరోధక సహాయ కమిషనర్ రాజ్యలక్ష్మి నేతృత్వంలో పోలీసులు ఆ ఇంటిపై రహస్యంగా నిఘా వేశారు. అందులో ఆ ఇంటిలో ఒక మహిళ నుంచి వ్యభిచారం చేయిస్తున్నట్లు తెలిసింది. మహిళా పోలీసులతో ఆ ఇంటిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పని కోసం చెన్నైకి వచ్చిన ఉత్తరాది రాష్ట్రానికి చెందిన మహిళను ఇంటిలో ఉంచి వారు వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. దీని సంబంధించి కేరళ రాష్ట్రం మల్లాపురానికి చెందిన షంషుద్దీన్(55) అనే అతనిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వ్యభిచారంలో పాల్గొంటున్న ఆమెను విడిపించి ప్రభుత్వ మహిళా శరణాలయానికి అప్పగించారు.

### ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

**పాశాల:** పవిత్రంగా అయోధ్య రామమందిరం అక్షింతలు ఇంటింటికీ చేరవేసే ప్రక్రియ పవిత్రంగా చేపట్టాలని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి 5 గ్రాముల అక్షింతలు ఇవ్వాలని, వాటికి ఇంటిలో తయారు చేసిన అక్షింతలు కలిపి వృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. 22 జనవరి రోజున అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని, ప్రతీ ఇంటి వద్ద వివరించాలని సూచించారు. అదే సమయంలో సమీపంలోని ఆలయంలోగాని, టీవీ ద్వారా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. 22న ఇంటిల్లపాది స్నానాలు ముగించుకుని అక్షింతలు నెత్తిపై జల్లుకోవచ్చని, పిల్లలు, చిన్నవారిని దీవించడం, భర్త ఆశీస్సులు, దీవెనలు పొందడం, బీరువాలోని లక్ష్మీ స్థానంలో అక్షింతలు ఉంచుకోవడం, పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇతర శుభకార్యాల్లో ఈ అక్షింతలను వినియోగించవచ్చని తెలిపారు.

### శ్రీకోదండ రామాలయంలో విశేష ఉత్సవాలు

**తిరుపతి కల్చరల్:** శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో ఈ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జనవరి 6, 13, 20, 27వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామలక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ, తిరువీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. 11న అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం చేపడుతారు. రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ జరుగనుంది. 25వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తారు. ఇదే రోజు పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం వేడుకగా చేపడుతారు. సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి అక్కడ సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ, ఆస్థానం నిర్వహిస్తారు.

### వారపు సంతలో భోజన వసతి



అన్నదానం చేస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

**చంద్రగిరి:** వారపు సంతలో వ్యాపారాలు చేసుకునే రైతన్నలకు, వ్యాపారులకు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30గంటల నుంచి 4 గంటల వరకు సుమారు 500 మందికి భోజనం పంపిణీ చేసినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా ప్రతి ఆదివారం సంతలో భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ దూర ప్రాంతాల నుంచి వ్యాపారాలు చేసుకునే వర్తకులు, రైతులు మధ్యాహ్నం ఆకలితో పస్తులుండకూడదనే ఉద్దేశంతో తమ నాయకులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంకల్పించారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, పార్టీ నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, వెంకటయ్య, ఒంటి బలరామిరెడ్డి ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫ్రాన్స్ విమానంలో సాంకేతిక లోపం

- 290 మంది ప్రయాణికులు సురక్షితం



ఎయిర్ ఫ్రాన్స్ విమానం

**కొరుక్కుపేట:** చెన్నై విమానాశ్రయం నుంచి 290 మంది ప్రయాణికులతో ఫ్రాన్స్‌కు వెళ్లాల్సిన విమానంలో సాంకేతికలోపం ఏర్పడింది. సకాలంలో సమస్యను గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. ఆదివారం తెల్లవారుజామున 2.15 గంటలకు చెన్నై మీనంబాక్కం ఇంటర్నేషనల్ టర్మినల్స్ నుంచి ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌కు ఎయిర్ ఫ్రాన్స్ ఎయిర్‌లైన్స్ విమానం బయలుదేరేందుకు సిద్ధమైంది. ఇందులో వెళ్లాల్సిన 276 మంది ప్రయాణికులు అర్ధరాత్రి 12 గంటలకు ముందే చెన్నై విమానాశ్రయానికి చేరుకుని అన్ని తనిఖీలు పూర్తి చేసుకుని విమానం ఎక్కారు. 276 మంది ప్రయాణికులు, 14 మంది విమాన సహాయకులతో మొత్తం 290 మందితో ఫ్రాన్స్‌కు బయలుదేరే సమయంలో టేకాఫ్ చేయడానికి ముందు పైలట్లు విమాన ఇంజిన్‌ను తనిఖీ చేశారు. అందులో సమస్య ఉన్నట్లు గుర్తించి చెన్నై ఎయిర్‌పోర్టు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించడంతో ఆదివారం ఉదయం వెళ్లాల్సిన ఎయిర్ ఫ్రాన్స్ విమానం ఆలస్యంగా బయలుదేరుతుందని అధికారులు ప్రకటించారు. అనంతరం ఇంజన్‌లోపాలను ఇంజనీర్లు వెంటనే సరిచేయలేకపోయారు. దీంతో ప్రయాణికులందరినీ విమానం నుంచి దించేసి సర్వీసు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులందరికీ చెన్నైలోని పలు హోటళ్లలో, లగ్జరీ బస్సుల్లో బస ఏర్పాటు చేశారు . ఈ విమానం సోమవారం ఉదయం చెన్నై నుంచి ఫ్రాన్స్‌కు బయలుదేరుతుందని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు.

## తిరుప్పావై అంతా గురుపరంపర ధ్యానమే



సదస్సులో పాల్గొన్న ఉభయ వేదాంతులతో జెట్ -చెన్నై కార్యవర్గసభ్యులు

- సదస్సులో ఉభయవేదాంతుల వ్యాఖ్య

**కొరుక్కుపేట:** తిరుప్పావై అంతా గురుపరంపర ధ్యానమే అని తిరుప్పావై సదస్సులో పాల్గొన్న ఉభయవేదాంత పండితులు వ్యాఖ్యానించారు. ఈ మేరకు శ్రీశ్రీశ్రీ చిన జీయర్ స్వామి వారి మంగళాశాసనాలతో శ్రీమత్ ఉభయ వేదాంతచార్య పీఠం, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్(జెట్ )-చెన్నై సంయుక్త నిర్వహణలో తిరుప్పావైలో శ్రీ వైష్ణవ లక్షణం అనే అంశంపై ఆదివారం తిరుప్పావై సదస్సు ఘనంగా జరిగింది. దీనికి చెన్నై టి.నగర్‌లోని దురైస్వామి రోడ్డులోని కోట శ్రీనివాసయ్య రామానుజ కూటం వేదికైంది. ముందుగా ఉదయం 9.30 గంటలకు జెట్ -చెన్నై అధ్యక్షులు పి. రవీంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన చినజీయర్ స్వామికి, గోదాదేవికిలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఈ సదస్సులో ఉపన్యాసకులుగా ఉభయ వేదాంతుల డాక్టర్ ఎంఏ వెంకట కృష్ణన్ స్వామి, అక్కరకని శ్రీనిధి స్వామి, కిడాంబి నారాయణన్ స్వామి , వేలుక్కుడి రంగనాథన్ స్వామి, ఎంఏ మధుసూదనన్ స్వామి, తిరుమళిసై ఆల్వార్‌స్వామి, తిరుగోష్టియూర్ కేశవన్ స్వామి( అధ్యాయన భట్టర్ ) పాల్గొని తిరుప్పావులో శ్రీ వైష్ణవ లక్షణంపై సుదీర్ఘంగా ఉపన్యసించారు. తిరుప్పావైను ప్రతీ ఒక్కరూ చదవాలని సూచించారు. తిరుప్పావై అంతా గురుపరంపర ధ్యానమే అని నిత్య దైవ స్మరణలో ఉంటే భగవంతుడు మనలను అన్ని విధాల కాపాడుతారని ఉపదేశించారు. కార్యక్రమంలో భాగంగా రవీంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఏటా తిరుప్పావైలోని ఒక్కో అంశంపై ఉభయవేదాంతుల చేత ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులో భాగంగానే ఈ సదస్సు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భక్తులతో పాటు జెట్-చెన్నై కార్యవర్గ సభ్యులంతా పాల్గొన్నారు.

## రూ.10కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం స్వాధీనం



తహసీల్దారు మదన్ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు

**తిరుత్తణి:** తిరుత్తణిలో ఆక్రమణలకు గురైన రూ.10 కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దారు మదన్ స్వాధీనం చేసుకున్నారు. తిరుత్తణి నూతన బస్టాండు సమీపం జేజే రవినగర్‌లో రూ.10 కోట్లు విలువైన ప్రభుత్వ పోరంబోకు స్థలం రెండు ఎకరాలు ఆక్రమించి కొందరు ఇళ్లు నిర్మాణానికి వీలుగా ప్రహరీ గోడలు నిర్మించుకున్నారు. మరో రాజకీయ ప్రముఖుడు షిర్డీ సాయి బాబా ఆలయం నిర్మాణం చేపడుతున్నాడు. ప్రధాన ప్రాంతంలో భారీ విలువగల పోరంబోకు స్థలం ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని చౌక దుకాణం, పార్కు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని స్థానికులు కలెక్టర్, ఆర్డీఓకు వినిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఆర్డీఓ ఆక్రమణలకు గురైన స్థలంలో సర్వే చేపట్టేందుకు మూడు నెలల కిందట రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకుని ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీ చేశారు.అయితే ఆక్రమణలు తొలగింపునకు ఆక్రమణదారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శనివారం సాయంత్రం ఆర్డీఓ దివ్య, తహసీల్దారు మదన్ సమక్షంలో డీఎస్పీ విఘ్నేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నడుమ ఆక్రమణలు తొలగింపు పనులు చేపట్టారు. అయితే షిర్డీ సాయి మందిరం కూల్చివేతకు నిరసనగా బీజేపీ, హిందు మున్నని శ్రేణులు కూల్చివేతను అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. వారిని పోలీసులు అడ్డుకుని తిప్పి పంపారు. దీంతో ఆక్రమణల తొలగింపు పనులు రాత్రి 8 గంటల వరకు కొనసాగించారు. పూర్తిగా ఆక్రమణలు తొలగించి ప్రభుత్వానికి రిపోర్టు అందజేసి ప్రజలకు అవసరమైన కట్టడాలు నిర్మాణానికి చర్యలు తీసకుంటామని తహసీల్దారు మదన్ తెలిపారు.

## నాలుగు దశాబ్దాలకు
# అపూర్వ కలయిక



నాలుగు దశాబ్దాల తరువాత తమ గురువులతో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**తిరుత్తణి:** నాలుగు దశాబ్దాల తరువాత చదువుకున్న పాఠశాలలో ఏకమైన పూర్వ విద్యార్థులు ఉత్తమ గురువుల నుంచి ఆశీస్సులు పొంది తమ జీవిత విశేషాలు పంచుకున్నారు. తిరుత్తణి యూనియన్ కేజీ.కండ్రిగ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 1983వ విద్యా సంవత్సరంలో తెలుగు, తమిళ మీడియంలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు చదువుకున్న పాఠశాల ఆదివారం వేదికైంది. ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని తమకు విద్య బోధించి, క్రమశిక్షణ నేర్పిన గురువులకు స్వాగతం పలికి వారినుంచి ఆశీస్సులు తీసుకున్నారు. అంతకు ముందు 15వ ఏట విద్యార్థి దశలో విడిపోయి 55వ ఏటలో కలుసుకోవడంతో వారు భావోద్వేగానికి లోనయ్యారు. అలాగే ఉన్నత విద్య, ఉద్యోగం, కుటుంబం, జీవిత విశేషాలను పంచుకున్నారు. విద్య, క్రమశిక్షణ నేర్పిన ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం గురువులతోపాటు మిత్రులు కలిసి భోజనం చేసి ముచ్చటించారు. పూర్వ విద్యార్థుల ద్వారా పాఠశాలకు కనీస సదుపాయాల కోసం తమవంతు సాయం చేసేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను పాఠశాల హెచ్‌ఎం దామోదరన్ స్వాగతించగా పూర్వ విద్యార్థులు నరసింహన్, కల్నల్ సెల్వం, దామోదరన్, లక్ష్మీపతి, హరిబాబు, కుమార్ తదితరులు అపూర్వ కలయిక సమావేశానికి ఏర్పాట్లు చేశారు.

### గోతిలో పడ్డ కారు



గొయ్యిలో చిక్కుకున్న కారు

**తిరువొత్తియూరు:** చెన్నై కొరటూరు ఈస్ట్ అవెన్యూ రోడ్డులో శనివారం ఉదయం భాస్కర్ అనే అతను కారును నడుపుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో రోడ్డుపై నడిరోడ్డులో హఠాత్తుగా ఏర్పడిన పెద్ద గొయ్యిలో కారు చిక్కుకుంది. దీంతో భాస్కర్ కారు నుంచి కిందకు దిగి వెనుక వస్తున్న వాహనాలను హెచ్చరించాడు. దీంతో తక్కిన వాహనాలును నిలిపి వేశారు. సుమారు 6 అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల లోతుకు ఏర్పడింది. ఈ గుంతలో కారు ముందు చక్రం చిక్కుకుంది. దీంతో కారు పూర్తిగా గొయ్యిలోకి దిగిపోయింది. దీని గురించి సమాచారం అందుకున్న అంబత్తూరు ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతాన్ని చేరుకుని విచారణ చేసి నిలిపి వేసిన వాహనాలను మరో మార్గంలో తిప్పి పంపించారు. తరువాత గొయ్యిలో చిక్కుకున్న కారును బయటకు క్రేన్ మూలంగా తీశారు. దీని తరువాత సంబంధిత అధికారులు వచ్చి రోడ్డుపై గొయ్యి ఎలా ఏర్పడింది అని తనిఖీ చేస్తున్నారు.

### నలుగురు రైల్వే కార్మికులకు విద్యుత్ షాక్

**వేలూరు:** తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీపంలోని రైలు పట్టాలపై మరమ్మతు పనులు చేస్తున్న నలుగురు కార్మికులకు విద్యుత్ షాక్ తగలడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నందలాల్ లాగూరి, సుజీ జోక్, శ్రీరామ్ లాగూరి, తురంద్ నలుగురు కలిసి రైల్వేలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. జోలార్‌పేటలో ఉంటూ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి-కోదండంపట్టి మధ్యలో రైల్వే పట్టాల వద్ద ఉన్న అధిక విద్యుత్ శక్తి కలిగిన ఓహెచ్ విద్యుత్ వైర్లు మరమ్మతు పనులు చేస్తున్నారు. ఆ సమయంలో ఆకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయారు. వీటిని గమనించిన సహ కార్మికులు వెంటనే వాణియంబాడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారు వాణియంబాడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీటిపై జోలార్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**తిరుచానూరు(చంద్రగిరి):** వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగిణి బృందం ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా గణనాథాయ, భావములోన, మొక్కజొన్న తోటలో, ఉరుముల రమ్ముంటివే, ధన ధన ధన ధనారే, నీలినీలి కళ్లవాడే, గాజులు తెచ్చి మామయ్య, నాన్న నాన్న నాన్న వంటి పాటలతో పాటు సినీ పాటలకు కళాకారులు దీపిక, శ్రావణి, మంజూష, సాయికీర్తన, గీతిక, లహరి, చాతుర్య, హేమన్య, స్వప్న, రాజగోపాల్, గగన, శాంతి, భరత్ కుమార్, హరి, రేణుక, గోపి, దాము, రాజేష్, మస్తాన్, లక్ష్మీ, శ్రీనాథ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

### నేడు గూడూరుకు 'అమృత్ భారత్'

**గూడూరు రూరల్ :** అమృత్ భారత్ రైలు సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు గూడూరు రైల్వే స్టేషన్‌కు రానున్నట్లు స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమృత్ భారత్ రైలు ప్రారంభించిందన్నారు. మాల్దా నుంచి బెంగళూరుకు వెళుతున్న ఈ రైలుకు గూడూరులో స్వాగతం పలికి, సాదరంగా సాగనంపనున్నట్లు వివరించారు.

## అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



సంక్షేమ పథకాలను అందజేస్తున్న మంత్రి వేలు

**వేలూరు:** జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, పనులను పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఏవా వేలు అన్నారు. తిరువణ్ణామలై జిల్లాలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు నత్త నడకన జరుగుతున్నాయని వీటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అదే విధంగా జనవరి 7, 8వ తేదీల్లో ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడు చెన్నైలో జరగనుందని ఇందుకోసం జిల్లాలోని పెట్టుబడిదారులను ఎంపిక చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ఈ పథకానికి అవసరమైన లబ్ధిదారులను అధికారులు విచారణ జరిపి ఎంపిక చేయాలన్నారు. మన జిల్లాలో చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన రుణాలు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. ఇప్పటికే జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎంత మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు, ఎంత మందిని ఇప్పటి వరకు ఎంపిక చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రస్తుతం వచ్చిన నిధులు, ఎంత ఖర్చు చేశారు, పనులు ఎంత వరకు పూర్తి చేశారనే విషయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖల ద్వారా సంక్షేమ పథకాలను అందజేశారు. ఈ సమావేశంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, కలెక్టర్ మురుగేష్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇద్దరు ప్లస్-2 విద్యార్థుల మృతి

**అన్నానగర్:** చోళవందాన్ సమీపంలోని వైగై నది ఆనకట్టలో స్నానం చేస్తుండగా ప్లస్-2 విద్యార్థులు ఇద్దరు నీటిలో మునిగి చనిపోయారు. మదురై జిల్లాలోని చోళవందాన్ సమీపంలోని కురువితుర పంచాయతీ పరిధిలోని సిద్ధాంతిపురం వద్ద వైగై నదిపై చిన్న ఆనకట్ట ఉంది. ఈ ఆనకట్టలో భద్రతా కారణాల దృష్ట్యా స్నానానికి ఎవరినీ అనుమతించడం లేదు. మదురై పెన్నాగరం కార్తీక్ రమణన్ కుమారుడు యతీష్ దినకర్ , మదురై విలంగుడికి చెందిన సెల్వకుమార్ కుమారుడు జేసన్ ఆస్టిక్ వీరిద్దరూ ఆ ప్రాంతంలోని పాఠశాలలో ప్లస్-2 చదువుతున్నాడు. వీరు శనివారం ఆ ఆనకట్టలో స్నానం చేయడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ సిగ్నల్‌ను విశ్లేషించగా వైగై ఆనకట్ట సమీపంలో సిగ్నల్ చూపించింది. దీంతో పోలీసులు ఆదివారం ఉదయం వచ్చి ఆ ప్రాంతానికి వచ్చి చూశారు. అక్కడ ఫోన్‌లు లభ్యమయ్యాయి. స్నానానికి వచ్చిన వారు నీటిలో మునిగి చనిపోయి ఉంటారని భావించిన కడపట్టి పోలీసులు చోళవందాన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది నీటిలో దూకి వెతికారు. ఇందులో యతీష్ దినకర్, జేసన్ ఆస్టిక్ శవంగా వెలికి తీశారు. మృతుల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కడుపట్టి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించి విచారణ చేపట్టారు.

**చెరువులో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి**

**తిరువొత్తియూరు:** సేలయూరు సమీపంలో చెరువులో మునిగి పాఠశాల విద్యార్థులు ఇద్దరు మృతి చెందారు. చెన్నై, తాంబరం సమీపం సేలయూరు ప్రాంతంలో ఉన్న మాడంబాక్కం ఏఎస్‌కే నగర్ నాలుగో వీధికి చెందిన వెంకటేశన్ కుమారుడు చంద్రేష్(12),అదే ప్రాంతానికి చెందిన వినోద్ కుమారుడు దర్శన్(06) అనే ఇద్దరూ మాడంబాక్కంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 6, 1వ తరగతి చదువుతోన్నారు. శనివారం ఉదయం విద్యార్థులు ఇద్దరు ఇంటికి సమీపంలో ఆడుకుంటున్నారు. కొద్ది సమయం తరువాత ఇద్దరు అదృశ్యమయ్యారు. దిగ్భ్రాంతి చెందిన వారి తల్లిదండ్రులు పలు చోట్ల వారి కోసం గాలించారు. కానీ కనబడలేదు. తరువాత సమీపంలో వున్న మాడంబాక్కం చెరువు వద్దకు వెళ్లి చూడగా అక్కడ దర్శన్, చంద్రేష్ ఇద్దరూ మృతదేహంగా తేలుతున్నారు. దీని గురించి సమాచారం అందుకున్న సేలయూరు పోలీసులు విద్యార్థుల మృతదేహాలను స్వాధీనం చేసుకుని శవపరీక్ష కోసం క్రోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు జరిపిన విచారణలో ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న ఇద్దరు చేపలు పట్టడానికి మాడంబాక్కం చెరువు వద్దకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## కాంగ్రెస్ విజయానికి కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్

**తిరుత్తణి:** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. తిరువళ్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తిరుత్తణి, తిరువళ్లూరు నియోజకవర్గాలకు చెందిన నూతన కార్యవర్గ సభ్యుల సమావేశం తిరుత్తణిలో ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్ పాల్గొని కొత్త కార్యవర్గ సభ్యులను పరిచయం చేసి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో మతం పేరిట ప్రజలను విభజించి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రపన్నుతున్న బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారాలు తీవ్రం చేయాలని, అరక్కోణం, తిరువళ్లూరు లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ద్వారా పోటీ చేసే అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని ఇప్పటి నుంచే గ్రామాల్లో పర్యటించి, ప్రచారం చేపట్టాలని, దేశంకు కాంగ్రెస్ ఆవశ్యకతపై వివరించి ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర జనరల్ బాడీ సభ్యుడు, మాజీ యూనియన్ చైర్మన్ వెంకటరాజు, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు సుందరవేలు, జిల్లా ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్ సహా అనేక మంది పాల్గొన్నారు.

### యువకుడి హత్య కేసులో
## డీఎంకే కౌన్సిలర్ అరెస్టు



నిందితుడు దామోదరన్, మృతుడు కుమార్

**కొరుక్కుపేట:** యువకుడి హత్య కేసులో తాంబరం మున్సిపల్ కార్పొరేషన్ 45వ వార్డు డీఎంకే కౌన్సిలర్ దామోదరన్‌తోపాటు మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే ... వండలూరు పక్కనే ఉన్న కొలపాక్కంకు చెందిన కుమార్(40) ఆటో డ్రైవర్. డిసెంబర్ 21న మధురాంతకం పక్కనే ఉన్న పాతాళం సమీపంలోని కుమారవాడి ప్రాంతంలో దారుణ హత్యకు గురయ్యాడు. ఈ మేరకు పట్టాళం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు . ఈ హత్యకు సంబంధించి తాంబరం మున్సిపల్ కార్పొరేషన్ 45వ వార్డు డీఎంకే కౌన్సిలర్ దామోదరన్, యోజెస్, తంజావూరు జిల్లా పెరువూరాణి, అదనూరు గ్రామానికి చెందిన స్టీఫెన్ రాజ్, సెలైయూర్‌కి చెంది ప్రవీణ్ రాజ్ కుమార్, తిరువణ్ణామలై జిల్లాకు చెందిన పూంగావనం అనే ఆరుగురిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన దామోదరన్ భార్య నాలుగు నెలల క్రితం ఆకస్మికంగా ఆత్మహత్య చేసుకుంది. దీనివల్ల ఏర్పడిన వివాదాల కారణంగా ఈ హత్య జరిగినట్టు భావిస్తున్నారు.

### 5 లడ్డూ కౌంటర్లకు ఎస్బీఐ స్పాన్సర్ షిప్

**తిరుమల:** తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌లో గల 5 కౌంటర్లకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ షిప్ అందించింది. ఈ మేరకు ఆయా కౌంటర్లలో ఆదివారం ఉదయం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, బ్యాంకు ఎండీ శ్రీనివాసశెట్టి పూజలు చేసి ప్రారంభించారు. ఇకపై ఈ ఐదు కౌంటర్లను బ్యాంకు నిర్వహిస్తుంది. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి, కేంద్ర మంత్రులు


ఆలయం వెలుపల జస్టిస్ శ్రీనివాస్ దంపతులు

**తిరుమల:** తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్, కేంద్రమంత్రి నారాయణ్ టాటు రాణే, కేంద్ర సహాయ మంత్రి క్రిషన్ పాల్ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జి.జయరాం, ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, ఏసీఏ సెలెక్షన్ కమిటీ మాజీ చైర్మన్ చాముండేశ్వరీనాథ్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, ప్రభుత్వ విప్ కె.శ్రీనివాసులు, సినీ డైరెక్టర్ మారుతి, తిరుమల మాజీ జేఈవో శ్రీనివాసరాజు, ఇస్రో శాస్త్రవేత్తలు దర్శించుకున్నారు.

## నేటితో ముగియనున్న వైకుంఠ ద్వార దర్శనం

**తిరుమల:** తిరుమలలో గత ఏడాది డిసెంబర్ 23న ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి పర్వదినాలు సోమవారంతో ముగియనున్నాయి. శ్రీవారిని శనివారం అర్ధరాత్రి వరకు వైకుంఠ ద్వారంలో 63,728 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీలో రూ.3.70 కోట్లు కానుకలుగా సమర్పించారు. కాగా, వైకుంఠ ఏకాదశి పర్వదినాల సందర్భంగా శ్రీవారి ఆలయం పుష్పాలంకరణతో కనువిందు చేస్తోంది. ధ్వజస్తంభం, బలిపీఠం ఆలయం మహా ద్వారాన్ని అందంగా ముస్తాబు చేశారు.

# 'వ్యర్థాలతో' జాతీయ రహదారులు

- దేశంలో 170 మిలియన్ టన్నుల వ్యర్థ పదార్థాల గుర్తింపు
- స్వచ్ఛ భారత్ మిషన్ సమన్వయంతో ఎన్‌హెచ్‌ఏఐ ప్రణాళిక

**సాక్షి, అమరావతి:** పర్యావరణ కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రయత్నాలు ఆరంభించింది. దేశంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో గుట్టలు, గుట్టలుగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాలను దేశంలో భారీ స్థాయిలో నిర్మిస్తున్న జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూమిని ఎత్తు చేసేందుకు ఉపయోగించుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. ఇందుకోసం చేపట్టిన పైలట్ ప్రాజెక్టులు విజయవంతమవడంతో దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయాలని చూస్తోంది. స్వచ్ఛ భారత్ మిషన్ కార్పొరేషన్ సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసింది.

వ్యర్థాలను జాతీయ రహదారుల నిర్మాణం కోసం సద్వినియోగం చేసుకోవడాన్ని ఎన్‌హెచ్‌ఏఐ పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టింది. ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ హైవే, ఢిల్లీ–ఎన్‌సీఆర్ హైవేల నిర్మాణంలో ఈ వ్యర్థాలను ఉపయోగించింది. జాతీయ రహదారుల నిర్మాణం కోసం మార్కింగ్ చేసిన మార్గంలో భూమిని కొంత వరకు ఎత్తు



పెంచిన అనంతరం కొత్త రహదారులను నిర్మిస్తారు. ఇందుకోసం ఇప్పటి వరకు మట్టి, కంకరలను ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు వాటితోపాటు నగరాలు, పట్టణాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లలోని సాలిడ్ వేస్ట్‌ను ఉపయోగించనున్నారు. కొత్తగా నిర్మించే జాతీయ రహదారుల్లో ఈ వ్యర్థాలను ఉపయోగించాలని ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

దేశంలోని నగరాలు, పట్టణాల్లోని 2,304 డంపింగ్ యార్డుల్లో ప్రస్తుతం 170 మిలియన్ టన్నుల సాలిడ్ వేస్ట్ అందుబాటులో ఉందని స్వచ్ఛ భారత్ మిషన్ అంచనా వేసింది. దాదాపు 10వేల హెక్టార్ల మేర ఉన్న డంపింగ్ ప్రదేశాల్లో ఆ వ్యర్థాలన్నీ గుట్టలుగా పడి ఉన్నాయి. వాటిని జాతీయ రహదారుల నిర్మాణం కోసం ఎన్‌హెచ్‌ఏఐకు అందించాలని స్వచ్ఛ భారత్ మిషన్ ఆదేశించింది. ఇందుకోసం డంపింగ్ యార్డ్‌ల వద్ద బయోమైనింగ్ యంత్రాలను ఎన్‌హెచ్‌ఏఐ సమకూర్చనున్నది. తద్వారా దేశంలోని వ్యర్థాలను సక్రమ నిర్వహణ, సరైన రీతిలో సద్వినియోగానికి సాధ్యపడుతుందని ప్రభుత్వం కూడా భావిస్తోంది. మరోవైపు పర్యావరణ కాలుష్య సమస్యకు కూడా సరైన పరిష్కారంగా పరిగణిస్తోంది.

# పరిటాల వర్సెస్ వరదాపురం

- ధర్మవరం నియోజకవర్గంలో తారాస్థాయికి చేరిన వర్గపోరు
- ముదిగుబ్బలో శ్రీరామ్, సూరి వర్గీయుల మధ్య ఘర్షణ
- చెప్పులు విసురుకుని ఘర్షణ పడిన ఇరువర్గాలు


ఘర్షణ పడుతున్న టీడీపీ నేతలు పరిటాల శ్రీరామ్, సూరి వర్గీయులు

**ధర్మవరం:** శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు వరదాపురం సూరి మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరింది. ప్రశాంతంగా ఉంటున్న నియోజకవర్గంలో అశాంతి రాజేసేలా ఇరువర్గాలు వ్యవహరిస్తున్నాయి. ఇప్పటిదాకా బీజేపీలో ఉన్న వరదాపురం సూరి వర్గీయులు టీడీపీలో చేరుతున్నామనే సంకేతాలిచ్చేందుకు ముదిగుబ్బ మండల కేంద్రంలో సొసైటీ సర్కిల్ వద్ద చంద్రబాబు, లోకేశ్ ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలే ప్రధానంగా ఘర్షణకు కారణమయ్యాయి. పోలీసులు సకాలంలో స్పందించడంతో పరిస్థితి సద్దుమణిగింది. వరదాపురం సూరి 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఘోర ఓటమిని చవిచూశారు. ఆ తర్వాత నెల కూడా గడవక ముందే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి నుంచి ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా పరిటాల శ్రీరామ్ వ్యవహరిస్తున్నారు. కానీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో త్వరలో టీడీపీలోకి చేరతామని, ఆ పార్టీ టికెట్ తనకేనంటూ కొంత కాలంగా సూరి తన అనుచరులతో విస్తృత ప్రచారం చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరదాపురం సూరి రెండు రోజుల కిందట ధర్మవరంలో మీడియాతో మాట్లాడుతూ పరిటాల కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఓడిపోవడానికి ప్రధాన కారణం ఓ మాజీ మంత్రి అని, వారు ధర్మవరం, శింగనమల, పెనుకొండలకు వెళితే వైఎస్సార్‌సీపీకి పనిచేస్తారని, ఒక్క రాప్తాడులో మాత్రం టీడీపీకి పని చేస్తారని, ధర్మవరం చెరువుకు నీరు అందించేందుకు తాను సొంత నిధులతో కాలువ మరమ్మతులు చేయిస్తే.. వాటికి కూడా నాడు –నేడు కింద బిల్లులు చేసుకున్నారని పరోక్షంగా పరిటాల సునీతను విమర్శించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి చేరాయి.

### మీ పార్టీ నాయకుల ఫొటోలు వేసుకోండి..

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ముదిగుబ్బ మండలంలో వరదాపురం సూరి అనుచరులు పసుపు రంగు ఫ్లెక్సీల ఏర్పాటుకు పూనుకున్నారు. అందులో వరదాపురంతో పాటు చంద్రబాబు, నారా లోకేశ్ ఫొటోలు వేయించారు. దీనిపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు బీజేపీలో ఉన్నందు వల్ల ఆ పార్టీ నాయకుల బొమ్మలు వేసుకోండి. అంతేగానీ చంద్రబాబు, లోకేశ్ ఫొటోలు ఎలా వేస్తారు? అంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకుంది. పరస్పరం చెప్పులు విసురుకున్నారు. ముదిగుబ్బ ఎస్‌ఐ వంశీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. వివాదం ముదురుతుండటంతో సూరి వర్గీయులు వివాదాస్పద ఫ్లెక్సీలను తొలగించి వెనుదిరిగారు.

# సీఎం జగన్ కోసం ఏం చేయడానికైనా సిద్ధం

- సీఎంతో విభేదాలంటూ ఎల్లో మీడియా అభూత కల్పనలు
- 14 ఏళ్లలో కుప్పానికి ఏమీచేయలేని చంద్రబాబు మళ్లీ వస్తే ఏం ఉద్ధరిస్తాడు? : మంత్రి పెద్దిరెడ్డి ఆగ్రహం



**తిరుపతి మంగళం (తిరుపతి జిల్లా):** నిత్యం ప్రజాసంక్షేమమే పరమావధిగా, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ఏంచేయడానికైనా సిద్ధమని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. సీఎం జగన్‌తో తనకు విభేదాలున్నాయంటూ ఎల్లో మీడియా అభూతకల్పనలు సృష్టించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆయన ఆదివారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తనకు విభేదాలుంటే తాను ఇంకా పార్టీలో ఉంటానా? అని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లాతో పాటు కుప్పంలో చంద్రబాబు ఉనికి కోల్పోయేలా చేస్తున్నానని తనకు, సీఎం జగన్‌కు మధ్య విభేదాలు సృష్టించాలన్న కుట్రలతో ఎల్లో మీడియా కట్టుకథలు రాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌తో తాను ఎప్పుడూ సన్నిహితంగానే ఉంటానని, సీఎం కోసం ఏంచేయడానికైనా సిద్ధంగా ఉంటానని చెప్పారు. అంతేతప్ప సీఎంతో విభేదాలు పెట్టుకునే అవసరం, తత్వం తనది కాదని స్పష్టం చేశారు. కేవలం చంద్రబాబును ఎలాగైనా అధికారంలోకి తీసుకురావాలన్న దురాలోచనతో ఎల్లో మీడియా తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌కు పెద్దిరెడ్డిని దూరం చేస్తే చిత్తూరు జిల్లాతో పాటు కుప్పంలో ఉనికి కోల్పోకుండా ఉండవచ్చన్న ఆలోచనతో ఎల్లో మీడియా కట్టుకథలు అల్లుతూ విషపురాతలు రాస్తోందన్నారు. టీడీపీ ఇప్పటికే పాడెపైకి చేరిందని, చివరిదశలో చంద్రబాబు దింపుడుకళ్లం ఆశతో పోరాడుతున్నాడని చెప్పారు. దింపుడుకళ్లంపై ఉన్న టీడీపీని, చంద్రబాబును పైకి లేపేందుకు ఎల్లో మీడియా తీవ్ర ప్రయత్నం చేస్తోందన్నారు. జగన్‌పై, తనపై, వైఎస్సార్‌సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులపై ఎలాంటి కట్టుకథలు రాసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్న విషయాన్ని ఎల్లో మీడియా గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రాజకీయ భవిష్యత్తు ప్రసాదించి 14 ఏళ్లపాటు అధికారంలో ఉండేలా చేసిన కుప్పం ప్రజలకు ఏంచేశావు చంద్రబాబూ.. అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి మళ్లీ ఒక అవకాశం కల్పిస్తే కుప్పాన్ని అభివృద్ధి చేస్తానని, కుప్పంలో కూరగాయలను విదేశాలకు ఎగుమతి చేయిస్తానని.. నోటికి వచ్చిన అబద్ధాలు చెబుతున్న చంద్రబాబును ఈసారి కుప్పం ప్రజలు నమ్మి మోసపోయే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. చంద్రబాబు పక్షాన నిలబడి ఎల్లో మీడియా ఎన్ని అబద్ధపు రాతలు రాసినా, చంద్రబాబు ఎన్ని కుయుక్తులు, కుట్రలు పన్నినా ప్రజలు నమ్మరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఎవరికీ సాధ్యంకానన్ని సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే తిరిగి గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

## బుక్ ఫెస్టివల్‌లో గ్రామీణాభివృద్ధిశాఖ స్టాల్


ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

**సాక్షి,అమరావతి:** విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన గ్రామీణాభివృద్ధిశాఖ స్టాల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఆదివారం ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ స్టాల్‌లో ఫొటోలను ప్రదర్శించారు. వీటిలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలు, నీటి సంరక్షణ, భూసార పరిరక్షణ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో ఇటీవల కాలంలో భూగర్భ జలాల పెరుగుదలలో వచ్చిన మార్పుల వివరాలు స్పష్టంగా తెలిసేలా పెట్టిన ఫొటోలు ఆకట్టుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

# టీడీపీ కోవర్టుల గోబెల్స్ ప్రచారం

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 1,190వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు


రిలే దీక్షలో బహుజన నాయకులు

**తాడికొండ:** రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ దందా కోసం టీడీపీ కోవర్టులు బాబు అధికారంలోకి వస్తున్నాడంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,190వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి, ప్రసంగించారు. ఎన్నికల్లో ఓటమి పాలైతే తాను పూర్తిగా రాజకీయాలకు దూరం కావాల్సి వస్తుందనే బెంగతోనే చంద్రబాబు కుయుక్తులు పన్ని ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నాడే తప్ప ఆయనకు కనీస సానుభూతి లేదని పేర్కొన్నారు. బాబు హయాంలో రాజధాని 29 గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ప్రభుత్వానికి అండగా ఉన్నారనేందుకు తాడికొండలో జరిగిన సాధికార సామాజిక బస్సు యాత్రకు వచ్చిన ఆదరణే నిదర్శనమని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా దళితులు, బహుజనులు రాజధాని ప్రాంతంలో జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించి భారీ మెజార్టీ ఇవ్వడం ఖాయమన్నారు. బహుజనులకు హక్కుల సాధనకు సుదీర్ఘ కాలంగా పోరాటం చేస్తున్న తమకు కులవాద మూలాలతో ఉన్న పార్టీలు కనీస మద్దతిచ్చి తొంగి చూసిన దాఖలాలు లేవని, కులోన్మాదులంతా ఏకమై బాబును గద్దెనెక్కించేందుకు చేస్తున్న కుట్రలు సాగనివ్వమన్నారు. రాష్ట్రంలో బహుజనులకు తగిన న్యాయం జరగాలంటే మూడు రాజధానులు, ఇంగ్లిషు మీడియం విద్య, రాజధానిలో 54 వేల పట్టాలు నూతన సంవత్సరంలో సాధించి తమ సత్తా చాటుతామన్నారు. నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలంటే బహుజనులకు న్యాయం చేసే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పల్లె బాబు, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## నేడు రాజ్‌భవన్ 'ఓపెన్‌హౌస్'కు సీఎం రేవంత్

**సాక్షి, హైదరాబాద్:** నూ తన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజ్‌భవన్‌లో సోమవా రం మధ్యాహ్నం12 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించనున్న ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సీఎంగా బాధ్యత లు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసా రిగా రాజ్‌భవన్‌కు వెళ్లనున్నారు. గవర్నర్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తామని ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్ర సచివాలయంలో అందుబాటులో ఉండి సందర్శకుల నుంచి నూతన సంవత్సర శుభాకాంక్షలు అందుకోనున్నారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం నుమాయిష్‌ను సీఎం ప్రారంభించనున్నారు.

## గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

**సాక్షి, హైదరాబాద్ / సాక్షి, అమరావతి:** రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సును తీసుకురావాలని, వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుకున్నారు. 2024లో సైతం అన్ని రకాల సామాజిక రుగ్మతలపై పోరాటాన్ని విజయవంతంగా కొనసాగించడంతో పాటు, సమానత్వం, శాంతియుత, సుస్థిర, ఆరోగ్యకర సమాజం కోసం కొత్త సంవత్సరం సందర్భంగా అందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలి: భట్టి**

ప్రజలకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది.. కొత్త ఆశలు.. కొత్త కోరికలు.. కొత్త లక్ష్యాలు.. కొత్త ఆశయాలు.. కొత్త నిర్ణయాలు.. కొత్త ఉత్సాహంతో కలకాలం ఉండాలని కోరుకుంటున్నట్లు భట్టి తెలిపారు. 2024లో ఇంటింటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

**మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు**

రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో నూతన సంవత్సరం సుఖశాంతులు నింపాలని ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 ఏడాదిలో ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు.
- నూతన సంవత్సరంలో సీఎం రేవంత్ నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగనున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ

# ఎక్కడ..ఎవరు?

- బీజేపీలో ఎంపీ టికెట్లకు పోటాపోటీ
- సిట్టింగ్ ఎంపీలకు లైన్‌క్లియర్.. 13 చోట్ల ఆశావహుల ప్రయత్నాలు
- ఈనెల మొదటివారంలోగా అభ్యర్థుల ఖరారుపై స్పష్టత



**సాక్షి, హైదరాబాద్:** బీజేపీలో ఎంపీ టికెట్ల కోసం హడావుడి మొదలైంది. నలుగురు సిట్టింగ్ ఎంపీలకు రూట్ క్లియర్ అనే ప్రచారం నేపథ్యంలో మిగిలిన 13 స్థానాల్లో మాత్రం నేతలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 10 ఎంపీ సీట్లు గెలవాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇటీవల దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా అభ్యర్థుల ఖరారులో జాప్యం జరగకుండా వచ్చే నెల మొదటి వారంలోగా ఎంపీ అభ్యర్థుల ఖరారుపై స్పష్టత వచ్చేలా చూస్తామని అమిత్‌షా ప్రకటించారు. ఇందుకు అవసరమైన కసరత్తు వేగవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌ను ఆయన ఆదేశించినట్టు పార్టీవర్గాల సమాచారం. దీంతో ఎంపీ టికెట్ల కోసం తీవ్రపోటీ నెలకొంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీలు స్థానాలు (సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్) మినహాయిస్తే, మల్కాజ్‌గిరితో పాటు జహీరాబాద్, మెదక్, చేవెళ్ల, మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ల కోసం నాయకులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు.

- మెదక్ నుంచి పోటీకి తాను సిద్ధమైనట్టు దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ఎం. రఘునందన్‌రావు ఇప్పటికే ప్రకటించారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేరు కూడా పరిశీలనలో ఉంది.
- మహబూబ్‌నగర్ సీటు విషయానికొస్తే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి ప్రయత్నాల్లో ఉన్నారు.
- చేవెళ్ల నుంచి పోటీకి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సై అంటున్నారు.
- భువనగిరి సీటు తనకే వస్తుందనే ధీమాతో మాజీ ఎంపీ డా.బూరనర్సయ్యగౌడ్ ఉన్నారు. అయితే గత ఎన్నికల్లో పోటీచేసిన భువనగిరి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు కూడా పోటీకి ఆసక్తి కనబరుస్తున్నారు.
- మహబూబాబాద్ టికెట్‌కు తేజావత్ రామచంద్రునాయక్, హుస్సేన్‌నాయక్, దిలీప్‌నాయక్ పోటీ పడుతున్నారు.
- ఖమ్మం నుంచి పొంగులేటి సుధాకర్‌రెడ్డికి అవకాశం కల్పిస్తారా, లేకపోతే పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ లేదా గల్లా సత్యనారాయణ, గరికపాటి మోహన్‌రావులకు అవకాశం ఇస్తారా చూడాలి.
- నల్లగొండ నుంచి గత ఎన్నికల్లో జితేంద్ర పోటీ చేశారు. అయితే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనకు అవకాశం ఇస్తారా లేకపోతే రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేత బరిలో దింపుతారా చూడాలి. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు డా.జి.మనోహర్‌రెడ్డి కూడా ఇక్కడి నుంచి పోటీకి ఆసక్తి కనబరుస్తున్నారు.
- పెద్దపల్లి నుంచి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగల కుమార్‌కు మళ్లీ పోటీకి అవకాశం దక్కవచ్చునని చెబుతున్నారు.

### మల్కాజ్‌గిరి.. ఈటల గురి



మల్కాజ్‌గిరి లోక్‌సభ సెగ్మెంట్ నుంచి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పోటీకి సై అంటున్నారు. ఇటీవల నగరానికి వచ్చిన అమిత్ షాతో విడిగా ఈటల భేటీ అయ్యారు. లోక్‌సభకు పోటీపై మాట్లాడేందుకు సమయం కావాలని కోరగా, రెండు, మూడురోజుల్లో ఢిల్లీకి రావాలని చెప్పినట్టు తెలిసింది. పి.మురళీధర్‌రావు, పేరాల శేఖర్‌రావు, ఎన్.రామచందర్‌రావు, కూన శ్రీశైలంగౌడ్, డా.ఎస్.మల్లారెడ్డి, టి.వీరేందర్‌గౌడ్, సామ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి తదితరులు ఇక్కడి నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ మల్కాజ్‌గిరి టికెట్ ఇవ్వడానికి వీలుపడని పక్షంలో జహీరాబాద్, మెదక్ నుంచి అయినా పోటీ సిద్ధమే అన్న సంకేతాలు ఈటల ఇచ్చినట్టు సమాచారం.

### జహీరాబాద్.. ఏలేటి సురేశ్ రెడ్డి



జహీరాబాద్ నుంచి పోటీకి అవకాశం కల్పించాలంటూ ఈ లోక్‌సభ పరిధిలోని ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన వ్యాపారవేత్త ఏలేటి సురేశ్‌రెడ్డి కోరుతున్నారు. ఇప్పటికే ఆయన కిషన్‌రెడ్డిని కోరినట్టు తెలిసింది. ఈ విషయమై అధిష్టానానికీ విజ్ఞప్తి చేయగా, జనవరి 2న ఢిల్లీ వచ్చి కలవాలని ఆయనకు అమిత్‌షా చెప్పినట్టు తెలిసింది. డాక్టర్ కె.లక్ష్మణ్, వీరశైవ లింగాయత్ సమాజ్‌కు చెందిన జాతీయనేత అశోక్ ముస్తాపురే, అక్కడి ప్రజల్లో గుర్తింపు ఉన్న సోమయప్ప స్వామిజీ, చీకోటి ప్రవీణ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి.

### వరంగల్.. మందకృష్ణ



వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తే.. బీజేపీలో చేరి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చెబుతున్నారని సమాచారం. మాజీ డీజీపీ కృష్ణప్రసాద్, మరికొందరూ ఇదే సీటుకు పోటీపడుతున్నారు.

### నాగర్ కర్నూల్.. బంగారు శ్రుతి



నాగర్‌కర్నూల్ స్థానానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతిని బరిలో దింపవచ్చునని లేదంటే ఎవరినైనా కొత్త అభ్యర్థిని తెరపైకి తీసుకొచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేమని అంటున్నారు.

### హైదరాబాద్.. రాజాసింగ్



హైదరాబాద్ ఎంపీగా ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోటీ చేయిస్తే అనూహ్య ఫలితాలు సాధించవచ్చనే చర్చ పార్టీవర్గాల్లో జరుగుతోంది. గత ఎన్నికల్లో పోటీ చేసిన భగవంత్‌రావు పేరు కూడా పరిశీలనలో ఉంది.

# యాది మరువలేదు


- 'సాక్షి' కథనంపై స్పందించిన సీఎంఓ
- లక్ష్మి నుంచి వివరాలు సేకరించిన రెవెన్యూ అధికారులు
- ఇల్లు మంజూరుకు ప్రతిపాదనలు


లక్ష్మి నుంచి వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

**సాక్షి, కామారెడ్డి:** 'రేవంతన్నా.. నన్ను యాది మరవకు' శీర్షికన 'సాక్షి' మెయిన్‌లో ఆదివారం ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. సీఎంఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో భిక్కనూరు లక్ష్మి ఇంటికి వెళ్లారు ఆమె కుటుంబ వివరాలు సేకరించారు. గతేడాది మార్చి 28న జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి కూలిపోయిన ఇంట్లో ఉంటున్న భిక్క నూరు లక్ష్మి బాధలు ఆలకించారు. అధికారంలోకి రాగానే ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై సీఎంఓ స్పందించి, వివరాలు సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూల్‌సింగ్, ఏడీ నర్సింహారెడ్డి చిన్నమల్లా రెడ్డి గ్రామానికి వెళ్లి లక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కూలిపోగా మిగిలిన కొద్ది భాగంలో లక్ష్మి కుటుంబం నివసిస్తున్న విషయాన్ని నోట్ చేసుకున్నారు. ఇప్పటికిప్పుడు ఇబ్బంది ఉంటే పొరుగునే ఉన్న తిమ్మక్‌పల్లిలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయిస్తామని అధికారులు చెప్పారు. అయితే కూలిపోయిన ఇంటి స్థలంలోనే కొత్త ఇల్లు నిర్మాణానికి సాయం అందించాలని లక్ష్మి కోరడంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మితో పాటు ఆమె కుటుంబ సభ్యులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

## 4న ఆటో డ్రైవర్ల మహాధర్నా

### తెలంగాణ భవన్‌లో ఆటో కార్మికుల సమావేశం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం'పథకంతో తాము ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 3న రాష్ట్రవ్యాప్తంగా బస్‌స్టాండ్లు, బస్ డిపోల ముందు భిక్షాటన చేస్తామని ప్రకటించారు. అలాగే ఈ నెల 4న హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద 'మహా ధర్నా'నిర్వహిస్తామని ప్రకటించారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఉపాధి దెబ్బతిన్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ప్రతీనెల రూ.15 వేలు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేతలు రూప్ సింగ్, జి.రాంబాబు యాదవ్, వేముల మారయ్య తెలంగాణభవన్‌లో ఆదివారం ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 9వ తేదీ నుంచి అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో రాష్ట్రంలో సుమారు 8 లక్షల మంది ఆటో, టాటా మ్యాజిక్, ఓలా, ఉబర్, సెవెన్ సీటర్ వాహన డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని వేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశం మేరకు డ్రైవర్ల స్థితిగతులను అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ఈ భేటీ ఏర్పాటు చేసినట్లు కార్మిక విభాగం నేతలు వెల్లడించారు.

## 3న టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం

**హాజరుకానున్న మున్షీ, ఠాక్రే, సీఎం రేవంత్**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఈనెల 3వ తేదీన జరగనుంది. త్వరలోనే జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించేందుకు మధ్యా హ్నం 3 గంటలకు గాంధీభవన్‌లో ఈ సమా వేశం జరుగుతుందని టీపీసీసీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ సమావేశానికి టీపీసీసీ పీఏసీ, పీఈసీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు లు, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారు. గతంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా పని చేసిన ఠాక్రే కూడా సమావేశానికి రానున్నారు. ఆయనకు వీడ్కోలు పలకడంతో పాటు కొత్త ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి స్వాగతం పలుకు తామని, టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరవుతున్నందున నామినేటెడ్ పోస్టుల భర్తీపై తీపి కబురు ఉంటుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
సోమవారం ॥ 1-1-2024

కొత్త సంవత్సరం

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ళని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

మంచి మాట

# కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించే వారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌర మానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.

అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం.

రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.


అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

● ముగ్గు ముచ్చట



ముగ్గులకు ఆహ్వానం



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా! ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

# ఒక అసాధ్యాన్ని సాధిస్తా!


## ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా

చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది. లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.

మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మిగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్య సాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యోస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఎఱుకతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యోస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి! ●

# సినిమా



● రజనీకాంత్

## కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.



● విజయ్

## గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



● నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

## మా జోలికొస్తే నా సామిరంగ!

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాల భైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి.



## అది మరచిపోలేని జ్ఞాపకం

– శివాత్మిక రాజశేఖర్

''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క (శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచరస్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. 2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

■ మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?

నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్స్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ 2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న (జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.



● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

## యాక్షన్ ఎంటర్‌టైనర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్ఎస్ 10' (వర్కింగ్ టైటిల్). 'ఛత్రపతి నాయక్' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



● మృణాల్ ఠాకూర్



● లారెన్స్

## లారెన్స్‌కు జోడీగా..?

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



● శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

## దూడుం దుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: క్రమాన్.

## వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'.



● ఆకాష్, భావన

గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.

## 'ఫైవ్స్ వరల్డ్ కప్'లో భారత మహిళల జట్టు కెప్టెన్‌గా రజని

అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) 'హాకీ ఫైవ్స్' ప్రపంచకప్‌లో పాల్గొనే భారత మహిళల జట్టుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యతిమరపు రజని కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఎఫ్ఐహెచ్ అధికారికంగా నిర్వహించే ఈ టోర్నీ ఒమన్‌లోని మస్కట్‌లో జనవరి 24నుంచి 27 వరకు జరుగుతుంది. గోల్‌కీపర్ రజని భారత్‌కు 96 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించింది. భారత జట్టుకు మహిమా చౌదరి వైస్ కెప్టెన్‌గా ఎంపిక కాగా...బన్సారి సోలంకి, అక్షతా అబాసో ఢేకలే, జ్యోతి ఛత్రి, మరియానా కుజుర్, ముంతాజ్ ఖాన్, అజ్మినా కుజుర్, రుతుజ దాదాసో పిసాల్, దీపిక సోరెంగ్ ఇతర జట్టు సభ్యులు. టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. పూల్ సిలో భారత్‌తో పాటు నమీబియా, పోలండ్, అమెరికా ఉన్నాయి. ఫిజి, మలేసియా, నెదర్లాండ్స్, ఒమన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, జాంబియా, న్యూజిలాండ్, పరాగ్వే, థాయిలాండ్, ఉరుగ్వే కూడా పాల్గొంటున్నాయి. ఆ తర్వాత జనవరి 28నుంచి 31 వరకు జరిగే పురుషుల 'హాకీ ఫైవ్స్' ప్రపంచకప్‌లో భారత సారథిగా సిమ్రన్‌జిత్ సింగ్ ఎంపికయ్యాడు. సూరజ్ కర్కేరా, ప్రశాంత్ కుమార్, మన్‌దీప్ మోర్, మంజీత్, రాహీల్, మణీందర్, పవన్ రాజ్‌భర్, గుర్జోత్ సింగ్, ఉత్తమ్ సింగ్ జట్టులో ఇతర సభ్యులు.




# 2024 ఆటలు...ఆశలు...

## వార్షిక క్రీడా క్యాలెండర్

ప్రపంచ క్రీడా పండుగ ఒలింపిక్స్‌లో ఈ సారి భారత్ పతకాల సంఖ్య రెండంకెలకు చేరుతుందా...టి20 ప్రపంచకప్ టైటిల్‌తో టీమిండియా ఈ సారైనా పదిహేడేళ్ల కరువు తీరుస్తుందా...మన మహిళల క్రికెట్ టీమ్ వరల్డ్ కప్ అందుకునే స్థాయికి ఎదిగిందా...అండర్-19 స్థాయిలో ప్రపంచ కప్ డిఫెండింగ్ చాంపియన్‌గా దిగుతున్న మన కుర్రాళ్లు మళ్లీ సత్తా చాటుతారా... క్రికెట్ ఫ్యాన్స్ మదిలో ఈ ప్రశ్నలకు కొత్త ఏడాదిలో సమాధానం లభిస్తుంది... బ్యాడ్మింటన్ ప్రపంచంలో మరోసారి మన షట్లర్ల హవా సాగుతుందా...ఫార్ములా వన్ 23 రేస్‌లలో ఎవరికి పైచేయి అవుతుంది... హాకీలో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి... ఫుట్‌బాల్‌లో ఆసియా ఖండంలో మన బలం పెరిగిందా...ఇవన్నీ చూడాల్సిందే. టెన్నిస్‌లో ఎప్పటిలాగే నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల వేట...ప్రతీ ఏటా అలరించేందుకు వచ్చే ఐపీఎల్ ఎలాగూ ఉన్నాయి. వీటికి తోడు ఆర్చరీ, అథ్లెటిక్స్, చెస్, రెజ్లింగ్, షూటింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్‌లాంటి క్రీడల్లో పలు ఆసక్తికర టోర్నీలకు ఈ ఏడాది వేదిక కానుంది. 2024లో క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమైన ప్రధాన ఈవెంట్ల క్యాలెండర్ మీ కోసం...

### ఫుట్‌బాల్

ఆసియా కప్ (ఖతర్)
జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు
యూరో-2024 (జర్మనీ)
జూన్ 14 నుంచి జూలై 14 వరకు
కోపా అమెరికా టోర్నీ (అమెరికా)
జూన్ 20 నుంచి జూలై 14 వరకు

### బ్యాడ్మింటన్



**జనవరి 9-14:** మలేసియా ఓపెన్-1000 టోర్నీ (కౌలాలంపూర్)
**జనవరి 16-21:** ఇండియా ఓపెన్-750 టోర్నీ (న్యూఢిల్లీ)
**మార్చి 5-10:** ఫ్రెంచ్ ఓపెన్-750 టోర్నీ (పారిస్)
**మార్చి 12-17:** ఆల్ ఇంగ్లండ్ ఓపెన్-1000 టోర్నీ (బర్మింగ్‌హామ్)
**ఏప్రిల్ 28-మే 5:** థామస్ కప్-ఉబెర్ కప్ ఫైనల్స్ (చెంగ్డూ, చైనా)
**మే 28-జూన్ 2:** సింగపూర్ ఓపెన్-750 టోర్నీ
**జూన్ 4-9:** ఇండోనేసియా ఓపెన్-1000 టోర్నీ (జకార్తా)
**ఆగస్టు 20-25:** జపాన్ ఓపెన్-750 టోర్నీ (టోక్యో)
**సెప్టెంబర్ 17-22:** చైనా ఓపెన్-1000 టోర్నీ (చాంగ్జౌ)
**అక్టోబర్ 15-20:** డెన్మార్క్ ఓపెన్-750 టోర్నీ (ఒడెన్స్)
**నవంబర్ 19-24:** చైనా మాస్టర్స్-750 టోర్నీ (షెన్‌జెన్)
**నవంబర్ 26-డిసెంబర్ 1:** సయ్యద్ మోడి ఓపెన్-300 టోర్నీ (లక్నో)
**డిసెంబర్ 11-15:** వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ (హాంగ్జౌ, చైనా)

### టెన్నిస్

**జనవరి 15-28:** ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (మెల్‌బోర్న్)
**మే 26-జూన్ 9:** ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (పారిస్)
**జూలై 1-14:** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (లండన్)
**ఆగస్టు 26-సెప్టెంబర్ 8:** యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (న్యూయార్క్)
**నవంబర్ 10-17:** ఏటీపీ ఫైనల్స్ టోర్నీ (టురిన్, ఇటలీ)

### ఫార్ములావన్



**మార్చి 2:** బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి
**మార్చి 9:** సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి
**మార్చి 24:** ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి
**ఏప్రిల్ 7:** జపాన్ గ్రాండ్‌ప్రి
**ఏప్రిల్ 21:** చైనా గ్రాండ్‌ప్రి
**మే 5:** మయామి గ్రాండ్‌ప్రి
**మే 19:** ఎమీలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి
**మే 26:** మొనాకో గ్రాండ్‌ప్రి
**జూన్ 9:** కెనడా గ్రాండ్‌ప్రి
**జూన్ 23:** స్పానిష్ గ్రాండ్‌ప్రి
**జూన్ 30:** ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి
**జూలై 7:** బ్రిటిష్ గ్రాండ్‌ప్రి
**జూలై 21:** హంగేరి గ్రాండ్‌ప్రి
**జూలై 28:** బెల్జియం గ్రాండ్‌ప్రి
**ఆగస్టు 25:** డచ్ గ్రాండ్‌ప్రి
**సెప్టెంబర్ 1:** ఇటలీ గ్రాండ్‌ప్రి
**సెప్టెంబర్ 15:** అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి
**సెప్టెంబర్ 22:** సింగపూర్ గ్రాండ్‌ప్రి
**అక్టోబర్ 20:** యూఎస్ గ్రాండ్‌ప్రి
**అక్టోబర్ 27:** మెక్సికో గ్రాండ్‌ప్రి
**నవంబర్ 3:** బ్రెజిల్ గ్రాండ్‌ప్రి
**నవంబర్ 23:** లాస్ వేగస్ గ్రాండ్‌ప్రి
**డిసెంబర్ 1:** ఖతర్ గ్రాండ్‌ప్రి




### భారత క్రికెట్ జట్టు షెడ్యూల్

**జనవరి 11-17:** అఫ్గానిస్తాన్‌తో స్వదేశంలో 3 టి20 మ్యాచ్‌లు
**జనవరి 25-మార్చి 11:** ఇంగ్లండ్‌తో స్వదేశంలో 5 టెస్టులు
**ఐపీఎల్:** మార్చి 22 నుంచి మే 26 వరకు
**జూలై:** శ్రీలంకలో భారత్ పర్యటన (3 వన్డేలు, 3 టి20లు)
**సెప్టెంబర్:** స్వదేశంలో బంగ్లాదేశ్‌తో సిరీస్ (2 టెస్టులు, 3 టి20లు)
**అక్టోబర్:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్ (3 టెస్టులు)
**నవంబర్-డిసెంబర్:** ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన (5 టెస్టులు)

**పురుషుల టి20 ప్రపంచకప్ టోర్నీ**
జూన్ 4 నుంచి 30 వరకు
వేదిక: వెస్టిండీస్, అమెరికా

**అండర్-19 పురుషుల వన్డే ప్రపంచకప్ టోర్నీ**
జనవరి 19 నుంచి ఫిబ్రవరి 11 వరకు
వేదిక: దక్షిణాఫ్రికా

**మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ**



సెప్టెంబర్-అక్టోబర్
వేదిక: బంగ్లాదేశ్

### హాకీ



**జనవరి 13-21:** ఒలింపిక్ క్వాలిఫయింగ్ పురుషుల టోర్నీ (వాలెన్సియా, స్పెయిన్)
**జనవరి 13-21:** ఒలింపిక్ క్వాలిఫయింగ్ మహిళల టోర్నీ (వాలెన్సియా, స్పెయిన్)
**జనవరి 13-19:** ఒలింపిక్ క్వాలిఫయింగ్ మహిళల టోర్నీ (రాంచీ, భారత్)
**జనవరి 15-21:** ఒలింపిక్ క్వాలిఫయింగ్ పురుషుల టోర్నీ (మస్కట్, ఒమన్)

### షూటింగ్



**జనవరి 5-18:** ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (జకార్తా)
**జనవరి 12-22:** ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షాట్‌గన్ టోర్నీ (కువైట్ సిటీ)
**జనవరి 24-ఫిబ్రవరి 1:** ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (కైరో, ఈజిప్ట్)
**ఫిబ్రవరి 4-13:** ప్రపంచకప్ షాట్‌గన్ టోర్నీ (రబాట్, మొరాకో)
**ఏప్రిల్ 11-19:** ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (రియో డి జనీరో, బ్రెజిల్)
**ఏప్రిల్ 22-30:** ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ షాట్‌గన్ టోర్నీ (దోహా, ఖతర్)
**మే 1-12:** ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (బకూ, అజర్‌బైజాన్)
**మే 31-జూన్ 7:** ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (మ్యూనిక్, జర్మనీ)
**జూన్ 10-19:** ప్రపంచకప్ షాట్‌గన్ టోర్నీ (లొనాటో, ఇటలీ)




పారిస్ ఒలింపిక్స్ - 26 జూలై - 11 ఆగస్టు

### అథ్లెటిక్స్

**జనవరి 21:** ఆసియా మారథాన్ చాంపియన్‌షిప్ (హాంకాంగ్)
**ఫిబ్రవరి 21-23:** ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (టెహ్రాన్)
**మార్చి 1-3:** ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (స్కాట్లాండ్)
**ఆగస్టు 26-31:** ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్ (పెరూ)

### చెస్

**ఏప్రిల్ 3-25:** క్యాండిడేట్స్ టోర్నమెంట్ (టొరంటో, కెనడా)
**జూన్ 1-14:** ప్రపంచ జూనియర్ అండర్-20 చాంపియన్‌షిప్ (న్యూఢిల్లీ, భారత్)
**సెప్టెంబర్ 10-23:** చెస్ ఒలింపియాడ్ (బుడాపెస్ట్, హంగేరి)
**అక్టోబర్ 22-నవంబర్ 2:** ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (బ్రెజిల్)

### రెజ్లింగ్

**ఏప్రిల్ 11-16:** ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ (బిష్కెక్, కిర్గిజ్‌స్తాన్)
**ఏప్రిల్ 19-21:** ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ (బిష్కెక్, కిర్గిజ్‌స్తాన్)
**మే 9-12:** ప్రపంచ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ (ఇస్తాంబుల్, తుర్కియే)

### బాక్సింగ్

**ఫిబ్రవరి 29-మార్చి 12:** పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ (ఇటలీ)
**ఏప్రిల్:** ఆసియా చాంపియన్‌షిప్
**మే 23-జూన్ 3:** పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ (థాయ్‌లాండ్)
**అక్టోబర్ 20-నవంబర్ 6:** ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (క్రొయేషియా)

### టేబుల్ టెన్నిస్

**ఫిబ్రవరి 16-25:** ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్ (బుసాన్, కొరియా)
**డిసెంబర్ 1-8:** ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (స్వీడన్)

### ఆర్చరీ

**ఏప్రిల్ 23-28:** ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీ (షాంఘై, చైనా)
**మే 21-26:** ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నీ (యెచోన్, కొరియా)
**జూన్ 18-23:** ప్రపంచకప్ స్టేజ్-3 టోర్నీ (అంటాల్యా, తుర్కియే)

---

## భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### నాటా-2024లో ప్రవేశాలు

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా)-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఈ పరీక్షలో చూపిన ప్రతిభతో జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ, హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** ఐదేళ్లు.
» **అర్హత:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో పాటు ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులు. మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా 50 శాతం మార్కులతో డిప్లొమా పూర్తిచేసిన వారు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులే.
» **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. నాటాను ఏటా మూడుసార్లు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్నవారు మూడు పరీక్షలు రాసుకోవచ్చు. రెండుసార్లు పరీక్ష రాస్తే ఎక్కువ మార్కులు సాధించిన ప్రయత్నాన్ని తుది స్కోరుగా పరిగణనలోకి తీసుకుంటారు. మూడుసార్లు రాస్తే ఎక్కువ మార్కులు పొందిన రెండు పరీక్షల సగటును స్కోరుగా నమోదు చేస్తారు. పరీక్షలో అర్హత సాధించడానికి 70 మార్కులు పొందాలి.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది:** 01.02.2024.
» **పరీక్ష ప్రారంభం:** 06.04.2024.
» **వెబ్‌సైట్:** www.nata.in

### తెలంగాణ ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలు

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్).. తెలంగాణ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతితోపాటు టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ద్వారా ఐఐటీ, నీట్ తదితర జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ఇంటెన్సివ్ కోచింగ్ అందిస్తారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 3,680 (బాలురకు- 1680, బాలికలకు- 2000).
» **కోర్సు వివరాలు:** ఎస్సీ గురుకుల కళాశాలల్లో(సీవోఈ కాలేజీలు) ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు.
» **గ్రూప్:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ.
» **అర్హత:** 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ విద్యార్థులకు), రూ.1,50,000(గ్రామీణ విద్యార్థులకు) మించకూడదు.
» **వయసు:** 31.08.2024 నాటికి 17 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ కన్వర్టెడ్ క్రిస్టియన్ విద్యార్థులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఎంపీసీ/బైపీసీ గ్రూపులకు స్క్రీనింగ్ పరీక్ష (లెవల్-1, 2), ఎంఈసీ/సీఈసీ గ్రూపులకు స్క్రీనింగ్ పరీక్ష (లెవల్-1), రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.01.2024.
» **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ తేదీలు:** 25.01.2024 నుంచి 03.02.2024 వరకు.
» **స్క్రీనింగ్ పరీక్ష తేది:** 04.02.2024.
» **వెబ్‌సైట్:** www.tswreis.ac.in

### ఏపీపీఎస్సీలో 38 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 38
» **అర్హత:** పీజీతో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పే స్కేల్:** రూ.61,960 నుంచి రూ.1,51,370.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, మెయిన్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.01.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.01.2024.
» **స్క్రీనింగ్ పరీక్ష తేది:** 13.04.2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

### యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్.. తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** ఎంఏ(జెండర్ స్టడీస్/ఉమెన్స్ స్టడీస్), నెట్/పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్ చిరునామా:** cwsd@uohyd.ac.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.01.2024.
» **వెబ్‌సైట్:** www.imu.edu.in

# ఎన్‌డీఏ, ఎన్ఏ త్రివిధ దళాల్లో.. కొలువు+కోర్సు

» ఎన్‌డీఏ ఎన్ఏ(1)-2024 నోటిఫికేషన్ వెల్లడి
» మొత్తం నాలుగు విభాగాల్లో 400 ఖాళీల భర్తీ
» రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ప్రక్రియలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

**ఇంటర్మీడియెట్‌తోనే త్రివిధ దళా(ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ)ల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కొలువు. దాంతోపాటే బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టా కూడా సొంతం చేసుకోవచ్చు. అందుకు చేయాల్సిందల్లా ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించడమే!! యూపీఎస్సీ తాజాగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ (ఎన్‌డీఏ, ఎన్ఏ) ఎగ్జామినేషన్ (1)-2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా 400 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ ఎన్ఏ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు...**



దేశానికి సేవ చేస్తున్నామనే సంతృప్తి.. సమాజంలో ప్రత్యేక గుర్తింపు.. అన్నింటికీ మించి ఎంతో విలువైన డిగ్రీ పట్టా. వీటన్నింటినీ ఒకే సమయంలో పొందే అవకాశం ఎన్‌డీఏ, ఎన్ఏ ద్వారా లభిస్తుంది. ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే.. భవిష్యత్తులో ఆయా దళాలకు ఉన్నతాధికారుల స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది అంటున్నారు నిపుణులు. అవివాహిత పురుష, మహిళ అభ్యర్థులు అర్హులు.

#### మొత్తం 400 పోస్టులు

తాజాగా యూపీఎస్సీ విడుదల చేసిన ఎన్‌డీఏ, ఎన్ఏ-(1)-2024 నోటిఫికేషన్ ద్వారా త్రివిధ దళాలకు చెందిన నాలుగు విభాగాల్లో నాలుగు వందల ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇందులో ఇండియన్ ఆర్మీ-208, ఇండియన్ నేవీ-42, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్-92 (ఫ్లయింగ్ విభాగం), 18 (గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ విభాగం), 10(గ్రౌండ్ డ్యూటీ నాన్-టెక్నికల్), నేవల్ అకాడమీ (10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్) - 30 ఖాళీలు ఉన్నాయి.

#### అర్హతలు

● **ఆర్మీ వింగ్:** ఏ గ్రూప్‌లోనైనా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
● **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024, డిసెంబర్ 24 నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.
● **వయసు:** జూలై 2, 2005 - జూలై 1, 2008 మధ్య జన్మించి ఉండాలి.

#### రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎన్‌డీఏ, ఎన్ఏకు అభ్యర్థుల ఖరారుకు రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ. తొలిదశలో యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్ఏ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో ప్రతిభ ఆధారంగా.. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించిన వారికి తదుపరి దశలో సదరు విభాగాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఎస్ఎస్‌బీల ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి. వీటిలోనూ ఉత్తీర్ణత సాధిస్తే.. త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కొలువు ఖరారవుతుంది.

#### రాత పరీక్ష ఇలా

ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను రెండు పేపర్లలో మొత్తం 900 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్ 1 మ్యాథమెటిక్స్‌పై 300 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్ష సమయం రెండున్నర గంటలు. అదేవిధంగా పేపర్ 2 జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్ష సమయం రెండున్నర గంటలు. పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పేపర్-2 జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో పార్ట్-ఎ పేరుతో 200 మార్కులకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ విభాగం ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగం పేరుతో 400 మార్కులకు పార్ట్-బిని నిర్వహిస్తారు.

#### ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

తొలిదశ రాత పరీక్షలో విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి మలిదశలో ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో స్టేజ్ 1, స్టేజ్ 2 ఉంటాయి. స్టేజ్ 1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్, డిస్క్రిప్షన్ టెస్ట్‌లు జరుగుతాయి. వీటిల్లో చూపిన ప్రతిభ ఆధారంగా స్టేజ్ 2కు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. స్టేజ్ 2లో ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, సైకాలజీ టెస్టులు, కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఎయిర్‌ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఎస్ఎస్‌బీ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లోనూ విజయం సాధించాల్సి ఉంటుంది.

#### శిక్షణతోపాటు, డిగ్రీ సర్టిఫికెట్

రెండు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణనిస్తారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ పుణెలో, నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణనిస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టాలు అందజేస్తారు. అంటే.. ఒకే సమయంలో కొలువు, ఉన్నత విద్య రెండింటినీ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

#### 10+2 క్యాడెట్ ఎంట్రీ.. ప్రత్యేక శిక్షణ

నేవల్ అకాడమీ 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి నేవల్ అకాడమీ (ఎజిమల)లో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత వీరికి అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ కూడా అందజేస్తారు.

#### స్టయిఫండ్ సదుపాయం

ఎన్‌డీఏ, ఎన్ఏ విజేతలకు శిక్షణ సమయంలోనే పే లెవల్-10కు సమానమైన రూ.56,100 స్టైపెండ్‌గా లభిస్తుంది. ఫీల్డ్ ట్రైనింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి రూ.56,100- 1,77,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. ప్రారంభంలో ఆర్మీ విభాగంలో లెఫ్టినెంట్, నేవీ విభాగంలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ కేడర్‌తో కెరీర్ ప్రారంభమవుతుంది.

#### రాత పరీక్షలో రాణించేలా

పేపర్-1లో మంచి మార్కులు సాధించాలంటే.. అల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ప్రాక్టీస్ టెస్ట్‌లు, మాక్ టెస్టులు రాయడం కూడా మేలు చేస్తుంది. బేసిక్ ప్రిన్సిపుల్స్, వివిధ సిద్ధాంతాలు, సూత్రాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

#### పేపర్-2 రెండు విభాగాలుగా

పేపర్-2ను రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-ఎలో ఇంగ్లిష్ 200 మార్కులకు ఉంటుంది. పార్ట్-బి 400 మార్కులకు జరుగుతుంది. ఇందులో ఫిజిక్స్; కెమిస్ట్రీ; జనరల్ సైన్స్; హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం; జాగ్రఫీ; కరెంట్ ఈవెంట్స్ నుంచి ప్రశ్నలడుగుతారు. పేపర్-2లో విజయానికి బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్; వొకాబ్యులరీ రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర-భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌లను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. పాత ప్రశ్న పత్రాలు, ఆయా విభాగాలకు ఇచ్చిన వెయిటేజీ ఆధారంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.

#### ముఖ్య సమాచారం

● **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
● **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జనవరి 9
● **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ తేదీలు:** 2024 జనవరి 10 - 16
● ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష తేదీ: 2024, ఏప్రిల్ 21
● **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
● **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** upsconline.nic.in
● **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 170 | 47 |
| 72,240 | 21,731 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 15,011 | ▽ | 84 |
| డోజోన్స్ | 37,690 | ▽ | 21 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,773 | △ | 10 |
| డాక్స్ | 16,752 | △ | 50 |
| షాంఘై | 2,975 | ▽ | 20 |
| నికాయ్ | 33,664 | ▽ | 50 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 82.68 | 83.92 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 105.43 | 107.96 |
| € | యూరో | ఒకటి | 90.99 | 93.99 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 57.65 | 59.05 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 56.01 | 58.37 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.69 | 63.49 |
| SAR | సౌదీ రియాల్ | పదింటికి | 21.23 | 22.81 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | పదింటికి | 21.69 | 23.55 |
| ¥ | చైనా యువాన్ | పదింటికి | 10.57 | 12.56 |

# సరైన ఆచరణతోనే సంపద సృష్టి!




సంపద సృష్టికర్తల్లో ఎవరి జీవితాన్ని పరిశీలించి చూసినా.. సమయానికి ఎంతో ప్రాధాన్యత కనిపిస్తుంది. ప్రణాళిక, ఆచరణ, క్రమశిక్షణ కనిపిస్తాయి. సంపద సృష్టించాలంటే కాలం విలువ తెలిసి ఉండాలి. ఇవాళ కాకపోతే రేపు, ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాది ఇలాంటి ధోరణి అస్సలు పనికిరాదు. దీనివల్ల కేలండర్‌లో సంవత్సరాలు మారుతుంటాయే కానీ, ఆశించిన ఫలితాలు కానరావు. కొత్త సంవత్సరం తనకు అనుకూలంగా ఉండాలని, అనుకున్నవి సాధించాలని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ, ఆచరణ లోపంతో దానికి దూరంగా ఉండిపోతుంటారు. అన్నీ ఒకేసారి సాధించేద్దామని అనుకుంటే, ఫలితాలు ఆలస్యం అవుతాయి. అందుకుని ప్రణాళిక మేరకు అడుగులు వేయాలి. నూతన సంవత్సరంలో ఏం సాధించాలనుకుంటారో, అవి వాస్తవికంగా ఉండాలి. అప్పుడే చక్కని ఫలితాలు కనిపిస్తాయి. ఏడాది కాలానికి కార్యాచరణ ప్రణాళిక అంటే, అందుకు తగినంత సమయం కేటాయించాలి. సంపద సృష్టించాలనే ఆకాంక్ష కలిగిన వారు కొత్త సంవత్సరంలో ఆ దిశగా అమల్లో పెట్టాల్సిన ఆచరణ ఎలా ఉండాలో నిపుణులు తెలియజేస్తున్నారు.




## మనీ ఒక్కటేనా..?

అందరికీ ధనం కావాల్సిందే. అందులో సందేహం లేదు. కానీ, మనిషి ఎప్పుడూ డబ్బు చుట్టూ పరుగెత్తడం సరైనది అనిపించుకోదు. తండ్రి లేదా తల్లి కావచ్చు. కుమారుడు లేదా కుమార్తె కావచ్చు. జీవిత భాగస్వామి, స్నేహితులు, సహోద్యోగులు, శ్రేయోభిలాషులు.. ఇలా మన చుట్టూ పెద్ద ప్రపంచమే ఉంది. దాన్ని కూడా పట్టించుకోవాలి. సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపూ అవసరమే. మనీ లైఫ్‌తోపాటు ఇతరత్రా అన్నీ మేళవించినప్పుడే నిజమైన ఆనందం లభిస్తుంది. అస్తమానం డబ్బు గురించే ఆలోచిస్తూ, వేదన చెందుతుంటే అదొక వైరల్ వ్యాధిగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే జీవితంలో అన్నింటికీ సమతుల్యత అవసరం.

## సంపద అంటే..?

సంపద అంటే డబ్బు, బంగారం, పెట్టుబడులు, ప్రాపర్టీలే కాదు. మంచి ఆరోగ్యం కూడా గొప్ప సంపదే అవుతుంది. సంపద కోసం ఆరోగ్యం పాడు చేసుకుంటే, ఆ తర్వాత అదే సంపదతో



ఆరోగ్యం కొనుక్కుందామంటే సాధ్యపడకపోవచ్చు. ఆరోగ్యంగా ఉంటేనే సంపద సృష్టి కోసం సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించగలరు. తద్వారా మరింత సంపదను సమకూర్చుకోగలరు. అనారోగ్యకర అలవాట్లను విడిచి పెట్టాలి. ఆరోగ్యకరమైన, పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. యోగ, మెడిటేషన్, వ్యాయామాలు వంటి వాటికి రోజూ కొంత సమయం కేటాయించాలి.

## ఆదాయం.. వ్యయం..

ఆదాయం కంటే వ్యయానికి ఆర్థిక శాస్త్రంలో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. చాలా మంది ఎలాంటి ప్రణాళిక లేకుండా ఖర్చు చేస్తుంటారు. మంచి డిస్కౌంట్ ఆఫర్లు కనిపించిన వెంటనే కొనుగోలు చేస్తుంటారు. క్రెడిట్ కార్డ్‌పై చాలా తక్కువకే వస్తుందని కొనుగోలు చేస్తుంటారు. ఇవన్నీ విక్రయాలు పెంచుకోవడానికి కంపెనీలు చేసే మార్కెటింగ్ వ్యూహాలు. వాటి ఆకర్షణలో పడకుండా చూసుకోవాలి. సంపద సృష్టించాలనే పట్టుదల ఉన్న వారు మొదట వ్యయాలపై అదుపు సాధించాలి. వస్తున్న ఆదాయంలో వ్యయాలను 60–80 శాతానికి మించకుండా అదుపు చేసుకోవాలి. ఎంత సంపాదించామన్నది కాకుండా, ఎంత పొదుపు చేశామనే తత్వంతో ముందుకు సాగాలి. అవసరాలకే కొనుగోళ్లు పరిమితం కావాలి. అంటే ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజు, కిరాణా, పాలు, కూరగాయలు, యుటిలిటీ బిల్లులు ఇవన్నీ అవసరాలు. రెస్టారెంట్‌లో తినడం, సినిమాలు, టూర్లు ఇవన్నీ కోరికలు. వెసులుబాటు ఉంటేనే కోరికలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి. అవసరాలు, కోరికలకు కేటాయింపుల తర్వాత కూడా ఆదాయంలో 40 శాతాన్ని పెట్టుబడిగా మళ్లించారంటే సంపద సృష్టి అనుకున్నదానికంటే ముందే సాధ్యపడుతుంది.

## దీర్ఘ ప్రయాణం

సంపద సృష్టించడం అన్నది ఇన్‌స్టంట్ నూడుల్స్ చేసుకున్నంత ఈజీ కాదు. అదొక దీర్ఘకాలిక పరుగు. దశాబ్దాల పాటు స్థిరమైన పెట్టుబడులతో సాగిపోయేది. ప్రణాళిక మేరకు అడుగులు వేసేది. కొత్త సంవత్సరంలో సంపద సృష్టికి బీజం వేసుకోవాలే కానీ, సంపద సృష్టిని ఏడాదిలోనే సాధించేయాలంటే అది ఆచరణసాధ్యం కాదు. క్రమం తప్పకుండా ఆదాయం నుంచి పొదుపు చేస్తూ, ఆ పొదుపును ఏటా పెంచుకుంటూ, మెరుగైన రాబడినిచ్చే సాధనాల్లోకి పెట్టుబడిగా మళ్లిస్తూ సాగిపోవాల్సిన సుదీర్ఘ ప్రయాణం. కనుక షార్ట్ కట్స్, ఇన్‌స్టంట్స్ అంటూ ఇందులో దారులు వెతుక్కోవడం వల్ల ఫలితం ఉండదు. ఎంత వీలైతే అంత మొత్తంతో మొదట పెట్టుబడిని ఆరంభించాలి. దాన్ని కొనసాగించాలి.



## సరైన సాధనాలు

సంపాదనలో పొదుపుతోనే ఆగిపోకూడదు. ఆ పొదుపు మదుపుగా మారినప్పుడే సంపద సాధ్యపడుతుంది. ఈ మార్గంలో ఎంపిక చేసుకునే పెట్టుబడి సాధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్లు, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను పెట్టుబడి సాధనాలుగా చూడకూడదు. ద్రవ్యోల్బణం తరుగు తీసిన తర్వాత ఈ సాధనాల్లో మిగిలేదీ ఏమీ ఉండదు. రాబడితోపాటు, అవసరమైనప్పుడు నగదుగా మార్చుకునే లిక్విడిటీ కూడా మెరుగ్గా ఉండాలి. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్ మేలైనవి. వీటితోపాటు వెసులుబాటును బట్టి రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లలోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీలతోపాటు, రియల్ ఎస్టేట్, బంగారం దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని తెచ్చి పెట్టినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పెట్టుబడుల్లో స్థిరత్వం కోసం కొంత డెట్ సాధనాలకూ చోటు ఇవ్వొచ్చు. గ్యారంటీడ్ రాబడి అనే ఉత్పత్తుల ఆకర్షణలో పడొద్దు. పన్ను ఆదా కోరుకునే వారు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల కోసం ఈఎల్‌ఎస్ఎస్, ఎన్‌పీఎస్ వంటి పథకాలను పరిశీలించొచ్చు. పిల్లల స్కూల్ ట్యూషన్ ఫీజులు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, రుణంపై ఇల్లు కొనుగోలు చేస్తే, అసలు, వడ్డీపైనా పన్ను మినహాయింపు ప్రయోజనాలను పొందొచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో వేలాది పథకాలున్నాయి. నిపుణుల సాయంతో నాలుగైదు పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. ఫండ్స్‌లో ఎన్ఎఫ్‌వోల కంటే ట్రాక్ రికార్డు ఉన్న పథకాలను ఆశ్రయించడమే మెరుగైనది అవుతుంది. లిస్టింగ్ రోజున లాభాల కాంక్షతో ఐపీవోను ఎంపిక చేసుకోవద్దు. మంచి కంపెనీ, ఆకర్షణీయమైన వ్యాల్యూషన్లలో వస్తే దీర్ఘకాలానికి ఐపీవో మార్గంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. అప్పుడు లిస్టింగ్‌లో లాభం వస్తే విక్రయించుకోవచ్చు. రాకపోతే పెట్టుబడిని కొనసాగించుకోవచ్చు.

## ఇతరులను అనుసరించడం

ట్రేడింగ్‌తో రోజులో రూ.10వేలు, రూ.లక్ష సంపాదించుకోవచ్చనే ప్రకటనలు చూసి మోసపోవద్దు. తాము నేర్పించే స్ట్రాటజీతో ట్రేడింగ్‌లో రూ.లక్షలు సంపాదించొచ్చనే సోషల్ మీడియా ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. స్వీయ అధ్యయనంతో పెట్టుబడి సాధనాలను అర్థం చేసుకోవాలి. లేదంటే ఫైనాన్షియల్ ప్లానర్లు లేదా అడ్వైజర్ల సాయం తీసుకోవాలి. సంపన్న ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోని అనుకరించడం సరికాదు.తోటి ఇన్వెస్టర్ల సలహా, సూచనలను గుడ్డిగా అనుసరించొద్దు. ప్రతి ఇన్వెస్టర్ రిస్క్, ఆకాంక్షలు వేర్వేరుగా ఉంటాయి.




## ఆర్థిక రక్షణ


మెరుగైన కవరేజీతో కుటుంబం అంతటికీ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మొదట చేయాల్సిన పని. దీనివల్ల ఎలాంటి పరిస్థితులు ఎదురైనా, పొదుపు, పెట్టుబడులకు విఘాతం కలగకుండా, హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీతో గట్టెక్కొచ్చు. నలుగురు సభ్యుల కుటుంబానికి కనీసం రూ.10 లక్షల కవరేజీ, అపరిమిత రీస్టోరేషన్ సదుపాయంతో తీసుకోవాలి. ఇక అనుకోనిది జరిగితే కుటుంబం ఆర్థిక కష్టాల పాలు కాకుండా ఉండేందుకు, మెరుగైన కవరేజీతో టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కూడా తీసుకోవాలి. కనీసం 20 ఏళ్ల కుటుంబ అవసరాలను తీర్చే స్థాయిలో కవరేజీ ఉండాలి. ప్రమాదం కారణంగా ఏర్పడే నష్టాన్ని భర్తీ చేసే కవరేజీ కూడా ఉండాలి. ఇంటికి, ఇంట్లోని విలువైన వాటికి బీమా ప్లాన్ తీసుకోవాలి. ఇక అన్నింటికంటే ముఖ్యంగా కనీసం ఆరు నెలల అవసరాలను తీర్చే అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి.

## రాబడి ఒక్కటే కాదు..

పెట్టుబడి కోసం ఎంపిక చేసుకునే సాధనం విషయంలో రాబడి ఒక్కటే ప్రామాణికం కాకూడదు. సంబంధిత ఉత్పత్తిలో ఉండే రిస్క్‌ను కూడా మదింపు వేయాలి. తమ రిస్క్ సామర్థ్యానికి తగినట్టుగానే ఉందా? అని విశ్లేషించుకోవాలి. ఉదాహరణకు 2020 మార్చి కరోనా విపత్తు సమయంలో ఈక్విటీ మార్కెట్ 40 శాతానికి పైగా పతనమైంది. విడిగా కొన్ని స్టాక్స్ 80–90 శాతం వరకు పడిపోయాయి. అలాంటి సమయాల్లో పెట్టుబడుల విలువ గణనీయంగా పడిపోతుంది. ఆ నష్టాన్ని చూసి భయపడిపోకూడదు. ఈక్విటీలకు ఆటుపోట్లు సహజం. కాల వ్యవధి అనేది సాధనాలను ఎంపిక చేసుకోవడానికి కీలకం. ఆటుపోట్లు ఎదురైనా, ధైర్యంగా కొనసాగించే వారే వీటిని ఎంపిక చేసుకోవాలి. ఈక్విటీల్లో అస్థిరతలు ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో మెరుగైన రాబడి వస్తుంది. రిస్క్ వద్దనుకుంటే, రాబడిలో రాజీపడి డెట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.

## తప్పులకు దూరంగా..

పెట్టుబడుల్లో వీలైనంత వరకు తప్పులకు చోటు లేకుండా చూసుకోవాలి. అయినా కానీ తప్పులు జరగవన్న గ్యారంటీ ఏమీ ఉండదు. ఫండ్ మేనేజర్లు సైతం తమ ప్రయాణంలో తప్పులు చేస్తుంటారు. కాకపోతే చేసిన తప్పును వేగంగా గుర్తించి, దాన్ని సరిదిద్దుకోవడం తెలియాలి. ఫం



డ్స్‌లో మానవ తప్పిదాలకు చోటు లేకుండా ఉండాలంటే ఇండెక్స్ ఫండ్స్ ఉత్తమమైనవి. నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారు ఎంతో ఆచితూచి వ్యవహరించాలి. మెరుగైన స్ట్రాటజీ, చక్కని అవగాహన, స్థూల ఆర్థిక అంశాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రభుత్వ, ఆర్‌బీఐ పాలసీలు, కరెన్సీ మారకం తదితర ఎన్నో అంశాలను వేగంగా అర్థం చేసుకునే నైపుణ్యాలు అవసరం. అంత సమయం లేకపోతే ఆ భారం ఫండ్ మేనేజర్లపై వేయాలి.

## లక్ష్యం.. ప్రణాళిక

ప్రతి లక్ష్యానికీ విడిగా ప్రణాళిక అవసరం. సొంతిల్లు, కారు, రిటైర్మెంట్, పిల్లల విద్య, వివాహం ఇవన్నీ అందరికీ ఉండే ముఖ్యమైన భవిష్యత్ లక్ష్యాలు. తమ ఆదాయం నుంచి విడిగా ఒక్కో దానికి ఎంత చొప్పున కేటాయిస్తే, వాటిని చేరుకోవచ్చన్న దానికి స్పష్టత ఉండాలి. అవసరమైతే ఈ విషయంలో నిపుణుల సాయం తీసుకోవాలి.

## రుణాలు-చెల్లింపులు

తప్పనిసరి అయితేనే రుణం తీసుకోవాలి. తీసుకుంటే దాన్ని తీర్చివేయడానికే మొదట ప్రాధాన్యం ఇవ్వాలి. రుణ చెల్లింపుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వైఫల్యం లేకుండా చూసుకోవాలి.

## నామినేషన్

చివరిగా అన్ని ఆర్థిక సాధనాలకూ నామినేషన్ ఇవ్వడం తప్పనిసరి. బ్యాంక్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, బీమా పథకాలు, డీమ్యాట్ ఖాతాలు, ఈపీఎఫ్ ఇలా ప్రతి సాధనానికీ నామినేషన్ లేకపోతే వెంటనే నమోదు చేయాలి.

## మార్గమిది...

**లక్ష్యాల్లో వాస్తవికత:** జనవరి 1 నుంచే రోజూ 5 కిలోమీటర్ల నడక లేదా పరుగు ఆచరణలో పెట్టాలని కోరుకోవచ్చు. మొదటి రోజే 5 కిలోమీటర్లు సాధ్యం కానప్పుడు ఒక కిలోమీటర్‌తో ఆరంభిస్తే, క్రమంగా కొన్ని రోజుల్లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. సామర్థ్యాలకు తగినట్టుగా కార్యాచరణ అవసరం. ఎంత వీలైతే, అంత మొత్తంతో ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించాలి.


**స్థిరత్వం:** పెట్టుబడుల ప్రపంచంలో ప్రేరణ కంటే స్థిరత్వానికే ప్రాముఖ్యం ఇస్తారు. ప్రేరణ అనేది కొన్ని రోజులు, నెలల పాటే ఉండొచ్చు. కానీ, స్థిరత్వం అన్నది విజయానికి కీలకం .

**ఇన్‌స్టంట్ సక్సెస్:** స్వల్ప కాలంలో సంపద పోగేయాలన్నట్టుగా కొందరు ఇన్వెస్టర్ల ధోరణి ఉంటుంది. కానీ, జీవితం అందరికీ ఒకే విధంగా నడవదు. ఫలితాలకు తగినంత వ్యవధి ఇచ్చినప్పుడే సాధన సులభమవుతుంది. ఇక్కడ ఓపిక, క్రమశిక్షణ, అంకితభావం కీలకం అవుతాయి.

**కృషి:** 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులు అవుతారు'అని ఓ సినీ కవి చెప్పినట్టు.. చేసుకున్న తీర్మానాలను విజయవంతంగా చేరుకోవడం కంటే కూడా, దాన్ని సాధించడానికి మీరు చేసిన ప్రయత్నాలు, కృషి ఇక్కడ కీలకం అవుతాయి. ప్రతి నెలా ఆదాయంలో 50 శాతాన్ని ఇన్వెస్ట్ చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ, అది సాధ్యం కావడం లేదని దాన్ని పక్కన పెట్టేయడం విజయానికి చేరువ చేయదు. కనీసం 20–30–40 శాతం మేర అయినా ఆదాతో మొదలుపెట్టి, ఆ తర్వాత దాన్ని మరింత పెంచుకోవచ్చు.

**ఆర్థిక అంశాలపై పట్టు:** ఆర్థికంగా విజయం సాధించాలని కోరుకునే వారికి అందుకు సంబంధించి ప్రాథమిక అంశాలు తప్పకుండా తెలిసి ఉండాలి. ఆర్థిక అంశాలను అర్థం చేసుకోవడం, వాటిని అమలు చేయడం, వ్యక్తిగత ఆర్థిక అంశాల నిర్వహణ, బడ్జెట్, పొదుపు, పెట్టుబడులు, రుణాలు వీటన్నింటి గురించి తెలియాలి. ఆర్థిక, పెట్టుబడి సూత్రాలపై అవగాహన ఉండాలి. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, ఈల్డ్స్ తెలిసి ఉండాలి.

# అత్యవసర నిధి ఎక్కడ..?



**Q & A**

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**నేను అధిక పన్ను శ్లాబులోకి వస్తాను. కనుక ఎఫ్‌డీలపై రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. కనుక నేను అత్యవసర నిధిని బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌లో కాకుండా డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా..?**

– కరణ్

మీ అత్యవసర నిధిలో కొంత భాగాన్ని డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం పన్ను ప్రయోజనం కోణంలో మెరుగైన రాబడులకు మార్గం అవుతుంది. అత్యవసర నిధి ఎప్పుడూ మూడు భాగాలుగా వర్గీకరించుకుని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మొదటి భాగం అత్యవసర నిధిని నగదు రూపంలోనే ఉంచుకోవాలి. ఇంట్లో లేదంటే బ్యాంక్ లాకర్‌లో ఉంచుకోవచ్చు. రెండో భాగాన్ని బ్యాంకు ఖాతా లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా వెంటనే నగదుగా మార్చుకోగలిగిన మరొక సాధనంలో అయినా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడో భాగాన్ని లిక్విడ్ ఫండ్ లేదా అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల రాబడులు సానుకూలంగా ఉంటాయి. పన్ను పరంగానూ అనుకూలంగా ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల మాదిరిగా కాకుండా.. డెట్ ఫండ్స్‌లో అయితే పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను వర్తిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే సమకూరే వడ్డీ ఆదాయం ఏటా పన్ను చెల్లింపుదారు ఆదాయానికి కలుస్తుంది. వారి శ్లాబు రేటు ప్రకారం పన్ను ఆధారపడి ఉంటుంది. అధిక పన్ను శ్లాబు పరిధిలోకి వచ్చే వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో వచ్చే ఆదాయంపై 30 శాతం పన్ను పడుతుంది. అదే విధంగా డెట్ ఫండ్స్‌లో రాబడులకూ ఇదే మాదిరి పన్ను వర్తిస్తుంది. 2023 ఏప్రిల్‌కు ముందు డెట్ ఫండ్స్‌లో దీర్ఘకాల రాబడికి (మూడేళ్లకు మించిన) పన్ను ప్రయోజనం ఉండేది. ద్రవ్యోల్బణం మినహాయించి, మిగిలిన రాబడిపైనే పన్ను చెల్లిస్తే సరిపోయేది. కానీ, ఇప్పుడు డెట్ ఫండ్స్‌లో కాల వ్యవధితో సంబంధం లేకుండా పెట్టుబడులపై వచ్చిన రాబడిని తమ వార్షిక ఆదాయంలో భాగంగా చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక డెట్ ఫండ్స్‌లో పెట్టుబడితో వచ్చే పన్ను ప్రయోజనం ఏమీ లేదు. కాకపోతే, ఎఫ్‌డీలతో పోలిస్తే డెట్ ఫండ్స్ కాస్త మెరుగైన రాబడులను ఇస్తాయి. కానీ, డెట్ ఫండ్స్‌లో రాబడులకు హామీ ఉండదు. ఫిక్స్‌డ్ డిపాజిట్స్ మాదిరి పెట్టుబడులకు రక్షణ హామీ ఉండదు. అయినా కానీ, లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ తక్కువ రిస్క్ విభాగంలోకి వస్తాయి.

**మూడేళ్లలో రూ.10 లక్షలు సమకూర్చుకోవాలని అనుకుంటున్నాను. పెట్టుబడి మొత్తంలో 60 శాతాన్ని ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌కు, 40 శాతాన్ని లార్జ్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవచ్చా?**

– ఆదర్శ్ శ్రీవాస్తవ

రిస్క్ తీసుకోకూడని లక్ష్యం అయితే ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడేళ్ల కాలం అన్నది ఈక్విటీ పెట్టుబడులకు చాలదు. ఎందుకంటే అంత స్వల్పకాలంలో ఈక్విటీ మార్కెట్ తీరు ఎలా ఉంటుందన్నది ఎవరూ చెప్పలేరు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో మూడేళ్ల కాలం పాటు ఇన్వెస్ట్ చేసినా, నష్టపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎవరైనా ఒకరు ప్రతినెలా రూ.10,000 చొప్పున మూడేళ్లకాలంలో రూ.3.6 లక్షలను ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చూస్తూ వెళితే చివర్లో ఆ మొత్తం విలువ రూ.2.5 లక్షలుగానే ఉండొచ్చు. లేదంటే రూ.5 లక్షలుగా మారొచ్చు. పనితీరు స్వల్పకాలానికి ఏ విధంగా ఉంటుందన్నది అంచనా వేయడం సరికాదు. ఒకవేళ రిస్క్ తీసుకునే అవకాశం ఉండి, వచ్చే మూడేళ్లలో ఈక్విటీలు మంచి రాబడులను ఇస్తాయన్న నమ్మకం మీకు ఉంటే అప్పుడు మూడేళ్లకోసం అయినా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులు ఏవైనా కనీసం ఐదేళ్ల పాటు వేచి చూడగలనన్న సన్నద్ధతతో ఉండాలి.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| | |
|---|---|
| **1-1-2024** | |
| విశాఖ | 625–00 |
| చిత్తూరు | 608–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 580–00 |
| విజయవాడ | 580–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **31-12-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 576–00 |
| వరంగల్ | 578–00 |
| రిటైల్ ధర | 6.35 |

స్టాక్స్ వ్యూ

## జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా | జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 208 టార్గెట్: రూ. 255

**ఎందుకంటే:** మౌలిక సదుపాయాల రంగ సంస్థ పీఎన్‌పీ పోర్ట్ మారిటైమ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్(పీఎస్‌పీఎల్)లో మెజారిటీ వాటాను కొనుగోలు చేస్తున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇటీవల ప్రకటించింది. షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ నుంచి రూ. 270 కోట్ల నగదుకు కొనుగోలు చేస్తున్నట్లు తెలియజేసింది. మొత్తం రూ. 700 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో 50 శాతం వాటాతోపాటు 1 షేరుని సొంతం చేసుకోనుంది. 16.7 ఈవీ/ఇబిటాలో పీఎన్‌పీఎల్‌లో నియంత్రిత వాటాను తీసుకుంటున్నట్లు అంచనా. కంపెనీ అనుసరించే విలువ ఆధారిత కొనుగోళ్ల వ్యూహాలలో భాగంగానే తాజా కొనుగోలును సైతం చేపట్టింది. కంపెనీ ఇప్పటికే రెండు ఇతర కంపెనీల కొనుగోళ్లను ప్రకటించింది. 2023 అక్టోబర్‌లో కంపెనీ లిస్టయ్యాక ఫుజైరాలోని లిక్విడ్ టెర్మినల్, 2023 నవంబర్‌లో సీటీవో లైసెన్స్‌లను సొంతం చేసుకుంది. కాగా.. పీఎన్‌పీఎల్ పలు ప్రయోజనాలు కల్పించే(మల్టీపర్పస్) జెట్టీలను నిర్వహిస్తోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలోని పారిశ్రామిక ప్రాంతాల నుంచి రహదారులు, రైల్వేలతో అనుసంధానాలను కలిగి ఉంది. దీంతో జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు థర్డ్ పార్టీ వ్యాపార పరిమాణాన్ని పెంచుకునేందుకు వీలు చిక్కనుంది. పీఎన్‌పీఎల్.. విస్తరణ కార్యక్రమాలు చేపట్టేందుకు అనువైన భూమిని కలిగి ఉంది. వెరసి ప్రస్తుతమున్న 5 ఎంఎన్‌టీ వార్షిక సామర్థ్యాన్ని 19 ఎంఎన్‌టీకి విస్తరించేందుకు




వీలుంది. అంతేకాకుండా పీఎన్‌పీఎల్ కొనుగోలు కారణంగా సర్వీసులు అందని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడంతోపాటు.. థర్డ్ పార్టీ కార్గో పరిమాణాన్ని పెంచుకునేందుకు అవకాశం లభించనుంది.

## మ్యాక్స్ హెల్త్‌కేర్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 686 టార్గెట్: రూ. 780

**ఎందుకంటే:** సహారా ఇండియా మెడికల్ ఆసుపత్రిని కొనుగోలు చేస్తున్నట్లు ఆరోగ్య పరిరక్షణ రంగ కంపెనీ మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ తాజాగా పేర్కొంది. లక్నోలో 550 పడకలతో నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రిని రూ. 940 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో చేజిక్కించుకోనుంది. ఇక్కడగల మేడంటా, అపోలో హాస్పిటల్ల పనితీరును పరిగణనలోకి తీసుకున్నాక మ్యాక్స్ హెల్త్ రానున్న 12–18 నెలల కాలంలో 30 శాతం నిర్వహణ లాభం(ఇబిటా)ను సాధించగలదని అంచనా వేస్తున్నాం. వెరసి రానున్న 12 నెలల్లో ముందస్తు ఈవీ, ఇబిటాలను 14 రెట్లుగా మదింపు చేశాం. ఇందుకు ఆదాయంలో 12 శాతం వృద్ధి, 30 శాతం స్థాయిలో ఇబిటా మార్జిన్లు దోహదం చేయగలవని అంచనా. లిస్టెడ్ విభాగంలోని ఇతర ఆసుపత్రులతో పోలిస్తే ఈ గణాంకాలు మ్యాక్స్ హెల్త్‌కేర్‌ను ఆకర్షణీయంగా నిలుపుతున్నాయి. సుమారు రూ. 150–200 కోట్ల అదనపు పెట్టుబడుల ద్వారా ప్రస్తుతం నిర్వహిస్తున్న 250 పడకలను 550కు పెంచుకునే అవకాశముంది. తాజా కొనుగోలు నేపథ్యంలో రానున్న రెండేళ్లకు కంపెనీ షేరువారీ ఆర్జనలో మరో 3 శాతం మెరుగుపడనున్నట్లు భావిస్తున్నాం. వివిధ విభాగాలవారీగా(ఎస్‌వోటీపీ ప్రాతపదికన) మ్యాక్స్ హెల్త్ ఎంటర్‌ప్రైజ్ విలువను మదింపు చేసి రూ. 780 టార్గెట్ ధరను నిర్ణయించాం. ఇందుకు ఆసుపత్రుల బిజినెస్‌కు 26 రెట్లు ఈవీ, మ్యాక్స్‌ల్యాబ్‌కు 18రెట్లు ఈవీ, మ్యాక్స్ @హోమ్ బిజినెస్‌కు 4 రెట్లుఈవీ చొప్పున అంచనా వేశాం. తాజా కొనుగోలుతో లక్నో చుట్టుప్రక్కల జిల్లాలలో విస్తరణ అవ




కాశాలు, కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైనంత భూమి సదుపాయం మ్యాక్స్‌కు లభించనున్నాయి. వెరసి ఇకపై మరింత వృద్ధికి వీలు చిక్కనుంది.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

# నీటినిల్వలో అగ్రగామి ‘కృష్ణా’

- రెండోస్థానంలో గంగ.. మూడోస్థానంలో గోదావరి
- తొమ్మిదోస్థానంలో పెన్నానది
- బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలే



గంగా, గోదావరి కన్నా మిన్న..

**సాక్షి, అమరావతి:** దేశంలో అత్యధిక నీటినిల్వ సామర్థ్యం గల జలాశయాలున్న నదుల్లో కృష్ణానది అగ్రగామిగా నిలిచింది. అతి పెద్ద నది అయిన గంగ, రెండో అతి పెద్ద నది అయిన గోదావరి కన్నా నీటినిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాల్లో అగ్రగామిగా కృష్ణానది కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డుల్లోకి ఎక్కింది. దేశంలో హిమాలయ, ద్వీపకల్ప నదులతోపాటు అన్ని నదీపరివాహక ప్రాంతాల్లో (బేసిన్‌లలో) నిర్మాణం పూర్తయిన జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 9,105.92 టీఎంసీలు. ఇందులో 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లతో కృష్ణానది ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలు కావడం గమనార్హం. అంటే.. దేశంలో అన్ని బేసిన్లలోని రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో కృష్ణా బేసిన్ రిజర్వాయర్ల సామర్థ్యం 19.65 శాతం కావడం గమనార్హం.

హిమాలయ పర్వతాల్లో హిమానీనదాల్లో జన్మించి దేశంలో ప్రవహించే గంగానది అతి పెద్దది. గంగా బేసిన్‌లో ఉన్న జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 1,718.91 టీఎంసీలు. పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద జన్మించి ద్వీపకల్పంలో ప్రవహించే గోదావరి రెండో అతి పెద్ద నది. ఈ బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 1,237.61 టీఎంసీలు. వీటిని పరిశీలిస్తే.. నీటినిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లలో గంగ, గోదావరి కంటే కృష్ణానదే మిన్న అని స్పష్టమవుతోంది. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో గంగ, గోదావరి రెండు, మూడుస్థానాల్లో నిలవగా.. దేశంలో పశ్చిమం వైపు ప్రవహించే నర్మదానది నాలుగోస్థానంలో నిలిచింది. ఇక దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే వర్షఛాయ ప్రాంతంలో పుట్టి, ప్రవహించే పెన్నానది బేసిన్‌లో 239.59 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లున్నాయి. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో పెన్నా బేసిన్ దేశంలో తొమ్మిదోస్థానంలో నిలవడం గమనార్హం. హిమాలయ నది అయిన బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలు మాత్రమే.

**దేశంలో ప్రధాన నదీపరివాహక ప్రాంతాల్లోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం**

| నదీపరివాహక ప్రాంతం | రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో) |
|---|---|
| 1. కృష్ణ | 1,788.99 |
| 2. గంగ | 1,718.91 |
| 3. గోదావరి | 1,237.61 |
| 4. నర్మద | 770.54 |
| 5. సింధు | 572.99 |
| 6. మహానది | 461.45 |
| 7. తాపి | 322.71 |
| 8. కావేరి | 320.81 |
| 9. పెన్న | 239.59 |
| 10. మహి | 177.20 |
| 11. బ్రహ్మపుత్ర | 88.65 |

# సైసై జోడెడ్ల బండి..

- రసవత్తరంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు
- సందడిగా రంగంపేట మండల పరిసరాలు

**రంగంపేట:** జోడెడ్ల బండ్లు సై సై అంటూ ముందుకు కదిలాయి.. నువ్వా నేనా అనేట్టు పరుగెత్తాయి.. తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు గ్రామ సమీపంలోని గన్ని వ్యవసాయ క్షేత్రం వద్ద ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఇందులో విజేతలకు రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివంగత ఆదర్శ రైతు గన్ని సత్యనారాయణమూర్తి స్మారకార్థం ఆయన కుమారుడు, రాజానగరం జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారంతో కూటి కోటేశ్వరరావు, బొప్పన బ్రహ్మాజీరావుల నిర్వహణలో ఈ పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 71 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా, సీనియర్స్ విభాగంలో 1,600 మీటర్లలో 14 జతలు, జూనియర్స్ విభాగంలో వెయ్యి మీటర్లలో 57 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలతో వడిశలేరు నుంచి రంగంపేట వరకూ ఏడీబీ రోడ్డు జన సందోహంగా మారింది. గట్టి పోలీసు బందోబస్తు నడుమ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోటీలు ప్రశాంతంగా పోటీలు నిర్వహించారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి, జనసేన నాయకుడు బత్తుల రామకృష్ణ పోటీలను తిలకించారు.

**సంప్రదాయాలను పరిరక్షిద్దాం**

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. పాశ్చాత్య సంస్కృతి ముసుగులో యువత తప్పటడుగులు వేస్తున్న ప్రస్తుత కాలంలో మన గత వైభవానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎడ్లను తీసుకురావడం అభినందనీయమన్నారు. ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**జిల్లాలో ప్రత్యేక స్థానం**

గోదావరి జిల్లాలో ఎడ్ల బండ్ల పరుగు పోటీలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యంగా సంక్రాంతికి సంప్రదాయంగా ఈ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వీటి నిర్వహణకు జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారం అందించడం హర్షణీయమన్నారు. అదేవిధంగా గోదావరి జిల్లా వాసులకు జీఎస్ఎల్ వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు ఎనలేనివన్నారు. జిల్లాను క్యాన్సర్ రహితంగా చేసేందుకు వారి కృషి ప్రశంసనీయమన్నారు.

**రైతులను ప్రోత్సహించడానికే..**

అంతరించిపోతున్న ఎడ్ల పందేల సంస్కృతిని కాపాడడంలో భాగంగా రైతులకు పోటీల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. విజేతలకు లక్షలాది రూపాయలు బహుమతిగా అందిస్తున్నారని, అదేవిధంగా పోటీలకు వేలాది మంది ప్రజలు విచ్చేయడం బాగుందన్నారు. గన్ని సత్యనారాయణమూర్తి స్మారకార్థం ఈ పోటీలు నిర్వహించారన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఎడ్ల బండ్ల పోటీలు మరిన్ని నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పోటీలు తిలకించడానికి విచ్చేసిన ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలను జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సత్కరించారు. ఎండ్ల బండ్ల ప్రతిమలను బహూకరించారు.

**విజేతలు వీరే...**

సీనియర్స్ విభాగంలో 14 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతిని గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు గెలుచుకున్నాయి. ద్వితీయ బహుమతిని గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి, తృతీయ బహుమతిని నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్లు సాధించాయి. జూనియర్స్ విభాగంలో 57 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి మండపేటకు చెందిన వేగుళ్ల రామస్వామి, ద్వితీయ బహుమతి కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ, తృతీయ బహుమతి వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్లు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, ద్వితీయ, తృతీయ, అలాగే జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఎలక్ట్రికల్ బైక్‌లు, సీనియర్స్ విభాగంలో మరో ఐదుగురికి, జూనియర్స్ విభాగంలో మరో 5 మందికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. విజేతలకు ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

తెలంగాణ

# సైబర్ క్రైమ్ @5

- ఈ ఐదింటిపై జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు
- పోలీస్ వార్షిక నివేదికలో వెల్లడించిన అధికారులు

**సాక్షి, హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లు ప్రధానంగా ఐదు రకాల నేర పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది నమోదైన నేరాల్లో 16శాతం సైబర్ నేరాలే ఉన్నాయి. ఇటీవల తెలంగాణ పోలీస్ వార్షిక నివేదికలో ఈ వివరాలు పొందుపరించారు. జాతీయ స్థాయిలో నమోదవుతున్న సైబర్‌నేరాల్లో తెలంగాణలోనే 2.5 శాతం మేర ఉన్నాయి. ఈ సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతోంది. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సైబర్‌నేరగాళ్లవిగా గుర్తించిన మొత్తం 28,610 సిమ్‌కార్డులనుపోలీసులు బ్లాక్ చేశారు. సైబర్‌నేరగాళ్లకు సంబంధించిన 58446 క్రైం లింక్‌లను తెలంగాణ పోలీసులు ఇతర రాష్ట్రాల పోలీసులతో పంచుకున్నారు. దీంతో ఒకే తరహా మోసాలు పలు రాష్ట్రాల్లో చేస్తున్న సైబర్‌నేరగాళ్ల గుర్తింపులో ఇది కీలకంగా మారింది.

**ఫెడ్‌ఎక్స్ కొరియర్**

సైబర్‌నేరగాళ్లు ఫెడ్‌ఎక్స్ ఉద్యోగుల పేరిట, పోలీసులు, కస్టమ్స్ అధికారుల పేరిట ముందుగా ఫేక్ ఫోన్‌కాల్స్ చేస్తారు. మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్, ఇతర అనుమతి లేని పదార్థాలు ఉన్నాయని, మీపై కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బు ఇవ్వాలని అమాయకులను డిమాండ్ చేస్తారు. ఇలాంటి ఫేక్‌కాల్స్‌కు స్పందించకూడదు. మెసేజ్‌లలో ఉండే లింక్‌లపై కూడా క్లిక్ చేయవద్దు.

**అడ్వర్టయిజ్‌మెంట్ పోర్టల్**

ఆన్‌లైన్‌లో పలు రకాల వస్తువుల సేల్స్, ఆఫర్ల పేరిట ఇచ్చే యాడ్స్‌లో మోసపూరితమైనవి ఉంటాయన్నది గ్రహించాలి. ప్రముఖ ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌లను ప్రస్తావించి సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలు చేస్తున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే వివరాలు తెలుసుకోవాలి. మోసపూరిత లింక్‌లపై క్లిక్ చేయవద్దు.

**బిజినెస్‌లో పెట్టుబడుల పేరిట**

తక్కువ పెట్టుబడి, అతి తక్కువ సమయంలోనే అత్యధిక లాభాలు అని ఊదరగొడుతున్నారంటే అది మోసపూరితమైనదే అని అనుమానించాలి. అసాధారణమైన హామీలు ఇస్తున్నారంటే వెంటనే వివరాలు తప్పక పరిశీలించాలి. ఎక్కువగా రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు, క్రిప్టోకరెన్సీ సంబంధిత పెట్టుబడులు, పిరమిడ్ స్కీంలు, మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు ఈ తరహావే.

**ఆన్‌లైన్ లోన్లు**

ఆర్థిక అవసరాలే బలహీనతగా ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే ఆన్‌లైన్‌లో రుణాలు ఇస్తామంటూ మోసం చేస్తారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలు తీసుకొని ఆర్థిక మోసాలు ఒక తరహావి అయితే, ఆన్‌లైన్ యాప్‌లలో రుణాలు ఇచ్చి తర్వాత అత్యధిక వడ్డీల కోసం వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు ఉంటున్నాయి. వీలైనంత వరకు ఆన్‌లైన్ రుణ యాప్‌ల జోలికి వెళ్లవద్దు. ఆర్‌బీఐ అనుమతి ఉందా లేదా అని తప్పకచూడాలి.

**క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాల సేకరణ**

బ్యాంకు అధికారులుగా చెబుతూ కేవైసీ అప్‌డేషన్, మీ క్రెడిట్ లేదా డెబిట్ కార్డు బ్లాక్ అయ్యిందంటూ.. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మోసాలకు పాల్పడతారు. మన నుంచే బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు తెలుసుకొని ఆన్‌లైన్‌లో డబ్బు కొల్లగొడతారు. బ్యాంకు అధికారులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఖాతాదారులకు ఫోన్ చేసి వివరాలు అడగరనేది అందరూ గుర్తించాలి.

## అయోధ్యకు శ్రీ రామపాదుకలు

హైదరాబాద్ నుంచి నేడు తీసుకెళ్లనున్న అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్

**హైదరాబాద్(ఓల్డ్ బోయిన్‌పల్లి):** అయోధ్య రామమందిరంలో ఉండబోయే శ్రీరామ పాదుకలు హైదరాబాద్‌లోనే సిద్ధమయ్యాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటకు చెందిన లోహశిల్పి రామలింగాచారి ఈ శ్రీరామ పాదుకలను తయారు చేశారు. ఈ పాదుకలను ఆదివారం భవానీనగర్‌లోని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి అలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇక్కడి నుంచి సోమవారం ఉదయం అయోధ్యకు తీసుకెళ్లేందుకు అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి ఏర్పాట్లు చేశారు. ఈ శ్రీరామ పాదుకలు తయారు చేయడానికి 12 కిలోల పైగా పంచలోహం వినియోగించారు. ఇందుకు 25 రోజులకు పైగా సమయం పట్టింది. శ్రీరామ పాదుకలు అలయంలో ఉంచారని తెలుసుకున్న ప్రజల వాటి దర్శనానికి బారులుతీరారు. అయోధ్యలో పాదుకలను తాకే అదృష్టం తమకు దక్కకపోవచ్చనే భావనతోనే ప్రజలు భారీగా తరలివచ్చారు.

## సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

**అన్నవరం:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు బహూకరించారు.

## ఐదు రైల్వే స్టేషన్లకు ఐఎస్‌ఓ గుర్తింపు

**కాకినాడ:** ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో చేస్తున్న కృషికి గాను జిల్లాలోని ఐదు రైల్వే స్టేషన్లకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐఎస్‌ఓ) గుర్తింపు లభించింది. జిల్లాలో 12 రైల్వే స్టేషన్లు ఉండగా వీటిలో కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు, సామర్లకోట, అన్నవరం, తుని స్టేషన్లకు ఈ గుర్తింపు దక్కింది. విజయవాడలో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో డివిజనల్ రైల్వే మేనేజర్ వీరేంద్ర పాటిల్ ఆయా స్టేషన్ల మేనేజర్లకు ఐఎస్‌ఓ అవార్డులు అందజేశారు. మెరుగైన సిగ్నలింగ్, టెలి కమ్యూనికేషన్ వ్యవస్థ నిర్వహణ, రైల్వే స్టేషన్ల ఆవరణను పచ్చదనం, స్వచ్ఛతతో తీర్చిదిద్దడం, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఐఎస్‌ఓకు ఎంపిక చేశారు. రైల్వే బోర్డు ద్వారా ఓ సంస్థ రైల్వే స్టేషన్ల పని తీరును అధ్యయనం చేసిన అనంతరం నాణ్యతా నిర్ధారణ పత్రాలను అందజేశారు.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.